

'సంపద అట్టడుగు వర్గాలకు చేరితే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15
సంచిక: 271

గురువారం 22-12-2022



SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



"కులం చూడం, మతం చూడం,
ప్రాంతం చూడం..
పార్టీలు అస్సలే చూడం."
ఈ మాటలు ఎవరు అనగలరు?
అన్ని వర్గాలనూ తన వర్గంగా..
రాష్ట్ర ప్రజలందరినీ తన
కుటుంబ సభ్యులుగా..
భావించిన త్యాగధనుడి
గుండెలోతుల్లోంచి
మాత్రమే ఇలాంటి మాటలు వస్తాయి.
జనం గుండెల్లో తాను...
తన గుండెల్లో జనం మాత్రమే ఉన్న జననేత..
ముఖ్యమంత్రి
వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి గారికి
హృదయపూర్వక
జన్మదిన శుభాకాంక్షలు.
అన్నా.. ప్రజల దీవెనలే
మీకు శ్రీరామరక్ష.



విద్య, వ్యవసాయం, ఆరోగ్యం,
పరిశ్రమలు, మహిళా సాధికారత..
ఏ రంగం గురించి
చెప్పాలన్నా ఇకమీదట
"సీఎం వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి
పాలనకు ముందు.. ఆ తరవాత"
అని చెప్పుకొంటారు. మీ దూరదృష్టి
అద్భుతం.. మీ రాజనీతి అపూర్వం.
మీ పాలనలో ఆంధ్రప్రదేశ్ సుభిక్షం,
సుసంపన్నం. ఆంధ్రప్రదేశ్ పాలిట
వరంలా దొరికిన మీరు..
నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో..
ముఖ్యమంత్రిగా
ఉండాలని..
మనసారా
కోరుకుంటూ..

మిమ్మల్ని దైవంలా భావించే
మీ...
ప్రతాప్ రెడ్డి భీమిరెడ్డి
ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి




'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 271

గురువారం 22-12-2022

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



అది ఆర్థిక సంక్షోభమే..

ధరల కట్టడికి చర్యలు తీసుకుంటున్నాం ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత్‌దాస్ - 13లో



మార్కెట్‌కు కరోనా ఫీవర్

సెన్సెక్స్ 635 పాయింట్ల పతనం నిఫ్టీకి 186 పాయింట్ల నష్టం - 13లో



అదో విషాదం

ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని 'ఓ విషాదం'గా రష్యా అధ్యక్షుడు పుతిన్ అభివర్ణించారు. ఉక్రెయిన్ ప్రజలను సోదరులుగానే చూస్తున్నామన్నారు.

వివరాలు 6లో ▸



ఉక్రెయిన్‌కు పేట్రియాట్ క్షిపణులు

ఉక్రెయిన్‌కు అమెరికా మరో భారీ సహాయ ప్యాకేజీని ప్రకటించింది. ఇందులో ఆయుధాలు, నిధులు ఉన్నాయి.

వివరాలు 6లో ▸



దేశ భద్రతపై మౌనమా?

'భారత్–చైనా సరిహద్దు'పై పార్లమెంట్‌లో చర్చించకుండా కేంద్రం మొండి వైఖరి అవలంభిస్తోందని సోనియా మండిపడ్డారు.

వివరాలు 6లో ▸



రెక్కలు నరికేస్తున్నారు

అఫ్గాన్‌లో మహిళల బతుకులు దుర్భరమైపోతున్నాయి. వర్సిటీల్లో మహిళలకు ప్రవేశం లేదని తాలిబన్లు హుకుం జారీ చేశారు.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

బలపడిన తీవ్ర అల్పపీడనం



నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం బుధవారం తీవ్ర అల్పపీడనంగా మారింది. ఇది గురువారం నాటికి వాయుగుండంగా బలపడనుంది. దీని ప్రభావం ఏపీపై నామమాత్రంగానే ఉండనుంది.

వివరాలు 14 ▸

మన వృత్తే.. మన గుర్తింపు!



జెండర్ రేఖను చెరిపేసిన ధీర.. వల్లూరి సుధీర.. ఏరోస్పేస్ మాన్యుఫాక్చరింగ్ ఇంజనీర్. ఈ రంగంలోకి అడుగుపెట్టడానికి స్ఫూర్తినిచ్చిన సందర్భం, తన ప్రయాణాన్ని ఆమె 'సాక్షి'తో పంచుకున్నారు.

వివరాలు 11 ▸

అంతరాలను సరిదిద్దుదాం

చదువుల్లో సమానత్వం తెచ్చి ఆర్థిక అసమానతలను అధిగమిద్దాం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్

- తరాలు మారుతున్నా పేదల తలరాతలు మారకుండా పెత్తందారుల కుట్ర.. పేద పిల్లలకు ఇంగ్లిష్ మీడియం వద్దంటూ కోర్టులకు వెళ్లారు
- వారి కుట్రలను భగ్నం చేయడానికి మేనమామగా పిల్లలకు నేనున్నా
- ఈ వ్యవస్థను మార్చే తిరుగుబాటులో మీవాడిగా మీకు తోడుంటా
- గొప్పింటి పిల్లలకు దీటుగా ఉన్నత చదువులు చదివేలా ప్రోత్సహిస్తాం
- ఇక నుంచి ఏటా 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ.. నాడు–నేడు తొలిదశ స్కూళ్లలో జూన్‌కి డిజిటల్ క్లాస్ రూంలు
- బాపట్ల జిల్లా యడ్లపల్లిలో విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ ప్రారంభించిన సీఎం
- విద్యార్థులు, టీచర్లకు 5,18,740 ట్యాబ్‌లు.. మొత్తంగా రూ.1,466 కోట్ల మేర ప్రయోజనం



బాపట్ల జిల్లా యడ్లపల్లిలో ప్రభుత్వం ఇచ్చిన ట్యాబ్‌లో సీఎం జగన్‌తో సెల్ఫీ దిగుతున్న విద్యార్థినులు

> నేను ఈరోజు.. నా పుట్టినరోజు గురించి కాదు.. ఈతరం బిడ్డల గురించి మాట్లాడుతున్నా. ఈ తరంలో పుట్టిన బిడ్డల భవిష్యత్తు గురించి ఆలోచన చేసి మాట్లాడుతున్నా. మంచి మేనమామగా, ఆ తల్లులకు ఒక మంచి అన్నగా భావి తరాన్ని ఉన్నత చదువులతో తీర్చిదిద్దే బాధ్యత తీసుకున్నా.
>
> \- ముఖ్యమంత్రి వైఎస్ జగన్

సాక్షి, నరసరావుపేట: తరాలు మారుతున్నా కొన్ని వర్గాల తలరాతలు మాత్రం మారకూడదన్న పెత్తందారుల సంకుచిత ధోరణులను బద్దలుకొడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ చదువులు, డిజిటల్ విద్యా విప్లవానికి శ్రీకారం చుట్టామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. 'పేదింటి పిల్లలు ఇంగ్లిష్ మీడియంలో చదవకూడదని ఆ వర్గం వారు కోర్టులకు వెళ్లారు. డిజిటల్ విద్యా బోధన తమ పిల్లలకు మినహా పేదలకు అందకూడదని పెత్తందారీ మనోభావాలున్నవారు ఆరాట పడుతున్నారు. ఇలాంటి వారిని చూసినప్పుడు బాధేసినా మూడున్నరేళ్లుగా ఎక్కడా ప్రభుత్వం వెనకడుగు వేయలేదు. పెత్తందారుల కుట్రలను భగ్నం చేయడానికి చిట్టి పిల్లలకు మంచి మేనమామగా, తల్లులకు మంచి అన్నయ్యగా నేను ఉన్నానని హామీ ఇస్తున్నా' అని సీఎం జగన్ పేర్కొన్నారు. బుధవారం బాపట్ల జిల్లా చుండూరు మండలం యడ్లపల్లిలోని ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీని సీఎం జగన్ ప్రారంభించి మాట్లాడారు. ఆ వివరాలివీ..

ఆర్థిక అసమానతలకు చదువులే విరుగుడు

డిజిటల్ విప్లవం గురించి చెప్పే ముందు సమాజంలో నెలకొన్న అంతరాలను మీ ముందు

మిగతా 3వ పేజీలో ▸

జేఈఈ మెయిన్ సిలబస్ ఖరారు



జేఈఈ మెయిన్–2023 సిలబస్‌ను ఎన్‌టీఏ విడుదల చేసింది. మ్యాథమెటిక్స్‌లో 16 టాపిక్‌లు, ఫిజిక్స్ సెక్షన్–ఏలో 20 టాపిక్స్, సెక్షన్–బిలో ప్రయోగ నైపుణ్యాలపై ప్రశ్నలుంటాయి. ఫిజికల్ కెమిస్ట్రీ, ఆర్గానిక్ కెమిస్ట్రీల్లో 10 చొప్పున టాపిక్స్ ఉన్నాయి.

10లో

మణిపూర్‌లో స్కూల్ బస్సు బోల్తా



మణిపూర్‌లోని నోనీ జిల్లాలో బుధవారం బస్సు బోల్తా పడటంతో ఏడుగురు విద్యార్థినులు ప్రాణాలు కోల్పోయారు. మరో 25 మంది గాయపడ్డారు. మృతుల కుటుంబాలకు, క్షతగాత్రులకు మణిపూర్ ప్రభుత్వం, కేంద్రం పరిహారం ప్రకటించాయి.

6లో

రక్తదానంలో ప్రపంచ రికార్డు ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



'రక్తదానం'లో గిన్నిస్, జీనియస్ రికార్డులు

- సీఎం జగన్ జన్మదినం సందర్భంగా రికార్డు స్థాయిలో రక్తదాన రిజిస్ట్రేషన్లు
- 24 గంటల్లో 1,29,451 మంది నమోదుతో ప్రపంచ రికార్డు.. శ్రేణులు, అభిమానులకు పార్టీ అభినందనలు

సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు రక్తదానం చేసేందుకు అంగీకారం తెలియజేసి(టేక్ ది ప్లెడ్జ్ సేవ్ ఏ లైఫ్) రికార్డు సృష్టించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా దేశ విదేశాల్లోని ఆయన అభిమానులు

మిగతా 3వ పేజీలో ▸

సందడే.. సందడి

- సీఎంకు ఆశీర్వచనం అందించిన తిరుమల పండితులు, సర్వమత పెద్దలు
- కేక్ కట్ చేయించిన మంత్రులు, అధికారులు

2లో

అంబరాన్నంటిన సంబరం

- సంక్షేమ సారథికి జన నీరాజనం
- ఊరూవాడ పండుగలా సీఎం జగన్ పుట్టిన రోజు వేడుకలు

10లో

విశ్రాంత ఐఏఎస్ అధికారికి సీబీఐ నోటీసులు

బిహార్ స్కాం కేసులో నెల్లూరులోని ఇంటికి అంటించి వెళ్లిన అధికారులు

నెల్లూరు(క్రైమ్): బిహార్ రాష్ట్రంలో ప్రభుత్వ స్కీంకు సంబంధించిన స్కాం కేసులో సీబీఐ బృందం ఓ విశ్రాంత ఐఏఎస్ అధికారి ఇంటికి నోటీసులు అంటించి వెళ్లింది. సేకరించిన సమాచారం మేరకు బిహార్ రాష్ట్రంలోని భాగల్పూర్ జిల్లాలో ప్రభుత్వానికి సంబంధించిన శ్రీజన్ స్కీంలో భారీ కుంభకోణంపై 2017లో పలు కేసులు నమోదయ్యాయి. ఈ కేసులను ఢిల్లీ సీబీఐ అధికారుల బృందం విచారణ చేపట్టింది. ఈ స్కాం జరిగిన సమయంలో భాగల్పూర్ జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన కర్రా పరుశురామయ్యను సీబీఐ అధికారులు విచారించాల్సి ఉంది. పదవీ విరమణ పొందిన పరుశురామయ్య నెల్లూరు నగరంలోని చైతన్యపురి కాలనీలో ఉంటున్నారన్న సమాచారంతో సీబీఐ ఇన్‌స్పెక్టర్ ఎస్‌బీఎస్ అమర్నాథ్ నేతృత్వంలోని బృందం ఇక్కడకు వచ్చింది. అయితే ఇంటికి తాళం వేసి ఉండడంతో ఇంటిగోడకు నోటీసులు అంటించారు. పరుశురామయ్య ఆచూకీ తెలిసిన వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని వేదాయపాలెం ఇన్‌స్పెక్టర్ నరసింహారావుకు సూచించి వెళ్లారు.

మళ్లీ మాస్కులేద్దాం

కరోనా ముప్పు ముగియలేదు.. ప్రజలంతా జాగ్రత్తలు పాటించాలి


- రద్దీ ప్రాంతాల్లో మాస్కు ధరించండి, బూస్టర్ డోసు తీసుకోండి
- కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ వినతి
- సీనియర్ అధికారులు, నిపుణులతో తాజా పరిస్థితిపై సమీక్ష



కరోనాపై అప్రమత్తం

- రాష్ట్రంలో అదుపులోనే వైరస్
- గత 50 రోజుల్లో 30వేల టెస్టులు చేయగా 130 పాజిటివ్ కేసుల నమోదు
- విలేజ్ క్లినిక్స్‌లోనే కరోనా నిర్ధారణ పరీక్షలు
- అందుబాటులో సరిపడా బెడ్స్, మందులు, ఆక్సిజన్

- వివరాలు 10లో



న్యూఢిల్లీ: చైనాతోపాటు ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో కోవిడ్–19 పాజిటివ్ కేసుల సంఖ్య అనూహ్యంగా పెరుగుతుండడంతో భారత ప్రభుత్వం అప్రమత్తమైంది. దేశంలో మహమ్మారి వ్యాప్తి, తాజా పరిస్థితిపై కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ బుధవారం సీనియర్ అధికారులు, ఆరోగ్య నిపుణులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. అంతర్జాతీయంగా కోవిడ్–19 వ్యాప్తి గురించి

మిగతా 10వ పేజీలో ▸

భారత్‌లో 3 'బీఎఫ్.7' కేసులు భయపడక్కర్లేదు

6లో

ఇదండీ సంగతి



తన సొంత రాష్ట్రం హిమాచల్‌ప్రదేశ్‌లో పార్టీ ఓడినా.. పీఎం గారి రాష్ట్రంలో గెలిపించడానికి తీవ్ర కృషి చేశారు!

నదుల అనుసంధానం ప్రాజెక్ట్‌కు తుది మెరుగులు

- అరణియార్‌ను సందర్శించిన జల వనరుల శాఖ కేంద్ర బృందం
- తెలంగాణ, ఆంధ్రా, తమిళనాడు రాష్ట్రాలకు లబ్ధి
- కేంద్ర జల వనరుల శాఖ సౌత్ ఇండియా చీఫ్ ఇంజనీర్ సంఖువా



అరణియార్‌ను ఆసక్తిగా చూస్తున్న కేంద్ర జలవనరుల శాఖ ఇంజనీరింగ్ బృందం

పిచ్చాటూరు: గోదావరి, కృష్ణా, కావేరి నదుల అనుసంధానం ప్రాజెక్ట్ డీపీఆర్‌కు తుది మెరుగులు దిద్దుతున్నట్టు కేంద్ర జల వనరుల శాఖ సౌత్ ఇండియా చీఫ్ ఇంజనీర్ డాక్టర్ ఆర్‌ఎస్ సంఖువా తెలిపారు. బుధవారం తిరుపతి జిల్లా అరణియార్‌ను కేంద్ర జల వనరుల శాఖ ఇంజనీరింగ్ బృందం సందర్శించింది. ప్రాజెక్టులో నీటి సామర్థ్యం, గేట్ల పరిస్థితి వంటి అంశాలపై తిరుపతి జిల్లా క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈ వెంకటరామయ్య, డీఈలు రత్నారెడ్డి, గురివిరెడ్డిలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్‌ఎస్ సంఖువా 'సాక్షి' తో మాట్లాడుతూ.. గోదావరి, కృష్ణా, కావేరి నదుల అనుసంధానం ప్రాజెక్ట్‌కు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఇందులో భాగంగా కాలువల ద్వారా సోమశిల ప్రాజెక్టు నుంచి అరణియార్ మీదుగా తమిళనాడు తంజావూరు జిల్లాలో కావేరి నదిపై ఉన్న గ్రాండ్ ఆనకట్ట అనుసంధానం డీపీఆర్‌ను ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి సమర్పించామన్నారు. ఈ ప్రాజెక్ట్‌కు రూ.86 వేల కోట్లు ఖర్చు అవుతుందన్నారు. ఇది పూర్తయితే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లోని 9.45 హెక్టార్ల భూమికి సాగునీరు అందుతుందన్నారు. మూడు రాష్ట్రాలు అంగీకరిస్తే ఈ పనులను చేపట్టి ఐదేళ్లలో పూర్తిచేస్తామన్నారు. తమిళనాడు ప్రభుత్వం గ్రాండ్ ఆనకట్టకు బదులుగా కట్టలై బ్యారేజ్‌కు అనుసంధానం చేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిందన్నారు. ఈ నేపథ్యంలో సోమశిల–గ్రాండ్ ఆనకట్టకు ప్రత్యామ్నాయంగా సోమశిల నుంచి అరణియార్ మీదుగా తమిళనాడులోని మయనూరు వద్ద కావేరిపై ఉన్న కట్టలై బ్యారేజ్‌కు నీటిని తరలించే మరో డీపీఆర్‌ను సిద్ధం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎన్‌డబ్ల్యూడీఏ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆర్.బాలక్రిష్ణన్ పాల్గొన్నారు.

సూళ్లూరుపేట ఆర్డీవో అరెస్ట్

పౌరసరఫరాల సంస్థ కుంభకోణం కేసులో

నెల్లూరు(అర్బన్): రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన జిల్లా పౌరసరఫరాల సంస్థ కుంభకోణం కేసులో ఎట్టకేలకు సూళ్లూరుపేట ఆర్డీవో రోజ్‌మాండ్‌ను ఏసీబీ డీఎస్పీ ఆర్.మోహన్ ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. రాష్ట్ర ఆడిట్ అధికారులు అక్టోబర్ నెలలో సంస్థలో తనిఖీలు చేయడంతో ఈ అవినీతి వ్యవహారం వెలుగు చూసింది. రైతుల ధాన్యానికి సంబంధించిన రవాణా చార్జీలు, హమాలీ కూలీలు చెల్లించకుండా మింగేశారని అధికారులు గుర్తించారు. దీంతో అప్పట్లో డీఎంగా ఉన్న పద్మను సస్పెండ్ చేశారు. అనంతరం అరెస్టు చేశారు. ఈ వ్యవహారంపై జేసీ కూర్మనాథ్ విచారణ చేశారు. రూ.40 కోట్ల వరకు అవినీతి జరిగిందని లెక్కలు తీశారు. ఇంకా ముందు సంవత్సరాలకు వెళ్తే మరింత అవినీతి బయటపడొచ్చని జేసీ ప్రకటించారు. ప్రాథమిక సమాచారంతో 32 మంది పాత్ర ఉన్నట్లు గుర్తించారు. ఈ విషయాన్ని నిగ్గు తేల్చేందుకు కలెక్టర్ చక్రధర్‌బాబు ద్వారా కేసును ఏసీబీకి అప్పగించారు. గతంలో పౌరసరఫరాల సంస్థ డీఎంగా పనిచేసిన, ఇప్పటి సూళ్లూరుపేట ఆర్డీవో రోజ్‌మాండ్ పాత్ర కూడా ఈ వ్యవహారంలో ఉందని ప్రచారం జరిగింది. అయితే ఆమె పేరును పోలీసులు కేసులో చేర్చలేదు. 11 మందిని అరెస్ట్ చేశారు. సూత్రధారి శివకుమార్, మరికొంతమందిని అదుపులోకి తీసుకోగా వారిచ్చిన సమాచారంతో ఒక్కొక్కరిని అరెస్ట్ చేసుకుంటూ వచ్చారు. ఎట్టకేలకు ఏసీబీ అధికారుల విచారణలో రోజ్‌మాండ్ పాత్ర ఉందని తేలడంతో ఆమెను సూళ్లూరుపేటలో అరెస్ట్ చేశారు. నెల్లూరు ఏసీబీ కోర్టుకు తరలించగా రిమాండ్ విధించారు. ఇప్పటికే అక్రమాస్తులు కూడబెట్టిన శివకుమార్‌తోపాటు పలువురి ఆస్తులను ఏసీబీ పోలీసులు సీజ్ చేశారు. క్రయవిక్రయాలు జరగకుండా రిజిస్ట్రార్‌కు కలెక్టర్ ద్వారా ఆదేశాలిచ్చారు.

క్లుప్తంగా...

అంతర్ జిల్లాల బాలికల క్రికెట్ టోర్నీ ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ మాధవీలత

దేవరపల్లి: తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం పల్లంట్ల జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 66వ అంతర్ జిల్లాల అండర్-17 బాలికల క్రికెట్ టోర్నమెంట్ బుధవారం ఘనంగా ప్రారంభమైంది. సీఎం వైఎస్ జగన్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్‌ను కలెక్టర్ కె. మాధవీలత, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, విశాఖ స్మార్ట్ సిటీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గన్నమని వెంకటేశ్వరరావు (జీవీ) జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ టోర్నీకి 203 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వారికి సహాయంగా 26 మంది కోచ్‌లు, మేనేజర్లతో పాటు 30 మంది అంపైర్స్, రిఫరీస్, 30 మంది పీడీలు, 5 సెలక్షన్ కమిటీలు పాల్గొంటున్నాయి. మూడు రోజుల పాటు టోర్నమెంట్ జరుగుతుంది. 23న విజేతలకు బహుమతులు అందజేస్తారు. పోటీల ప్రారంభం సందర్భంగా కలెక్టర్ మాధవీలత, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, గన్నమని వెంకటేశ్వరరావు పావురాలను ఎగురవేశారు. అనంతరం కలెక్టర్ మాధవీలత బ్యాటింగ్ చేయగా, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు బౌలింగ్ చేసి.. పోటీలు ప్రారంభించారు.

అంబేడ్కర్ జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలి

సాక్షి, అమరావతి: ప్రతి తరగతిలోనూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్రను పాఠ్యాంశంగా పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డికి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం విజ్ఞప్తి చేసింది. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కె.వినాయకం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాసు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోహన్ తదితరులు సచివాలయంలో బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డిని కలిసి శాలువ కప్పి అంబేడ్కర్ షీల్డ్ అందజేశారు. ఈ సందర్భంగా పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆయనకు అందజేశారు.

రాజగోపాల్ అన్నా.. తొందర పడకు

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

సాక్షి, హైదరాబాద్: మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తనపై ట్విటర్ వేదికగా చేసిన వ్యాఖ్యలను ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తిప్పికొట్టారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఈడీ చార్జిషీట్‌లో అంశాలను ప్రస్తావిస్తూ 'లిక్కర్ క్వీన్' అని.. చార్జిషీట్‌లో కవిత పేరును 28 సార్లు పేర్కొన్నారని.. రాజగోపాల్ ట్వీట్ చేయడంపై ఆమె స్పందించారు. 'రాజగోపాల్ అన్నా.. తొందరపడకు, మాట జారకు, 28 సార్లు నా పేరు చెప్పించినా, 28 వేల సార్లు చెప్పించినా అబద్ధం నిజం కాదు. నిజమే గెలుస్తుంది' అని వ్యాఖ్యానించారు. 'నా మీద వస్తున్న ఆరోపణలన్నీ పూర్తిగా అసంబద్ధం, అవాస్తవం. నా నిజాయితీని కేవలం కాలం మాత్రమే రుజువు చేస్తుంది. బీజేపీ రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో ఇదొక భాగం.' అని కవిత ట్వీట్ చేశారు. కవిత బుధవారం సాయంత్రం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌తో భేటీ అయ్యారు.

వ్యవసాయ సంస్కరణల్లో ఏపీ ఆదర్శం

- ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ ఎండీ శేఖర్‌బాబు
- సుస్థిర వ్యవసాయాభివృద్ధిపై సదస్సు నిర్వహణ

సాక్షి అమరావతి: సమీప భవిష్యత్‌లో వ్యవసాయ–ఆహార విధానాల్లో రాష్ట్రం సుస్థిర అభివృద్ధి సాధించి దేశంలోనే అగ్రగామిగా నిలుస్తుందని ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ గెడ్డం శేఖర్‌బాబు అన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ, ఆహార, వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏవో) సహకారంతో బుధవారం విజయవాడంలోని ఓ హోటల్‌లో వ్యవసాయ, ఉద్యాన శాఖల్లో శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్లకు వర్క్‌షాప్ నిర్వహించారు. డాక్టర్ వైఎస్సార్ పొలంబడి, మేలైన యాజమాన్య పద్ధతులపై 'పర్యవేక్షణ, మూల్యాంకనం' (మోనిటరింగ్ అండ్ ఎవాల్యూయేషన్) అంశంపై సదస్సు జరిగింది. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతుల అభివృద్ధి కోసం అమలు చేస్తున్న వివిధ పథకాలు సత్ఫలితాలనిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో 10,778 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు విత్తనం నుంచి పంట విక్రయం వరకు అన్ని సేవలను గడపవద్దనే అందిస్తున్నామని తెలిపారు. మన వ్యవసాయ సంస్కరణలను దేశమంతా అనుసరిస్తుందని చెప్పారు. రైతుల ఆదాయం పెంచాలనే ఉద్దేశంతో గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్, ఆర్గానిక్ సర్టిఫికేషన్ కోసం శిక్షణ ఇచ్చామన్నారు. ఆంధ్రప్రదేశ్ విత్తన ధృవీకరణ సంస్థ డైరెక్టర్ డాక్టర్ ఎం.త్రివిక్రమరెడ్డి రైతులు పండించిన ఉత్పత్తులకు మంచి ధర లభించేందుకు జీఏపీ సర్టిఫికేషన్ ప్రాధాన్యతను వివరించారు. ఆహార, వ్యవసాయ సంస్థ భారత ప్రతినిధి డాక్టర్ చావా కొండారెడ్డి మాట్లాడుతూ.. విత్తనం నుంచి పంట విక్రయం వరకు రైతులకు సేవలందిస్తున్న ఆర్బీకే తరహా వ్యవస్థను అన్ని రాష్ట్రాల్లో ఏర్పాటు చేయాలని నీతి ఆయోగ్ సభ్యుడు రమేష్ చంద్ర సూచించిన విషయాన్ని గుర్తుచేశారు. ఉద్యాన శాఖ అదనపు సంచాలకులు వెంకటేశ్వర్లు, ఆర్బీకే సంయుక్త సంచాలకులు వి. శ్రీధర్, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

క్యాట్ ఫలితాల్లో తిరుపతి విద్యార్థికి రాష్ట్రస్థాయి మొదటి ర్యాంకు



రెడ్డప్పగారి కేతన్‌రెడ్డిని అభినందిస్తున్న కౌటిల్య విద్యా సంస్థ డైరెక్టర్ శ్రీధర్

తిరుపతి ఎడ్యుకేషన్: దేశంలోని ప్రతిష్టాత్మకమైన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) విద్యా సంస్థల్లో ఎంబీఏలో ప్రవేశానికి నిర్వహించే కామన్ ఎంట్రెన్స్ టెస్టు (క్యాట్) ఫలితాల్లో తిరుపతికి చెందిన కౌటిల్య విద్యా సంస్థ విద్యార్థి రెడ్డప్పగారి కేతన్‌రెడ్డి రాష్ట్ర స్థాయి మొదటి ర్యాంకు సాధించాడు. ఈ ఫలితాలు బుధవారం సాయంత్రం విడుదలయ్యాయి. పోలీస్ హౌసింగ్ శాఖలో డెప్యుటీ ఇంజనీర్ ఆర్.హరినాథరెడ్డి, రాజ్యలక్ష్మి దంపతుల కుమారుడు కేతన్‌రెడ్డి 99.62 పర్సంటైల్ స్కోరు సాధించి రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించినట్లు ఆ విద్యా సంస్థ డైరెక్టర్ శ్రీధర్ తెలిపారు. అలాగే కరణం చందన 98.56, టి.భార్గవి 97.94, దాసరి మురారిరెడ్డి 91.27 పర్సంటైల్ సాధించారని, మరో 15 మంది విద్యార్థులు 90కి పైగా పర్సంటైల్ స్కోరు సాధించినట్లు తెలిపారు. రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన కేతన్‌రెడ్డిని అభినందించారు.

సత్తా చాటిన కంభం విద్యార్థి



కేవీఎస్ అభినయ్

కంభం: క్యాట్ ఫలితాల్లో ప్రకాశం జిల్లా కంభం విద్యార్థి కేవీఎస్ అభినయ్ 96.30 పర్సంటైల్ సాధించి సత్తాచాటాడు. బీటెక్ చదివి, బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న అభినయ్ మొదటి ప్రయత్నంలోనే ప్రతిభ చాటాడని అతని తండ్రి కేవీ బాబు రావు తెలిపారు. ఈ సందర్భంగా అభినయ్‌ను పలువురు అభినందించారు.

ఇక మన నినాదం జై భారత్

క్రిస్మస్ వేడుకల్లో తెలంగాణ సీఎం కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: 'అశాంతి, అసంతృప్తి, ఆత్మహత్యలతో దిక్కుతోచని స్థితిలో ఉన్న తెలంగాణ ప్రజానీకం కోసం జై తెలంగాణ నినాదంతో యుద్ధం చేసి విజయం సాధించాం. ప్రత్యేక రాష్ట్రాన్ని దక్కించుకుని స్వయం పాలనతో దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచాం. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, తలసరి ఆదాయం వృద్ధి ఇలా అన్నింటా అద్భుత ప్రగతి సాధించి తెలంగాణను దేశంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దాం. ఇప్పుడు అదే స్ఫూర్తితో జై భారత్ నినాదాన్ని ఎత్తుకున్నాం. అన్ని వర్గాల మద్దతు కూడగట్టుకుని దేశాన్ని ప్రపంచంలోనే గొప్ప శాంతికాముక అభివృద్ధి దేశంగా తీర్చిదిద్దాలని తలచి మరో యుద్ధాన్ని మొదలు పెట్టాం. కులమతాలకు అతీతంగా అన్నివర్గాల మద్దతుతో విజయం సాధిస్తామని ఆశిస్తున్నా' అని బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో కేసీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి వేగాన్ని దేశమంతా అమలు చేస్తే ప్రపంచంలోనే ఒక గొప్ప దేశంగా భారత్ దూసుకెళ్తుందన్నారు. కులం, జాతి, వర్గం అనే తేడా లేకుండా అన్ని పండుగలను ప్రభుత్వమే నిర్వహిస్తుండటం గొప్ప విషయమని తెలిపారు.



కేక్ కట్ చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



తల్లి విజయమ్మ, సతీమణి వైఎస్ భారతి, ఇతర కుటుంబ సభ్యులతో సీఎం జగన్

సందడే.. సందడి

ఉత్సాహంగా సీఎం జగన్ జన్మదిన వేడుకలు

- ముఖ్యమంత్రికి ఆశీర్వచనం అందించిన తిరుమల పండితులు, సర్వమత పెద్దలు
- కేక్ కట్ చేయించిన మంత్రులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు
- వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మిన్నంటిన వేడుకలు
- భారీగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు
- పెద్ద ఎత్తున అన్నదానం, రక్తదానం, దుస్తుల పంపిణీ



ఫోన్‌లో శుభాకాంక్షలు అందుకుంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు బుధవారం కనులపండువగా జరిగాయి. తాడేపల్లిలోని నివాసంలో సీఎం జగన్‌తో పలువురు మంత్రులు, సీఎంవో అధికారులు కేక్ కట్ చేయించారు. ఇదే సమయంలో గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ దంపతులు ఫోన్ చేసి సీఎంకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం వేదపండితులు ఆశీర్వచనం అందించగా.. టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి దంపతులు శ్రీవారి ప్రసాదాలు అందజేశారు. పాస్టర్ జాన్ వెస్లీ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌కు డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తానేటి వనిత, ఆర్కే రోజా, విడదల రజిని, జోగి రమేష్, ప్రభుత్వ సలహాదారు(ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి, ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, బాలశౌరి, సీఎస్ డాక్టర్ జవహర్‌రెడ్డి, డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి, మాజీ మంత్రులు బాలినేని శ్రీనివాసరెడ్డి, పేర్ని నాని, కొడాలి నాని, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ, ప్రభుత్వ సలహాదారు(సామాజిక న్యాయం) జూపూడి ప్రభాకరరావు, సీఎం సలహాదారు(గ్రామ, వార్డు సచివాలయాలు) ఆర్.ధనుంజయ్ రెడ్డి, సీఎంవో అధికారులు ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛాలు అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఎదిగేకొద్దీ ఒదిగి ఉండటమే సీఎం నైజం..

ప్రజల్లో ఉండటం, ప్రజలకు సేవ చేయడంపైనే సీఎం వైఎస్ జగన్ దృష్టి పెట్టారని.. ఎదిగే కొద్దీ ఒదిగి ఉండాలన్నదే ఆయన నైజమని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు(ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం వద్ద బుధవారం సీఎం పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యకర్తలు, నాయకులు, ప్రజలు భారీగా తరలివచ్చి.. సీఎం జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. సీఎం ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. 500 కిలోల భారీ కేక్‌ను సజ్జల రామకృష్ణారెడ్డి కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ మూడున్నరేళ్లలోనే పల్లెల రూపురేఖలను మార్చారని.. విద్య, వైద్యం, వ్యవసాయం.. ఇలా అన్ని రంగాల్లోనూ విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చారని వివరించారు. మేనిఫెస్టోలోని 98 శాతం హామీలను నెరవేర్చారని గుర్తుచేశారు. రాష్ట్రంలో కొందరు నాయకుల్లాగా సీఎం జగన్ ప్రజల్ని బెదిరించట్లేదని.. పాలన నచ్చితేనే వచ్చే ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరుతున్నారని.. ఇది నిజమైన రాజకీయ నాయకుడికి కావాల్సిన లక్షణమన్నారు.అనంతరం పేదలకు దుస్తుల పంపిణీ, అన్నదానం కార్యక్రమాలు నిర్వహించారు. పార్టీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. దివ్యాంగులకు ట్రై సైకిల్స్ పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు. మంత్రి జోగి రమేష్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, తెలుగు అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీ పార్వతి, అధికార భాషా సంఘం చైర్మన్ విజయబాబు, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ, నాయకులు చల్లా మధు, మర్రి రాజశేఖర్, పుత్తా ప్రతాప్‌రెడ్డి, కావటి మనోహర్‌నాయుడు, 'నవరత్నాల' మూర్తి, రవిచంద్రారెడ్డి, కాకుమాను రాజశేఖర్, బత్తుల బ్రహ్మానందరెడ్డి, నారమల్లి పద్మజ, జియాఉద్దీన్, అడపా శేషు, మేడపాటి వెంకట్, పానుగంటి చైతన్య, కిరణ్‌రాజ్, దేవళ్ల రేవతి, శివశంకర్, ఈద రాజశేఖర్, మిమిక్రీ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

హస్తినలోనూ ఘనంగా..

సాక్షి, న్యూఢిల్లీ: సీఎం వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు దేశ రాజధాని ఢిల్లీలో ఘనంగా జరిగాయి. ఏపీ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎంపీలు, ఏపీ భవన్ అధికారులు, ఉద్యోగులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని.. కేక్ కట్ చేసి సీఎం పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి మాట్లాడుతూ.. భారత రాజకీయ వ్యవస్థలోనే జగన్‌కు ఒక ప్రత్యేక స్థానం ఉందన్నారు. ప్రజా సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యమని.. పేదల అభివృద్ధే ఆయన ధ్యేయమని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీలు మిథున్‌రెడ్డి, మార్గాని భరత్, వంగా గీత, తలారి రంగయ్య, రెడ్డప్ప, మాధవ్, గురుమూర్తి, సంజీవ్, లావు కృష్ణదేవరాయులు, శ్రీధర్, ఆర్.కృష్ణయ్య, కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పరశురామ్, జాతీయ సలహాదారు ఆళ్ల రామకృష్ణ పాల్గొన్నారు.

ట్విట్టర్‌లో సీఎం జగన్ ట్రెండింగ్

- దేశ వ్యాప్తంగా ప్రథమ స్థానం, ప్రపంచ వ్యాప్తంగా ఐదో స్థానం
- శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని, కేంద్ర మంత్రులు, పలు రాష్ట్రాల సీఎంలు, సినీ నటులు తదితరులు
- ప్రతి ఒక్కరికీ తిరిగి ధన్యవాదాలు తెలియచేసిన సీఎం



సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా సోషల్ మీడియా వేదికగా ఆయన అభిమానులు, వైఎస్సార్ కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది సీఎం జగన్ అభిమానులు తమ అభిమాన నాయకుడికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ #HBDYSJagan అనే హ్యాష్ టాగ్‌తో 5 లక్షల 50 వేలకు పైగా ట్వీట్స్‌తో, మూడు వందల మిలియన్స్‌కి పైగా రీచ్‌తో ట్రెండ్ చేశారు. డిసెంబర్ 20 సాయంత్రం ఐదు గంటలకు ఈ ట్రెండ్ మొదలవగా.. సీఎం జగన్ అభిమానుల ట్వీట్ల సునామీతో దేశవ్యాప్తంగా ట్రెండింగ్‌లో ప్రథమ స్థానంలో, ఆసియా ఖండంలో నాలుగో స్థానంలో, ప్రపంచ వ్యాప్తంగా ఐదో స్థానంలో నిలవడం విశేషం. ట్విట్టర్ వేదికగా సీఎం వైఎస్ జగన్ అభిమానుల జన్మదిన శుభాకాంక్షల ట్వీట్ల ప్రవాహం నిరాటంకంగా కొనసాగడం దేశంలో మరే ఇతర నాయకుడికీ జరగలేదు. ప్రధాని నరేంద్ర మోదీ సీఎం జగన్‌కు ట్విట్టర్ ద్వారా పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. దేవుడి ఆశీస్సులతో ఆయురారోగ్యాలతో దీర్ఘకాలం జీవించాలంటూ పేర్కొన్నారు. దానిపై సీఎం జగన్ స్పందిస్తూ 'శ్రీ మోదీ గారు.. మీ శుభాకాంక్షలకు కృతజ్ఞతలు తెలియచేసుకుంటున్నా'.. అంటూ ట్వీట్ చేశారు. కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, నితిన్ గడ్కరీ, గజేంద్రసింగ్ షెకావత్, నారాయణ రాణే, భూపేందర్‌సింగ్, అర్జున్ ముండా, పశుపతి కుమార్‌పరాస్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాలు అభినందనలు తెలపగా.. ప్రతి ఒక్కరికీ సీఎం జగన్ కృతజ్ఞతలు తెలుపుతూ ట్వీట్ చేశారు. రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్, తమిళనాడు సీఎం స్టాలిన్, కర్ణాటక సీఎం బొమ్మై, మేఘాలయ సీఎం కన్‌రడ్ సంగ్మా, అసోం సీఎం హిమాంత్ బిశ్వశర్మలు శుభాకాంక్షలు తెలిపారు. ఇండియాలో ఆస్ట్రేలియా హై కమిషనర్ బారి వో ఫారెల్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్ గారియత్ వైన్ ఓవెన్‌లు సీఎంకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. సినీ ప్రముఖులు చిరంజీవి, నాగార్జున, మోహన్‌బాబు, విశాల్, అల్లు అర్జున్, మంచు విష్ణు, డైరెక్టర్ మారుతీ, బీవీఎస్ రవి తదితరులు ట్వీట్ ద్వారా సీఎంకు శుభాకాంక్షలు చెప్పారు. సోదరి వైఎస్ షర్మిల అన్నాచెల్లెలు కలిసి ఉన్న చిన్ననాటి ఫొటోను షేర్ చేస్తూ హ్యాపీ బర్త్‌డే అన్నయ్యా.. అంటూ ట్వీట్ చేశారు.

ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలి


సీఎంకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన గవర్నర్



సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్‌కు గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తిరుమల వేంకటేశ్వరస్వామి, పూరీ జగన్నాథస్వామి.. సీఎం జగన్‌కు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆయన ఆకాంక్షించారు. రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపించేందుకు భగవంతుడు తగిన ఆశీస్సులు అందించాలని ప్రార్థిస్తున్నట్లు బుధవారం సీఎంకు రాసిన లేఖలో గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ పేర్కొన్నారు.


సీఎం జగన్‌కు ప్రధాని మోదీ జన్మదిన శుభాకాంక్షలు

కేంద్ర మంత్రులు, సీఎంల నుంచి శుభాకాంక్షల వెల్లువ



సాక్షి, న్యూఢిల్లీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. 'ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు. ఆయన ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరుకుంటున్నా' అని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. కేంద్ర మంత్రులు భానూప్రసాద్‌సింగ్ వర్మ, సోమ్‌ప్రకాశ్, అరుణాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి పెమాఖండూ, బీజేపీ సీనియర్ నేత మురళీధర్‌రావు తదితరులు ట్విట్టర్ ద్వారా సీఎం జగన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జననేతగా ఆయన మరిన్ని విజయాలు అందుకోవాలని ఆకాంక్షించారు.

సీఎం జగన్‌కు చంద్రబాబు శుభాకాంక్షలు



సాక్షి, అమరావతి: పుట్టినరోజు సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌కు టీడీపీ అధినేత చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. 'బర్త్ డే గ్రీటింగ్స్ టు వైఎస్ జగన్' అని బుధవారం ఆయన ట్వీట్ చేశారు. దీనికి సీఎం జగన్ ట్విట్టర్‌లో చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

పవన్‌కళ్యాణ్, సోము వీర్రాజు కూడా...

జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ సీఎం జగన్‌కు ఓ ప్రకటనలో పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. 'సీఎం వైఎస్ జగన్ కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. ఆ భగవంతుడు మీకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని మనసారా కోరుకుంటున్నాను' అని ఆయన పేర్కొన్నారు. కాగా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు సీఎం జగన్‌కు ఓ ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. 'సీఎం వైఎస్ జగన్‌కు హృదయపూర్వక శుభాకాంక్షలు. భగవంతుడు మీకు ఆరోగ్యం, దీర్ఘాయువును ప్రసాదించాలని కోరుకుంటున్నాను' అని పేర్కొన్నారు.

కొత్త శకానికి నాంది

విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

సాక్షి, నరసరావుపేట: 'ఇది కొత్త శకానికి నాంది పలికిన రోజు. మన విద్యార్థులు పోటీతత్వంతో ప్రపంచ వ్యాప్తంగా రాణించాలి. సీఎం జగన్ ఆలోచనలకు దిక్సూచిలా, రాబోయే తరాలకు ఆదర్శంగా ఉండాలి' అని విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. బాపట్ల జిల్లా చుండూరు మండలం యడ్లపల్లిలో బుధవారం ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు సీఎం వైఎస్ జగన్ ట్యాబ్‌లు పంపిణీ చేసే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జగనన్న హయాంలో నిలదొక్కుకున్న భావి భారత పౌరులమని గర్వంగా చెప్పుకునేలా నిలవాలని కోరుకుంటున్నానని ఆకాంక్షించారు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ.. అంబేడ్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే, నెల్సన్ మండేలా ఆలోచనా విధానాలు, ఆదర్శాలకు ప్రతిరూపం సీఎం జగన్ అని అన్నారు. 'ఒకప్పుడు పేదవాడు చదవాలంటే పలక ఉంటే బలపం ఉండేది కాదు. చొక్కా ఉంటే నిక్కర్ ఉండేది కాదు. బడికి వెళితే తలుపులు, కిటికీలు ఉండేవి కావు. కానీ ఈరోజు మీరు విద్యకు అత్యంత ప్రాధాన్యమిచ్చి నాడు– నేడు ద్వారా ప్రభుత్వ స్కూళ్లను బ్రహ్మాండంగా తీర్చి దిద్దారు. 8వ తరగతి పిల్లలకు అరచేతిలో ప్రపంచాన్ని చూపేలా ట్యాబ్‌లు ఇస్తున్నారు' అని అన్నారు.

థ్యాంక్యూ మామా..!

జగన్ మామా.. హ్యాపీ బర్త్ డే. గత మూడేళ్లుగా విద్యా వ్యవస్థలో మీరు తెచ్చిన మార్పులను ప్రత్యక్షంగా చూస్తున్నాం. అమ్మ ఒడి పథకం పేద, మధ్య తరగతి విద్యార్థులకు వరం లాంటిది. నాడు నేడు కార్యక్రమం, ఇంగ్లిషు మీడియం, ట్యాబ్‌ల పంపిణీ ఇలా విద్యారంగంలో విప్లవాత్మక చర్యలు తీసుకుంటున్నారు. మామా.. థ్యాంక్యూ.

– సాయి నాగశ్రీ, 8 వ తరగతి విద్యార్థిని, జెడ్పీ హెచ్ఎస్ ఐలవరం, వేమూరు నియోజకవర్గం

బర్త్‌డే కానుక..

మామయ్యా.. మీరు సీఎం అయిన తర్వాత నాడు నేడు, అమ్మ ఒడి, విద్యాకానుక, గోరుముద్ద లాంటి ఎన్నో పథకాలు తెచ్చారు. ప్రభుత్వ స్కూళ్లలో అన్ని వసతులు కల్పించారు. విద్యాకానుక ద్వారా యూనిఫామ్స్, షూస్, బుక్స్, డిక్షనరీ ఇస్తున్నారు. బుక్స్ క్వాలిటీ చాలా బాగుంది. మాకు ఏ సందేహం వచ్చినా డిక్షనరీలో చూసుకుంటున్నాం. పుట్టినరోజు సందర్భంగా మేం మీకు కానుక ఇవ్వాలి కానీ మీరే మాకు ట్యాబ్‌లు ఇస్తున్నారు. బాగా చదువుకుని మీ పేరు నిలబెడతాం జగన్ మామయ్యా. మాపట్ల మీరు చూపుతున్న ప్రేమకు కృతజ్ఞతలు. గోరుముద్ద ద్వారా రుచికరమైన, పౌష్టికాహారం ఇస్తున్నారు. చాలా ఇష్టంగా తింటున్నాం, ధన్యవాదాలు జగన్ మామా..

– సాత్విక, 8 వ తరగతి విద్యార్థిని, మునిసిపల్ గరల్స్ హైస్కూల్, తెనాలి


సర్దుకుపోదాం రండి..

- నేడు టీపీసీసీ నేతలతో హైదరాబాద్‌లో దిగ్విజయ్ భేటీ

సాక్షి, హైదరాబాద్/ న్యూఢిల్లీ: రాష్ట్ర కాంగ్రెస్ నేతల మధ్య నెలకొన్న అంతర్గత సమస్యలను పరిష్కరించేందుకు అధిష్టానం దూతగా.. పార్టీలో ట్రబుల్ షూటర్‌గా పేరున్న సీనియర్ నేత దిగ్విజయ్‌సింగ్ హైదరాబాద్ వచ్చారు. బుధవారం రాత్రి 8:30 గంటల సమయంలో శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు ఏఐసీసీ కార్యదర్శి, ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు, మాజీ మంత్రి షబ్బీర్ అలీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు మహేశ్‌కుమార్‌గౌడ్, అంజన్ కుమార్‌యాదవ్, పార్టీ ముఖ్య నేతలు హర్కర వేణుగోపాల్‌రావు, సంగిశెట్టి జగదీశ్ తదితరులు స్వాగతం పలికారు. దిగ్విజయ్ శంషాబాద్ నుంచి నేరుగా తాజ్ కృష్ణా హోటల్‌కు చేరుకున్నారు. అక్కడ భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆయన్ను కలిశారు. పార్టీలో నెలకొన్న పరిస్థితులను, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వైఖరిని వివరించినట్లు సమాచారం. కాగా గురువారం ఉదయం గాంధీభవన్‌లో దిగ్విజయ్ రాష్ట్ర కాంగ్రెస్ నేతలతో సమావేశం కానున్నారు. పీసీసీ డెలిగేట్ల నియామకం నుంచి పీసీసీ కమిటీల ఏర్పాటు, రేవంత్ రెడ్డితో సీనియర్ల సమన్వయం, పార్టీ నేతల మధ్య నెలకొన్న విభేదాలకు గల కారణాలపై వారితో ఆయన చర్చించనున్నారు. ఈ భేటీ అనంతరం గురువారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో దిగ్విజయ్ మీడియాతో మాట్లాడనున్నారు.

ఇప్పటికే సమాచార సేకరణ

తెలంగాణ కాంగ్రెస్ పరిస్థితిపై దిగ్విజయ్ సింగ్ ఇప్పటికే కొంత సమాచారాన్ని సేకరించారు. హైదరాబాద్ బయలుదేరడానికి ముందే ఢిల్లీలో ఏఐసీసీ ఇన్‌చార్జి కార్యదర్శులు నదీమ్ జావెద్, బోసురాజుతో సమావేశమయ్యారు. పార్టీలో విభేదాలకు గల కారణాలపై ఆరా తీశారు. రేవంత్‌రెడ్డితో సీనియర్లకు పొసగకపోవడానికి గల కారణాలు, పీసీసీ కమిటీపై సీనియర్ల అభ్యంతరాలు, వారి డిమాండ్లు అడిగి తెలుసుకున్నారు. పీసీసీలో రేవంత్ వర్గంగా ఉన్న నేతల వివరాలు, వారి రాజీనామాల అంశంపై కూడా చర్చ జరిగినట్లు తెలిసింది. రేవంత్‌కు, సీనియర్ల మధ్య సమన్వయానికి పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జి మాణిక్యం ఠాగూర్ చేసిన ప్రయత్నాల వివరాలను తీసుకున్నారు. అనంతరం పార్లమెంట్‌కు వెళ్లిన దిగ్విజయ్.. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్యం ఠాగూర్‌తోనూ సమావేశమై పార్టీలో విభేదాలపై చర్చించారు. ఆ తర్వాతే హైదరాబాద్ బయలుదేరారు.



సైకతంతో సీఎంకు శుభాకాంక్షలు

సీఎం వైఎస్ జగన్ పుట్టిన రోజును పురస్కరించుకుని తూర్పుగోదావరి జిల్లా కడియం ఉన్నత పాఠశాలలో బుధవారం సైకత శిల్పాన్ని రూపొందించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, కడియం సొసైటీ అధ్యక్షుడు గిరజాల వీర్రాజు (బాబు) ఆధ్వర్యంలో ఒడిశాకు చెందిన సైకత శిల్పులు రెండు రోజులు శ్రమించి ఈ శిల్పాన్ని రూపొందించారు. ఆరు లారీల ఇసుకను వినియోగించి 25 అడుగుల పొడవు, 15 అడుగుల ఎత్తుతో దశరథ్ మహంతో, బాబుల్ ఈ కళాఖండాన్ని రూపొందించారు.

– కడియం

నేడు నంద్యాల, తిరుపతి జిల్లాల్లో సీఎం జగన్ పర్యటన

సాక్షి, అమరావతి: సీఎం జగన్ గురువారం నంద్యాల, తిరుపతి జిల్లాల్లో పర్యటించనున్నారు. మధ్యాహ్నం 1.30 గంటలకు ఆయన తాడేపల్లి నుంచి గన్నవరం ఎయిర్‌పోర్టుకు బయలుదేరతారు. ఓర్వకల్లు ఎయిర్‌పోర్టుకు 2.50 గంటలకు చేరుకుంటారు. అక్కడి నుంచి మంచాల గ్రామానికి చేరుకుని టీటీడీ ఈవో ధర్మారెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తారు. అనంతరం హెలికాప్టర్‌లో ఓర్వకల్లు ఎయిర్‌పోర్టుకు వెళ్లి రేణిగుంటకు సాయంత్రం 5.10 గంటలకు చేరుకుంటారు. తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలోని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు. అనంతరం రాత్రి 8 గంటలకు తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

'రీ సర్వేలో ఎఫ్ లైన్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి'

సాక్షి, అమరావతి: భూముల రీ సర్వేలో ఎఫ్ లైన్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించాలని రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, భూ పరిపాలన ప్రధాన కమిషనర్ జి.సాయిప్రసాద్ సర్వే అధికారులను ఆదేశించారు. ఈ దరఖాస్తులను తిరస్కరించకుండా విచారించి పరిష్కరించాలని సూచించారు. మంగళగిరిలోని సీసీఎల్ఏ కార్యాలయంలో మంగళవారం అన్ని జిల్లాల డీఎస్ఎల్‌వో లు (డిస్ట్రిక్ట్ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఆఫీసర్), జిల్లా సూపరింటెండెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఎఫ్ లైన్ దరఖాస్తుల తిరస్కరణలు ఎక్కువ ఉంటే సంబంధిత సర్వేయర్, డీఎస్ఎల్‌వోలను బాధ్యుల్ని చేస్తామని సాయిప్రసాద్ చెప్పారు.


బాపట్ల జిల్లా చుండూరు మండలం యడ్లపల్లిలో సభకు భారీ ఎత్తున హాజరైన విద్యార్థులు, ప్రజలు

అంతరాలను సరిదిద్దుదాం


ట్యాబ్‌ల పంపిణీని ప్రారంభించి ప్రసంగిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

▶ మొదటి పేజీ తరువాయి

ఉంచుతున్నా. ఆర్థిక అభివృద్ధి, తలసరి ఆదాయాల్లో ప్రపంచ దేశాల మధ్య వ్యత్యాసాలున్నట్లే వివిధ రాష్ట్రాలు, ప్రాంతాలు, వివిధ వర్గాల మధ్య అంతరాలున్నాయి. ధనిక దేశాలైన అమెరికా, బ్రిటన్ లాంటి దేశాల్లో సగటు తలసరి ఆదాయం రూ.30 లక్షల నుంచి రూ.80 లక్షలు ఉంటుంది. మన దేశంలో తలసరి ఆదాయం రూ.1.65 లక్షలకు అటూ ఇటుగా ఉంటుంది. మన రాష్ట్రంలో దాదాపు రూ.2.50 లక్షలు ఉంటుంది. లక్ష డాలర్లు సంపాదిస్తున్న ఆ దేశాలు ఎక్కడ? మనం ఎక్కడ? స్వాతంత్య్రం వచ్చిన 75 సంవత్సరాల తర్వాత ఇదీ పరిస్థితి. ఇలాంటి అంతరాలు ఈ రోజు దేశంలోనూ, రాష్ట్రంలోనూ ఉన్నాయి. వీటన్నింటినీ మనం ఒకేసారి సరిదిద్దలేకపోవచ్చు. ఆర్థిక సమానత్వం లేకపోవడానికి ఎన్ని కారణాలున్నా చదువుల్లో సమానత్వం తీసుకురాగలిగితే ప్రతి వర్గం, ప్రతి కుటుంబం అభివృద్ధి ఫలాలను అందుకుంటుంది. మంచి చదువులు వారి తలరాతలను రాబోయే రోజుల్లో మారుస్తాయి.

ఈ అంతరాలు ఇంకానా...?

మన చుట్టూ ఉన్న మనుషుల్ని చూసినప్పుడు... ఒక కుటుంబాన్ని గమనిస్తే చదువుకోని అన్న – చదువుకున్న తమ్ముడు, చదువుకోలేని అక్క – చదువుకున్న తమ్ముడు మధ్య వ్యత్యాసం వారి జీవితాల్లో తేడా చూపుతుంది. ఇంగ్లీషు మీడియం చదువులను కూడా పరిగణలోకి తీసుకుంటే మరింత తేడా కనిపిస్తుంది. బాగా చదువుకునే అవకాశం.. అందులోనూ ఇంగ్లిష్ మీడియం చదువులు మన పిల్లలకు దొరకడంతో వారి తలరాత మార్చే కార్యక్రమం జరుగుతోంది. మన సమాజంలో కొందరు 21వ శతాబ్దంలో ఉండగా మరికొందరు 19వ శతాబ్దంలోనే బతికే పరిస్థితిలో ఉన్నారు. వీరు ఇలానే జీవించాలా? వీరి బతుకులు మార్చలేమా? అనే ప్రశ్నలే నా ప్రతి అడుగులో, మనసులో కనిపిస్తాయి. సామాజిక అంతరాలను కొనసాగించే విద్యా విధానం, అధికారంలో వాటా ఇవ్వని గత రాజకీయ విధానాలను ఇకపైనా కొనసాగించాల్సిందేనా? అన్న ప్రశ్నకు ఆలోచన పెరగాలి. ఈ వివక్ష ఇంకా కొనసాగాల్సిందేనా? అన్నది ఒక్కసారి అంతా గుండెపై చేయి వేసుకుని ఆలోచన చేయాలి.

పలకల నుంచి ట్యాబ్‌ల దిశగా..

పలక, బలపం చదువులతోనే కొన్ని కులాల విద్యాభ్యాసం ముగిసిపోతుండగా కొన్ని వర్గాలకు మాత్రమే ట్యాబ్‌లు, డిజిటల్ విద్య, ఇంగ్లిష్ మీడియం అందుబాటులో ఉన్న సమాజాన్ని మనం ఆమోదించవచ్చా? అన్నది అంతా ప్రశ్నించుకోవాల్సిన అవసరం ఇవాళ రాజకీయ వ్యవస్థలో నెలకొంది. ఈ వ్యవస్థను పూర్తిగా మార్చే తిరుగుబాటులో మీవాడిగా, మీలో ఒకడిగా, మీ బిడ్డగా, మీ మేనమామగా, ప్రతి తల్లికీ అన్నగా నేనున్నానని, తోడుగా ఉంటానని హామీ ఇస్తున్నా. ఈరోజు రూ.686 కోట్లతో 5,18,740 ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమాన్ని నా దళిత సోదరుడి నియోజకవర్గంలో ప్రారంభిస్తున్నా. 9,703 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతూ 2024–25లో ఇంగ్లిష్ మీడియంలో సీబీఎస్ఈ విధానంలో టెస్ట్ పరీక్షలకు హాజరయ్యే 4,59,564 మంది విద్యార్థులతో పాటు 59,176 మంది ఉపాధ్యాయులకు కూడా ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్నాం. వారం రోజుల పాటు ప్రతి స్కూల్‌లో ఈ కార్యక్రమం జరుగుతుంది.

రేపటి పౌరులకు నేటి అవసరాన్ని తీర్చేలా..

ఇక మీదట ప్రతి ఏటా 8వ తరగతిలోకి వచ్చే ప్రతి బాబు, పాపకు ట్యాబ్‌లు ఇస్తూ వెళతాం. ఇది ఒక్కసారి మాత్రమే నా పుట్టిన రోజు సందర్భంగా జరుగుతున్న కార్యక్రమం కాదు. చిన్నారులు 8వ తరగతిలో అడుగుపెడుతూనే ఏటా ట్యాబ్‌లు ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నాం. ఇవన్నీ మల్టీ లింగ్యువల్ ట్యాబ్‌లు. బాగా అర్థం కావడానికి ఇంగ్లిష్, తెలుగులోనూ పాఠ్యాంశాలు ఉంటాయి. ట్యాబ్‌ల వల్ల చదువుల్లో పిల్లలకు ఎంతో మేలు జరుగుతుంది. ఒక్కమాటలో చెప్పాలంటే ట్యాబ్‌లు అరటి పండు ఒలిచి చేతిలో పెట్టినంత సులువుగా పాఠాలు అర్థం అయ్యేలా దోహదపడతాయి. రేపటి పౌరుల నేటి అవసరమే ఈ ట్యాబ్‌లు. ట్యాబ్‌లోనే బైజూస్ కంటెంట్ లభిస్తుంది. క్లాస్ టీచర్ చెప్పే పాఠాలు మరింత సులభంగా అర్థం చేసుకునేలా ట్యాబ్ ఉపయోగపడుతుంది. టెక్నాలజీ ఎనేబుల్డ్ లెర్నింగ్‌లో భాగంగా శ్యాంసంగ్ ట్యాబ్‌లు ఇస్తున్నాం. సెక్యూర్డ్ డిజిటల్ కార్డు కూడా వీటిల్లో ఉంటుంది.

ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లోనూ పాఠాలు...

ట్యాబ్‌ల్లో 8, 9వ తరగతులకు సంబంధించి పాఠాలు లోడ్‌చేసి ఇస్తున్నారు. ఇంటర్నెట్ లేకపోయినా ఆఫ్‌లైన్‌లో ట్యాబ్‌లు ద్వారా పాఠాలు వినే అవకాశం ఉంది. ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్‌లోనూ సబ్జెక్టులు నేర్చుకోవచ్చు. మరో ప్రత్యేకత ఏమిటంటే వీటికి మూడేళ్ల వారెంటీ ఉంది. ఎప్పుడైనా సమస్య తలెత్తితే సచివాలయాల్లో అందచేస్తే వారం రోజుల్లో మరమ్మతులు పూర్తి చేసి అందచేస్తారు. రిపేర్ కాకపోతే కొత్త ట్యాబ్ ఇస్తారు. ఇది పాడైపోతుందనే ప్రసక్తే ఉండదు. పిల్లలకు ఎల్లవేళలా ఉపయోగపడుతుంది. బైజూస్ కంటెంట్‌ను 4 నుంచి 10వ తరగతి పిల్లలందరికీ రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందుబాటులోకి తెచ్చింది.

టెక్నాలజీతో మంచి మాత్రమే జరిగేలా..

టెక్నాలజీ వల్ల పిల్లలకు మంచి జరగాలి కానీ చెడు జరగకూడదు. ఇదే ఆలోచనతో ట్యాబ్‌లో సెక్యూర్ మొబైల్ డివైజ్ మేనేజ్‌మెంట్ (ఎండీఎం) సాఫ్ట్‌వేర్ పొందుపరిచారు. దీనివల్ల ట్యాబ్‌ల్లో పాఠాలు, బోధనకు సంబంధించిన అంశాలు మాత్రమే చూడగలుగుతారు. పిల్లలకు నష్టం కలిగించే కంటెంట్‌ను మీ మేనమామ కత్తిరిస్తున్నాడు. ట్యాబ్‌ల వల్ల మంచి జరగాలి. చదువుకు సంబంధించిన అంశాలను మాత్రమే నేర్చుకోవాలి. లేదంటే నష్టం జరుగుతుంది. అలాంటి వాటిని సెన్సార్ చేస్తున్నాం. ట్యాబ్ ద్వారా ఆఫ్‌లైన్‌తోపాటు పాటు ఆన్‌లైన్‌లో కూడా మంచి జరుగుతుంది. తల్లిదండ్రులకు ఎలాంటి భయాలు ఉండకూడదు. పిల్లలు ఏం చూశారు? ఏం చదివారు? అన్నది తల్లిదండ్రులు, టీచర్లకు సాఫ్ట్‌వేర్ ద్వారా తెలుస్తుంది కాబట్టి ట్యాబ్‌లు దుర్వినియోగం అయ్యే అవకాశాలు లేవు.

ఒక్కో విద్యార్థికి రూ.32 వేల లబ్ధి..

ఈరోజు పిల్లల చేతుల్లో పెట్టే ట్యాబ్ మార్కెట్ విలువ రూ.16,500 ఉంటుంది. బైజూస్ కంటెంట్‌ను ఎవరైనా శ్రీమంతుల పిల్లలు డౌన్‌లోడ్ చేసుకోవాలనుకుంటే ఏకంగా రూ.15,500 చెల్లించాలి. ఇలా 8వ తరగతి విద్యార్థులకు అందించే ట్యాబ్, బైజూస్ కంటెంట్‌ను బయట కొనుగోలు చేయాలంటే రూ.32 వేలు ఖర్చవుతుంది. మేనమామగా పిల్లల చదువుల కోసం రూ.32 వేలు చొప్పున వ్యయం చేస్తూ మంచి చదువులు అందుబాటులోకి తెచ్చాం. ఇక్కడ బైజూస్ సంస్థను కూడా ప్రశంసించాలి. కార్పొరేట్ సామాజిక బాధ్యతగా రూ.15,500 విలువైన కంటెంట్‌ను రాష్ట్ర ప్రభుత్వానికి ఉచితంగా అందించినందుకు బైజూస్‌కు కృతజ్ఞతలు. 5,18,740 ట్యాబ్‌ల ఖర్చు రూ.688 కోట్లు కాగా ఇందులో లోడ్ చేస్తున్న కంటెంట్ విలువ మరో రూ.778 కోట్లు ఉంటుంది. మొత్తంగా రూ.1,466 కోట్ల మేర పిల్లలకు లబ్ధి చేకూరుతోంది.

డిజిటల్ క్లాస్ రూములు..

ఒకవైపు 8వ తరగతి పిల్లలకు ట్యాబ్‌ల పంపిణీతో పాటు మరోవైపు స్కూళ్లలో డిజిటల్ క్లాసురూమ్‌ల ఏర్పాటుపై ప్రత్యేకంగా దృష్టి పెడుతున్నాం. నాడు – నేడు దశలవారీగా అమలయ్యే కొద్దీ 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ప్రతి క్లాసులో, ప్రతి సెక్షన్‌లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ (ఐఎఫ్‌పీ) అంటే డిజిటల్ క్లాస్ రూమ్స్ ఏర్పాటు చేస్తాం. నాడు – నేడు మొదటిదశ పనులు పూర్తైన 15,715 స్కూళ్లల్లో డిజిటల్ క్లాస్ రూమ్‌ల ఏర్పాటు వచ్చే జూన్ కల్లా పూర్తవుతుంది.

సమూల మార్పులు...

- స్కూళ్లు తెరిచిన తొలిరోజే జగనన్న విద్యా కానుక కిట్. స్కూల్ బ్యాగుతో పాటు ద్విభాషా పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, షూస్, 3 జతల యూనిఫాం, సాక్స్, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ పంపిణీ. గత సర్కారు హయాంలో పాఠ్యపుస్తకాలు సైతం ఇవ్వలేని దుస్థితి.
- 3వ తరగతి నుంచి సబ్జెక్ట్ టీచర్స్.
- నాడు – నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు సమూలంగా మార్పు.
- ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్ఈ విధానం, డిజిటల్ క్లాస్ రూములు, ట్యాబ్‌లు, బైజూస్ కంటెంట్, విద్యా దీవెన, వసతి దీవెన, అమ్మఒడి, గోరుముద్దతో సహా అనేక పథకాలు అమలు.
- మూడేళ్లలో అమ్మఒడి ద్వారా రూ.19,617 కోట్లు వ్యయం. 44,48,865 మంది తల్లులకు, 80 లక్షల మంది పిల్లలకు పథకంతో లబ్ధి.
- రూ.9,051 కోట్లతో విద్యాదీవెన ద్వారా 24,74,544 మంది పిల్లలకు ప్రయోజనం.
- వసతి దీవెన కింద మరో రూ.3,349 కోట్లతో 18,77,863 మంది పిల్లలకు మేలు.
- గోరుముద్ద పథకానికి ఇప్పటివరకూ రూ.3,239 కోట్లు వ్యయం. 43,26,782 మంది పిల్లలకు రోజుకో రకమైన మెనూతో పౌష్టికాహారం.
- విద్యాకానుక కిట్ల కోసం రూ.2,368 కోట్ల వ్యయం. 47,40,420 మంది పిల్లలకు ప్రయోజనం.
- వైఎస్సార్ సంపూర్ణ పోషణం కింద రూ.4,895 కోట్ల వ్యయంతో 35,70,675 మందికి లబ్ధి.
- మనబడి నాడు నేడు ద్వారా తొలిదశలో రూ.3,669 కోట్లతో 15,715 స్కూళ్ల రూపురేఖలు సమూలంగా మార్పు. రెండో దశలో మరో రూ.8 వేల కోట్లతో 22,344 స్కూళ్లలో పనులు.


ట్యాబ్‌ల పంపిణీ అనంతరం విద్యార్థులతో సీఎం జగన్. చిత్రంలో ప్రజాప్రతినిధులు, ఇతరులు

- ''అందరికీ సమానమైన నైపుణ్యం ఉండకపోవచ్చు. కానీ అందరికీ సమాన అవకాశాలు దొరికితీరాలి. అది కల్పించడమే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యం'' అని అమెరికా మాజీ అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెనడీ చెప్పిన మాటలను సీఎం జగన్ గుర్తు చేశారు.
- ''నా పుట్టిన రోజు నాడు నాకెంతో ఇష్టమైన చిన్నారుల భవిష్యత్తు కోసం చేస్తున్న మంచి కార్యక్రమంలో పాలు పంచుకోవటాన్ని దేవుడిచ్చిన అదృష్టంగా భావిస్తున్నా. పిల్లలు బాగుండాలని, తమకన్నా బాగా ఎదగాలని, మంచి పేరు తెచ్చుకోవాలని, ప్రతి తల్లిదండ్రీ మనసారా కోరుకుంటారు. అలా కోరుకునే అనేక హృదయాలు రకరకాల కారణాల వల్ల.. కులం, ఆర్థిక స్థోమత కారణంగా సరిగా చదివించుకోలేకపోతున్నామని భావించినప్పుడు వారి మనసులు తల్లడిల్లటాన్ని నేను స్వయంగా చూశా''
- ''నా ఓదార్పు యాత్ర నుంచి పాదయాత్ర వరకు రాజకీయ ప్రయాణంలో ప్రతి సందర్భంలోనూ తల్లులు, తండ్రులు పడుతున్న బాధలు చూశా. బతుకులు మారాలంటే తలరాతలు మారాలి. ఆ తలరాతలు మారాలంటే చదువు అనే ఒకే ఒక్క ఆస్తి ద్వారానే మారుతుంది''


తరగతి గదిలో విద్యార్థులతో సీఎం జగన్


ముఖ్యమంత్రి జగన్‌తో విద్యార్థుల సెల్ఫీ


దివ్యాంగుడితో మాట్లాడుతున్న సీఎం జగన్

సీఎం జగన్ ఆదేశాలతో తక్షణ సాయం

చుండూరు మండలంలో ముగ్గురు దివ్యాంగులకు రూ.2 లక్షల చొప్పున అందజేత


బాధితులకు చెక్కులు అందజేస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, జేసీ శ్రీనివాస్

సాక్షి, నరసరావుపేట:కష్ట ముందని చెబితే వెంటనే స్పందించి సాయం చేయడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకత. తాజాగా బుధవారం బాపట్ల జిల్లా చుండూరు మండలం యడ్లపల్లిలో విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమంలో ముగ్గురు దివ్యాంగులకు తక్షణ సాయం అందేలా చేసి మానవత్వం చాటుకున్నారు. చండూరు మండలం మోదుకూరు గ్రామానికి చెందిన గుండ్రెడ్డి వెంకటరెడ్డి తన కుమారుడు, కుమార్తె పుట్టుకతోనే మానసిక వైకల్యంతో బాధపడుతున్నారని సీఎం జగన్‌కు గోడు వెళ్లబోసుకున్నారు. ఆ దివ్యాంగులిద్దరికీ రూ.2 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. కాగా, వలివేరు గ్రామానికి చెందిన కూచిపూడి విద్యాసాగర్ భవనం నిర్మిస్తుండగా మూడంతస్తుల నుంచి పడిపోయి దివ్యాంగుడిగా మారాడు. తన కుటుంబాన్ని పోషించుకోలేకపోతున్నట్టు సీఎంకు వివరించారు. అతనికి కూడా తక్షణమే ఆర్థిక సాయం చేయాలని ముఖ్యమంత్రి జగన్ ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో సభ ముగిసిన వెంటనే ముగ్గురు దివ్యాంగులకు రూ.2 లక్షల చొప్పున బాపట్ల జిల్లా కలెక్టర్ కె.విజయకృష్ణన్ చెక్కులు అందజేశారు. సీఎం స్పందనతో బాధిత కుటుంబాలు సంతోషాన్ని వ్యక్తం చేశాయి. తమ సమస్యపై ఇంత త్వరగా ముఖ్యమంత్రి స్పందించడం, నిమిషాల వ్యవధిలోనే తమకు సాయం చేయడం ఎన్నడూ మరువలేమని వారు తమ ఆనందాన్ని జిల్లా కలెక్టర్‌తో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె శ్రీనివాసులు పాల్గొన్నారు.

వామికొండ, సర్వారాయసాగర్

పనుల పూర్తిపై సర్కారు దృష్టి

● ఈ నెల 23న శంకుస్థాపన చేయనున్న సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: గాలేరు–నగరి సుజల స్రవంతి పథకం తొలి దశలో అంతర్భాగమైన వామికొండ సాగర్, నర్రెడ్డి శివరామిరెడ్డి రిజర్వాయర్(సర్వారాయ సాగర్)లలో మిగిలిన పనులు చేయడానికి ప్రభుత్వం నడుం బిగించింది. ఈ పనులకు ఈ నెల 23న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. వామికొండ సాగర్, నర్రెడ్డి శివరామిరెడ్డి రిజర్వాయర్‌లలో మిగిలిన పనులతోపాటు 35 వేల ఎకరాలకు నీళ్లందించేలా డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థ(పిల్ల కాలువలు)ను తవ్వేందుకు రూ.130.19 కోట్ల వ్యయంతో టెండర్ ముసాయిదా షెడ్యూల్‌ను ఆ ప్రాజెక్ట్ ఎస్ఈ మల్లికార్జునరెడ్డి రూపొందించారు. టెండర్ ముసాయిదా షెడ్యూల్‌ను జ్యుడిషియల్ ప్రివ్యూ పరిశీలనకు బుధవారం పంపారు. జ్యుడిషియల్ ప్రివ్యూ ఆమోదించిన షెడ్యూల్‌తోనే టెండర్ నోటిఫికేషన్ జారీ చేయనున్నారు.

'రక్తదానం'లో గిన్నిస్, జీనియస్ రికార్డులు

▶ మొదటి పేజీ తరువాయి

రక్తదానం చేసేందుకు సిద్ధమంటూ 24 గంటల్లో 1,29,451 మంది ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకుని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఇది వరకు (దక్షిణాఫ్రికా పేర్న) ఉన్న ప్రపంచ రికార్డును అధిగమించారు. ఈ మేరకు తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధి వీరేంద్ర.. ప్రపంచ రికార్డుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రం, మెడల్‌ను పార్టీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డికి అందించారు.

ప్రపంచ రికార్డులు బద్దలు

అత్యవసర సమయాల్లో రక్తం ఇచ్చేందుకు ఆసక్తి చూపే దాతల నుంచి అక్టోబర్ 24న దక్షిణాఫ్రికాలో సౌతాఫ్రికా నేషనల్ బ్లడ్ సర్వీస్ అనే సంస్థ ఆన్‌లైన్ ద్వారా ప్లెడ్జ్ ఫామ్స్ సేకరించింది. అప్పుడు 24 గంటల్లో 71,121 మంది ప్లెడ్జ్ ఫామ్స్‌ను అందజేసి సరికొత్త రికార్డును సృష్టించారు. అప్పటిదాకా మన దేశంలో కేవలం ఎనిమిది గంటల్లో 10,217 మంది ప్లెడ్జ్ ఫామ్స్ ఇచ్చిందే ప్రపంచ రికార్డుగా ఉండేది. ఈ నేపథ్యంలో సీఎం జగన్ పుట్టిన రోజును పురస్కరించుకుని కేవలం 24 గంటల్లోనే 1,29,451 మంది రక్తదానం చేసేందుకు అంగీకారం తెలిపి దక్షిణాఫ్రికా రికార్డును బద్దలు కొట్టారని రెడ్‌క్రాస్ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్‌రెడ్డి వెల్లడించారు.


చిలకలూరిపేటలో రక్తదానం చేస్తున్న మంత్రి రజిని

రాత్రి 11 గంటల వరకు 1,68,076 మంది..

ఇదిలా ఉండగా, బుధవారం రాత్రి 11 గంటల వరకు సీఎం జగన్ అభిమానులు www.ysrcpblooddonation.com ద్వారా 1,28,534 మంది, ఆఫ్‌లైన్ ద్వారా 26,503 మంది రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. అలాగే బ్లడ్ డొనేషన్ క్యాంపుల్లో 13,039 మంది రక్తదానం చేశారు. ఈ మేరకు మొత్తం 1,68,076 మంది అయ్యారు.

రక్తదాన ఉద్యమం మరింత ముందుకు..

ఈ సందర్భంగా సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ వెంట మనం నడుస్తున్నందునే మనం ఎక్కడికెళ్లినా ప్రజలు ఆప్యాయత, అభిమానం చూపుతున్నారని చెప్పారు. ప్రజల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూ సీఎం జగన్ దార్శనికుడిగా నిలుస్తున్నారని కొనియాడారు. కార్యక్రమం ఇంత భారీ ఎత్తున విజయవంతం కావడానికి కృషి చేసిన ప్రభుత్వ సలహాదారు(నైపుణ్యాభివృద్ధి శిక్షణ సంస్థ) చల్లా మధుసూదనరెడ్డిని, వారికి సహకరించిన ఐటీ వింగ్ ప్రతినిధులు, సోషల్ మీడియా, పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, విద్యార్థి సంఘాల నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులకు అభినందనలు తెలిపారు. రక్తదాన ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సజ్జల పిలుపు నిచ్చారు.



కొంచెం చదవండి. ఎక్కువ ధ్యానం చేయండి. భగవంతుడిని ఎల్లప్పుడూ స్మరించుకోండి.

– పరమహంస యోగానంద

సాక్షి

గురువారం, డిసెంబర్, 22

మళ్ళీ ప్రమాదఘంటికలు

ఒకరికి తెద్దునా... ఇద్దరికి తెద్దునా... అందరికీ తెద్దునా అని జనవ్యవహారం. చైనా తప్పిదాలతో కరోనా మళ్ళీ దేశదేశాల్లో కోరలు సాచే ప్రమాదం కనిపిస్తోంది. నిన్నటి దాకా కఠిన నిబంధనలు, లాక్‌డౌన్లు, సామూహిక పరీక్షలతో జీరో–కోవిడ్ విధానాన్ని అనుసరించిన చైనా గత నెలలో జనాగ్రహంతో హఠాత్తుగా ఆంక్షలు సడలించేసరికి పరిస్థితి అతలాకుతలమైంది. కేసులు, మరణాలు ఒక్కసారిగా పెరిగి, ఆస్పత్రులు చేతులెత్తేశాయి. ఫార్మసీల్లో మందులు ఖాళీ. శవాల గుట్టలతో శ్మశానాల్లో తీరిక లేని పని. జపాన్, అమెరికా, కొరియా, బ్రెజిల్‌లోనూ కేసులు ఉన్నట్టుండి పెరుగుతుండడంతో, భారత్ అప్రమత్తమైంది. కరోనా పాజిటివ్ నమూనాలకు జీనోమ్ సీక్వెన్సింగ్ జరిపి, కొత్త వేరియంట్లపై కన్నేయాలని భారత సర్కార్ ఆదేశించడం సరైన చర్య. ఆరోగ్యశాఖ ఉన్నత స్థాయి సమీక్షాసమావేశంతో అప్రమత్తత బావుంది. కాకపోతే, 80 కోట్ల చైనీయులకు కొత్తగా కరోనా సోకే ముప్పు, లక్షలాది మరణాల అంచనా, భారత్‌లో కరోనా చాటు రాజకీయాలే ఆందోళనకరం.

కరోనా విషయంలో ప్రపంచంలో ప్రతి ఒక్కరూ సురక్షితం కానంత వరకు, ఏ ఒక్కరూ సురక్షితం కానట్టే. ఏ ఒక్కరు అజాగ్రత్తగా ఉన్నా, ఇట్టే వ్యాపించే ఈ మహమ్మారితో ప్రతి ఒక్కరికీ ముప్పే. ఇది రెండేళ్ళుగా వైద్యనిపుణులు ఘోషిస్తున్న మాట. కానీ, చైనా మూర్ఖత్వం ఇవాళ మిగతా ప్రపంచానికి శాపమైంది. కరోనా నియంత్రణలో పాశ్చాత్య ప్రపంచం కన్నా తామే గొప్ప అని చైనా చెప్పుకుంటూ వచ్చింది. పొరుగున భారత్ సహా ప్రజాస్వామ్య ప్రపంచమంతా అనుసరిస్తున్న పద్ధతులకు భిన్నంగా లోపభూయిష్ఠ 'జీరో–కోవిడ్' విధానాన్ని చైనీయులపై బలవంతాన రుద్దింది. తొలినాళ్ళలో అది ఫలితమిచ్చినా, టీకాలతో, లాక్‌డౌన్లు ఎత్తేసి జీవనం సాగించడమే ప్రత్యామ్నాయమని ప్రజలకు వివరించడం నిరంకుశ సర్కారుకు కష్టమైపోయింది. తీరా ప్రత్యామ్నాయ వ్యూహం కానీ, క్రమంగా సాధారణ పరిస్థితి తేవడం కానీ చేయక ఒక్కసారిగా ఆంక్షల గేట్లు ఎత్తేయడం ఘోర తప్పిదమైంది. ఒక్క నెలలో 10 లక్షల పైగా కేసులు బయటపడ్డాయి.

మూడేళ్ళ క్రితం ప్రపంచానికి కరోనాను అంటించినట్టు ఆరోపణలు ఎదుర్కొన్న చైనా నేటికీ ఆ మహమ్మారి నుంచి బయటకు రాలేకపోవడం విధి వైచిత్రి. ఈ దుఃస్థితికి స్వయంకృతాపరాధాలే కారణం. అతి జాతీయవాదంతో దేశీయంగా తయారైన టీకాలనే చైనా వాడడం, తీరా అవి సమర్థంగా పనిచేయకపోవడం, ఇప్పటికీ చైనా జనాభాలో అధిక శాతం మందికి టీకాకరణ జరగకపోవడం, వాస్తవాలను బయట పెట్టకపోవడం – ఇలా చైనా చేసిన తప్పులు అన్నీ ఇన్నీ కావు. మూడేళ్ళలో మూడు ప్రధాన కరోనా వేవ్‌లు చూసిన పొరుగు దేశం భారత్ ఈ విషయంలో మెరుగ్గా వ్యవహరించింది. శాస్త్రీయ శోధనకు ప్రభుత్వ సహకారం, దేశీయ టీకాల పనితనం, దేశవ్యాప్తంగా ఉద్యమస్థాయిలో టీకాకరణ, పలు విమర్శ లున్నా కోవాగ్జిన్‌ను ప్రోత్సహించడం కలిసొచ్చాయి.

అయితే, మన దగ్గర కరోనా రాజకీయాలకూ కొదవ లేదు. తాజా కరోనా భయాన్ని సైతం అధికారపక్షమైన బీజేపీ రాజకీయాలకు వాడుకునేందుకు ప్రయత్నిస్తోంది. కాంగ్రెస్ నేత రాహుల్ 100 రోజుల పైగా చేస్తున్న 'భారత్ జోడో యాత్ర'కు బాణం గురి పెట్టింది. విమానయానాలు సహా దేశమంతటా కరోనా నిబంధనలపై మాట్లాడని కేంద్ర వైద్య మంత్రి తీరా త్వరలో దేశ రాజధానికి చేరనున్న ప్రతిపక్ష నేత పాదయాత్రకు కోవిడ్ ప్రోటోకాల్ సాకుతో లేఖ రాయడం చిత్రమే. 'టీకాలు వేసుకున్నవారే రాహుల్‌తో యాత్ర చేయాలి, యాత్ర చేసినవారు ఐసొలేషన్‌లో ఉండా'లంటున్న పెద్దలు రాజస్థాన్, కర్ణాటకల్లో బీజేపీ యాత్రలను మాత్రం విస్మరించడమేమిటి? కేంద్రం కరోనా మార్గదర్శకాలివ్వాల్సింది యావత్ భారత్‌కే తప్ప ఒక్క భారత్ జోడో యాత్రకు కాదు.

చైనాలో విస్తృతంగా వ్యాపిస్తూ, సంక్షోభం సృష్టిస్తున్న బీఎఫ్.7 కరోనా వేరియంట్ ఇప్పటికే గుజరాత్‌లో బయటపడింది. అలాగే, టీకా వేసుకున్నా ఈ ఒమిక్రాన్ ఉప వేరియంట్ సోకడం ఆగట్లేదట. ఈ మాటలు ఆందోళనకరమే. అయితే, 2021 మధ్యలో మన దేశంలో సంక్షోభం రేపిన డెల్టా వేరియంట్‌తో పోలిస్తే, ఈ ఏడాది మొదటి నుంచి మన దగ్గరున్న ఒమిక్రాన్ ఆ స్థాయి కల్లోలం రేపలేదు. ఆ మాటకొస్తే ఈ ఒమిక్రాన్ ఉప వేరియంట్ బీఎఫ్.7 భారత్‌లో సెప్టెంబర్ నుంచే ఉందని కథనం. మనకు సహజ వ్యాధినిరోధకతా వచ్చింది. దేశంలో పెరిగిన కరోనా వైద్య వసతుల రీత్యా మనం మరీ బెంబేలెత్తాల్సిన పని లేదు. కానీ మాస్క్‌ధారణ, గుంపులకు దూరంగా ఉండడం, భౌతిక దూరం, చేతులకు శానిటైజర్ లాంటి ప్రాథమిక జాగ్రత్తలను మళ్ళీ ఆశ్రయించక తప్పదు.

చైనా దెబ్బతో కొత్త వేరియంట్లు తలెత్తే ముప్పుంది. గతంలో చైనాలో కరోనా మొదలైనప్పుడు అలక్ష్యం చేసి, మనతో సహా ప్రపంచం పీకల మీదకు తెచ్చుకుంది. ప్రస్తుతానికి మన పరిస్థితి బాగున్నా రానున్న సెలవులు, పెరగనున్న పర్యటనలతో అప్రమత్తత కీలకం. కరోనా పరీక్షలు పెంచి, కొత్త వేరియంట్లపై కన్నేసి ఉంచాలి. కరోనా టెస్టింగ్, కేసుల ట్రేసింగ్, ట్రీటింగే ఇప్పటికీ మహా మంత్రం. దేశంలో ప్రతి అయిదుగురిలో ఒకరే బూస్టర్ డోస్ వేయించుకున్నందున ప్రభుత్వం ప్రజల్ని చైతన్యపరిచి, ప్రోత్సహించడం అవసరం. ఏమైనా, ఒక విషయం తప్పక గుర్తుంచుకోవాలి... కరోనా కథ ఇంకా కంచికి చేరలేదు. మన జాగ్రత్తే మనకు రక్ష. ప్రమాదఘంటికలు మోగుతున్న వేళ అవసరానికి మించి సంసిద్ధంగా ఉన్నా తప్పు లేదు కానీ... అత్యవసరమైనదాని కన్నా తక్కువ సిద్ధపడితేనే తిప్పలు – అది ప్రభుత్వానికైనా, ప్రజలకైనా!

విమర్శను ఆహ్వానించే స్ఫూర్తి లేదా?

కామెంట్



కరణ్ థాపర్

గోవా చలన చిత్రోత్సవం ప్రపంచంలోనే అత్యుత్తమమైనదిగా గుర్తించబడాలని మనం కోరుకుంటున్నాం. అలా జరగాలంటే ఆ చిత్రోత్సవంలో ప్రదర్శించే సినిమాలు అత్యున్నత కళాత్మక, సౌందర్యాత్మక నాణ్యతను కలిగి ఉండేలా జాగ్రత్త పడాలి. అయినా ముతకగా, పరిణతి లేకుండా చిత్రించిన 'ద కశ్మీర్ ఫైల్స్'ను ఎందుకు ఎంపిక చేసుకున్నట్లు? దాని ప్రతిభ కారణంగానేనా? లేదా అది మన ప్రభుత్వం మొగ్గుచూపే సైద్ధాంతిక దృక్పథాన్ని సమర్థిస్తోందనా? ఇలాంటి సినిమాను జ్యూరీకి చూపిస్తున్నప్పుడు వాళ్లు వేరేరకంగా వ్యవహరించాలని జ్యూరీని బలవంతపెడుతున్నట్టు అని జ్యూరీ అధ్యక్షుడు నదావ్ లపీడ్ సరిగ్గానే చెప్పారు. కానీ ఈ ఇజ్రాయిల్ దర్శకుడి నిజాయితీతో కూడిన విమర్శను సహించే నైతిక స్ఫూర్తి మనకు లేకపోయింది.

ఇప్పుడు కాస్త సమయం గడిచిపోయింది, అలాగే భావోద్వేగాలు కూడా కాస్త చల్లబడి ఉంటాయి. అందుకే 'ద కశ్మీర్ ఫైల్స్' సినిమాపై ఇజ్రాయిల్ చిత్ర దర్శకుడు నదావ్ లపీడ్ చేసిన విమర్శ చుట్టూ రేగిన ఆగ్రహావేశాలపై నేను స్పందించాలనుకుంటున్నాను. అది కొంత ఇబ్బంది కలిగించే, చెప్పాలంటే ఆందోళన కలిగించే మన సమాజ ముఖచిత్రాన్ని బయటపెట్టింది. ఇదే బహుశా మనం పిలుచుకునే జాతీయ స్వభావం.



మొదటగా ఇలా ప్రారంభిద్దాం. ప్రపంచ ప్రఖ్యాత చిత్ర దర్శకుల్లో ఒకరిని, లొకార్నోలో ప్రత్యేక జ్యూరీ ప్రైజ్, బెర్లిన్‌లో గోల్డెన్ బేర్‌ను గెలుచుకున్న విజేతను మన అంతర్జాతీయ చలన చిత్రోత్సవ జ్యూరీకి అధ్యక్షత వహించడానికి ఆహ్వానించాం. కానీ ఒక భారతీయ సినిమాపై ఆయన చేసిన నిజాయితీతో కూడిన విమర్శను మనం అంగీకరించలేకపోయాం. దానిపై లపీడ్ ఇలా అన్నారు: ''చెప్పాలంటే ఒకరకంగా అది నా కర్తవ్యం, నా విధి కూడా. నేను వ్యర్థ సంభాషణ చేయడం కాకుండా నిజాయితీగా ఉండటానికే ఇక్కడికి ఆహ్వానించారు.'' ఆ దాపరికం లేని నిష్కల్మష ప్రవర్తన మనల్ని నివ్వెరపర్చి ఉండవచ్చు, పైగా గాయపర్చి ఉండవచ్చు కూడా. కానీ ఆయన చేసిన విమర్శను సంతోషంగా ఆహ్వానించే శక్తి, నైతిక స్ఫూర్తి మనకు లేవు.

ఇంకా ఘోరమైన విషయం ఏమిటంటే– లపీడ్ చెప్పినదాన్ని తప్పుగా అర్థం చేసుకోవడాన్నే మనం ఉద్దేశపూర్వకంగా ఎంచుకున్నాం. ఆ సినిమా మార్చి నెలలో విడుదలైనప్పుడు నేను కావాలనే చూడకూడదని భావించాను. కానీ ఈ వివాదం చెలరేగిన తర్వాత ఆ సినిమాను చూడాలనుకున్నాను. ఒక విషాద ఘటన పట్ల ఆలోచనాత్మకంగానూ, సున్నితంగానూ తీయవలసిన దానికి బదులుగా ఆ సినిమా ఒక ముతక చిత్రీకరణగా నాకు కనిపించింది. ఈ చిత్రాన్ని నడిపిన తీరులో సూక్ష్మత, గాఢత లోపించాయి. నటన ఏకపక్షంగా ఉంది. ఈ సినిమాలోని ఏ ఒక్క పాత్రపట్ల కూడా మనకు సహానుభూతి కలగదు. ఇజ్రాయిల్ దర్శకుడు నదావ్ లపీడ్ సరిగ్గా ఆ విషయాన్నే వెల్లడించారు. కానీ ఆయన వ్యాఖ్యలను మనం ఉద్దేశపూర్వకంగానే తప్పుగా వ్యాఖ్యానించుకున్నాం. వాటిని కశ్మీర్ పండిట్లకు జరిగిన ఘటనల పట్ల తిరస్కరణగానూ, చనిపోయిన వారి స్మృతిని అవమానించడంగానూ అర్థం చేసుకున్నాం.

ఒక్క క్షణకాలం పాటు మనం ఆలోచించడం కోసం ఆగినట్లయితే, ఆయన వ్యాఖ్యలను మనం ఎంత తప్పుగా భావించామో మనకు తెలిసేది. కానీ మనం అలా చేయలేక పోయాం. ఒక అధమ స్థాయి సినిమాను సమర్థించుకునే మార్గం అదన్నమాట! ఒకసారి లపీడ్ విమర్శ మన ఆత్మాభిమానాన్ని గాయపర్చాక, ఆయన విమర్శను ఉద్దేశపూర్వకంగా వక్రీకరించడానికి పూనుకున్నాం. పైగా అది మన జాతీయవాదంపై దాడిగానూ, ఇంకా చెప్పాలంటే ఏకంగా మనపైనే చేసిన దాడిగానూ చూడటానికి పూనుకున్నాం. కానీ లపీడ్ దీనిపై స్పష్టంగా ఆయన అభిప్రాయం వివరించారు: ''ఒక సినిమాను విమర్శించడం అంటే భారతదేశాన్ని విమర్శించడం కాదు లేదా కశ్మీర్‌లో జరిగినదాన్ని విమర్శించడం అంతకంటే కాదు''.

నన్ను మరికాస్త ముందుకెళ్లి చెప్పనివ్వండి. గోవా చిత్రోత్సవం ప్రపంచంలోనే అత్యుత్తమమైనదిగా గుర్తించబడాలని మనం కోరుకుంటున్నాం. అలా జరగాలంటే ఆ చిత్రోత్సవంలో ప్రదర్శించే సినిమాలు అత్యున్నత కళాత్మక, సౌందర్యాత్మక నాణ్యతను కలిగి ఉండేలా జాగ్రత్త పడాల్సి ఉంటుంది. అలాంటప్పుడు ఆ చిత్రోత్సవంలో ప్రదర్శించడానికి 'కశ్మీర్ ఫైల్స్'ను ఎందుకు ఎంపిక చేసుకున్నట్లు? దాని ప్రతిభ కారణంగానేనా? లేదా అది మన ప్రభుత్వం మొగ్గుచూపే సైద్ధాంతిక దృక్పథాన్ని సమర్థిస్తోందనా? విస్మరణకు గురైన ఒక విషాదం వైపు ప్రపంచానికి కిటికీ తెరవడానికి– ముతకగానూ, పరిణతి లేకుండానూ చిత్రించినది; ఇది మన చిత్ర పరిశ్రమకు సంబంధించిన అత్యుత్తమ సినిమా కాదు అనే వాస్తవాన్ని కూడా విస్మరించారా?

నదావ్ లపీడ్ దాన్ని ఇలా చూశారు: ''ద కశ్మీర్ ఫైల్స్ లాంటి సినిమాలు చిత్రోత్సవాల్లో పోటీ విభాగంలో భాగం కాకూడదు. డజన్లకొద్దీ చిత్రోత్సవాల్లో నేను జ్యూరీలో భాగమయ్యాను. బెర్లిన్, కాన్, లొకార్నో, వెనిస్ వంటి అంతర్జాతీయ చిత్రోత్సవాల్లో కూడా నేను పాలు పంచుకున్నాను. ఏ చిత్రోత్సవంలోనూ కశ్మీర్ ఫైల్స్ లాంటి సినిమాను నేను చూడలేదు. మీరు ఇలాంటి సినిమాను జ్యూరీకి చూపిస్తున్నప్పుడు వేరే రకంగా వ్యవహరించాలని జ్యూరీని బలవంత పెడుతున్నట్టు.'' ఇదేమీ ఒప్పుకోలేని వాదన కాదు కదా!

చివరగా, మీడియా గురించి నన్ను చెప్పనివ్వండి. అది మనకోసం మాట్లాడుతున్నట్లు ప్రకటించుకుంటుంది. తాను ప్రజావాణిని అని మీడియా నమ్ముతుంటుంది. కానీ ఈ సినిమాను సమర్థించడానికి అది చేస్తున్న ప్రయత్నాలు మాత్రం తెలివిలేనివి, పైగా అసమర్థమైనవి కూడా! ఈ సినిమా గురించి తనకు కలిగిన అభిప్రాయాలనే జ్యూరీ సభ్యులు కూడా పంచుకున్నారని లపీడ్ చెప్పినప్పుడు దాన్ని నిరూపించాలని టెలివిజన్ యాంకర్లు సవాలు చేశారు. ఓ రకంగా ఇది ఆయన అబద్ధమాడుతున్నాడని సూచించే వెర్రి ప్రయత్నం మాత్రమే అవుతుంది. పైగా, లపీడ్‌కు తమ మద్దతును బహిరంగంగా నిర్ధారించేలా అది ఇతర జ్యూరీ సభ్యులను రెచ్చగొట్టింది. మరోవైపున, ఒక వార్తాపత్రిక ఏకంగా అబద్ధమాడింది. లపీడ్ తన మనస్సు మార్చుకున్నారనీ, ఆ సినిమా మేధోవంతంగా ఉందనీ చెప్పారని ఆ పత్రిక నివేదించింది. నిజానికి ఆయన తన మనస్సు మార్చుకోలేదు. ఆయన అలా చేస్తాడనుకోవడం కూడా బుద్ధిహీనతే అనాలి.

సాధారణమైన ఆలోచనతో దీన్ని ముగిస్తాను. ఫిల్మోత్సవ్ అవార్డు కార్యక్రమంలో ఒక నిర్దిష్ట సినిమాను విమర్శించే హక్కు లపీడ్‌కు ఉందా లేదా అనేది న్యాయమైన ప్రశ్న. ఇది చాలా చిన్న విషయం కూడా. దీనికంటే మన ప్రవర్తనే మరింత పెద్ద సమస్యగా ఉంటోంది. చిత్రోత్సవం కోసం మనం ఎంపిక చేసుకున్న సినిమా, దానికి లభించిన విమర్శకు మనం స్పందించిన తీరు మనల్ని ఇబ్బందికర పరిస్థితుల్లోకి నెట్టింది. కాబట్టి ఇది ఒక విషాదకరమైన, బాధాకరమైన గాథ!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

వయా రావాల్సిందే



'చైనా నుంచి విమానాలు నిషేధించా'లని ప్రభుత్వాన్ని అడుగుతున్న ప్రతిపక్షం/ఇతరులకు అసలు చైనా మెయిన్‌ల్యాండ్ నుంచి నేరుగా ఇండియాకు విమానాలు లేవని తెలుసో లేదోనని ఆశ్చర్యం కలుగుతోంది. 2020 మలినాళ్ల నుంచి ఇండియాకు డైరెక్టు విమానాలు లేవు.

– అనంత్ కృష్ణన్, జర్నలిస్ట్

డాక్టర్ నెహ్రూ



వైద్య కళాశాలలకు మహాత్మా గాంధీ పేరున్నప్పుడు, జవహర్‌లాల్ నెహ్రూ మాత్రం వెనకబడి పోతారా? భారత్‌లోని 8 మెడికల్ కాలేజీ లకు ఆయన పేరుంది. జవహర్ లాల్ నెహ్రూ మెడికల్ కాలేజ్, అలీగఢ్; జేఎన్ఎంసీ, బెల్గాం; జేఎన్ఎంసీ, అజ్మీర్; జేఎన్–ఎంసీ, భాగల్పూర్; జేఎన్ఎంసీ, వార్ధా; జేఎన్ఎంసీ, ఇంఫాల్; పండిట్ జేఎన్ఎంసీ, చంబా; జిప్‌మర్, పాండిచ్చేరి.

– ఎస్పీ కాలంత్రి, ఫిజీషియన్

ఆదరణ భయమా?



కోవిడ్ నియమావళి పాటించకపోతే భారత్ జోడో యాత్రను ఆపేస్తామని కేంద్ర ఆరోగ్యశాఖా మంత్రి బెదిరిస్తున్నారు. ఇప్పుడెందుకు? ఢిల్లీలో రాహుల్ గాంధీకి వచ్చే భారీ జనం గురించి భారత ప్రభుత్వం భయపడుతోందా?

– తవ్లీన్ సింగ్, కాలమిస్ట్

చావులకు కారణం



బ్రిటిష్ వలస వాదం 1880–1920 మధ్య కాలంలో భారత్‌లో 16.5 కోట్ల మంది మరణానికి కారణమైందని అంచనా వేస్తోంది ప్రొఫెసర్ జాసన్ హికెల్ చేసిన అధ్యయనం. మరోవైపున భారత సంపదను ట్రిలియన్లకొద్దీ డాలర్లు దోచుకున్నారు. యూరోపియన్ సామ్రాజ్యవాద నరమేధం మీద ప్రపంచ పెట్టుబడిదారీ విధానం రూపొందింది. అదే హిట్లర్‌ను ప్రభావితం చేసింది.

– బెన్ నార్టన్, జర్నలిస్ట్

చర్య తీసుకోవాలి



ఇరాన్‌లోని అయతొల్లా ఖొమైనీ ప్రభుత్వ అణిచివేత గురించి బెల్జియం ప్రభుత్వానికి మనవి చేశాను. ఇరానియన్ రివల్యూషనరీ గార్డులను యూరోపియన్ యూనియన్ తీవ్రవాద లిస్టులో చేర్చాలని కోరాను. ఈ పరిపాలన ఉక్రెయిన్ మీద బాంబులు వేసేలా రష్యాకు డ్రోన్లు సరఫరా చేస్తోంది. ఇరాన్‌లో అమాయక పౌరులను చంపుతోంది.

– దరియా సఫాయీ, బెల్జియం ఎంపీ

ఆయనే సరి



ఒకవేళ ట్విట్టర్ సీఈఓగా ఎలాన్ మస్క్ దిగిపోతే గనక, డోనాల్డ్ ట్రంప్‌ను సీఈఓగా నియమించాలి. అది మరింత సరదాగా ఉంటుంది.

– కెవిన్ సోర్బో, నట దర్శకుడు

లెక్కల భయం పోవాలి

ఆధునిక భారతీయ గణిత చరిత్రకు వన్నెలద్దిన వ్యక్తులలో శ్రీనివాస రామానుజన్ అగ్రగణ్యులు. తమిళనాడులో 1887 డిసెంబర్ 22న జన్మించిన ఆయన సేవలకు గుర్తింపుగా... భారత ప్రభుత్వం ఆయన పుట్టిన రోజును ప్రతి ఏటా 'జాతీయ గణిత దినోత్సవం'గా జరుపుతోంది. ఇటీవల మధ్యతరగతి భారతీయ మహిళ డాక్టర్ నీనా గుప్తా ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్‌లో ఆచార్యులుగా సేవలందిస్తూ ప్రతిష్ఠాత్మక రామానుజన్ పురస్కారం–2021 పొందడం ముదావహం. రామానుజన్ స్ఫూర్తితో భారతీయ గడ్డపైన ఇలాంటి ప్రపంచ ప్రఖ్యాత గణిత మేధావులు తయారు కావడం నేటి యువతకు స్ఫూర్తిదాయకం.

పిల్లలు పాఠశాలలో ప్రవేశించక ముందే కొన్ని ప్రాథమిక గణిత భావనలు అలవోకగా నేర్చుకుంటారు. కానీ, పాఠశాలకు వచ్చేసరికి వారికి గణితం అంటే ఆసక్తి తగ్గిపోతోంది. ఇటీవల జరిపిన ఒకటి రెండు సర్వేలు ప్రాథమిక తరగతుల నుంచి మాధ్యమిక స్థాయి (8వ తరగతి)కి వచ్చిన పిల్లలకు గణితంలో సామర్థ్యం తగ్గినట్లు తేల్చడం గమనార్హం. అలాగే కోవిడ్ అనంతర కాలంలో కర్ణాటక పాఠశాలల్లో చేసిన సర్వే (అసర్ నివేదిక 2021) ప్రకారం గణితంలో భాగహారం లాంటి కనీస సమస్యలను కూడా విద్యార్థులు చేసే సామర్థ్యాన్ని కోల్పోయినట్లు తేలింది. ఈ స్థితే దేశవ్యాప్తంగా ఉన్న పరిస్థితికి అద్దం పడుతుందనడంలో అతిశయోక్తి లేదు. కోవిడ్ వల్ల పాఠశాలలు మూత పడటం ఇందుకు ప్రధాన కారణం.



శ్రీనివాస రామానుజన్

గణితాన్ని సమస్య సాధనకు పరిమితం చేయకుండా నూతన కోణంలో బోధించాలి. విద్యార్థుల్లో ఆసక్తిని కలిగించడానికి కృత్యాధార పద్ధతులతో గణిత భావనలు నేర్పించాలి. గణితాన్ని అంకెలకు, సంఖ్యలకు పరిమితం చేయకుండా వాటిని నిజ జీవితానికి అన్వయించాలి. స్వీయ మూల్యాంకనానికి దోహదపడే విధంగా గణిత భావనలు ఉండాలి. ఇవన్నీ లోపించడం వల్లనే చాలామంది పిల్లలు గణితం అంటే భయపడుతున్నారు. ఈ భయాన్ని తొలగించడానికి ప్రాథమిక స్థాయి నుంచి మౌలిక సూత్రాలను నేర్పించాలి. గణిత బోధనలో కృత్యాలు, ప్రదర్శనలు మిళితమైనప్పుడు విద్యార్థులకు గణితంపై ఆసక్తి పెరిగే అవకాశం ఉంటుంది. పాఠశాల స్థాయిలో గణిత మేళాలు, చర్చా గోష్ఠులు నిర్వహించాలి. గణిత ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రయోగాల వైపు ప్రేరేపించాలి. అప్పుడే లెక్కల చిక్కుముడి విప్పి భావి గణిత మేధావులు బయటకు వస్తారు.

– సంపతి రమేష్ మహారాజ్, విద్యా విశ్లేషకులు । 79895 79428

(నేడు జాతీయ గణిత దినోత్సవం)

అమరజీవి త్యాగాన్ని గుర్తుచేస్తూ...

సందర్భం




డా॥ నాగసూరి వేణుగోపాల్

ప్రముఖ సినీనటుడు సాయిచంద్ 'మా భూమి' (1980) చిత్రంతో పరిచయమై, పేరు తెచ్చుకుని ఇటీవల కాలంలో శేఖర్ కమ్ముల 'ఫిదా' (2017) చిత్రంలో తెలంగాణ మాండలికంలో తండ్రి పాత్రను గొప్పగా రక్తి కట్టించారు. పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ చేసుకుని 69 ఏళ్లు నిండి 70వ సంవత్సరం ప్రారంభమవుతున్న సందర్భంగా... డిసెంబర్ 15న మదరాసు నుంచి సుమారు మూడు వందల అరవై కిలోమీటర్ల దూరంలో ఉండే పడమటి పల్లె గ్రామానికి కాలినడకన ఒంటరిగా బయల్దేరారు. సోమవారానికి ఆయన పాదయాత్ర నెల్లూరు జిల్లాకు చేరుకుంది. 7వ రోజైన బుధవారానికి కావలికి సమీపంలో కొనసాగుతోంది.

పొట్టి శ్రీరాములు 1952 అక్టోబర్ 19వ తేదీ ఉదయం 10 గంటలకు ఒంటరిగా దీక్ష ప్రారంభించినట్లుగానే సాయిచంద్ తన అనుచరుడు భీమినేని రాయుడుతో తన నడకను మద్రాసు తెలుగు మిత్రుల వీడ్కోలుతో ప్రారంభించారు. మద్రాసు, మైలాపూరులోని స్పీకర్ బులుసు సాంబమూర్తి ఇంటి ఆవరణలో పొట్టి శ్రీరాములు 58 రోజులపాటు నిరాహారదీక్ష చేసి భారత దేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రాలు రావడానికి శ్రీకారం చుట్టారు. పొట్టి శ్రీరాములు స్మారక స్థలి నుంచి బయలుదేరిన సాయిచంద్ ప్రస్తుతం ప్రకాశం జిల్లాలో, సింగరాయకొండకు సుమారు 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న పడమటి పల్లెకు నడుస్తూ ఉన్నారు.

1956లో జూన్ 25న సంస్కర్త, పోరాటశీలి త్రిపురనేని రామస్వామి చౌదరి మనవడిగా; ప్రఖ్యాత రచయిత, మేధావి త్రిపురనేని గోపీచంద్ కుమారుడిగా సాయిచంద్ జన్మించారు. తొలిదశ నుంచీ అభ్యుదయ భావాలు పుష్కలంగా ఉన్న సాయిచంద్ బాల్యం విజయవాడలో గోరాగారి నాస్తిక కేంద్రంలో సాగింది. రచయిత, గాయకుడు కూడా అయినటువంటి సాయిచంద్ ప్రస్తుత సమాజానికి పొట్టి శ్రీరాములు త్యాగాన్ని గుర్తు చెయ్యాలని ఈ నడక కార్యక్రమాన్ని మొదలుపెట్టారు.

1876లో ధాత కరువు వచ్చి తిండీ, నీళ్ళు లేక ప్రజలు, పశువులు అలమటించాల్సి వచ్చింది. అప్పట్లో కనిగిరి తాలూకాలోని పడమటి పల్లె అనే కుగ్రామం నుంచి బతుకు తెరువు కోసం పొట్టి శ్రీరాములు కుటుంబం తమిళ సీమకు తరలి వెళ్లింది. మదరాసు నగరం జార్జి టౌన్‌లోని అన్నా పిళ్ళై వీధిలో 163వ నంబరు గల గృహంలో 1901 మార్చి 16న పొట్టి శ్రీరాములు జన్మించారు. శ్రీరాములుకు 12 ఏళ్ళు రాకుండానే తండ్రి గురవయ్య గతించారు. ప్రాథమిక విద్య మద్రాసులోనే జరిగింది. తర్వాత బొంబాయిలోని విక్టోరియా జూబిలీ టెక్నికల్ ఇనిస్టిట్యూట్‌లో చదువుకున్నారు. 1920 ప్రాంతంలో శానిటరీ ఇంజనీరింగ్ చదువు కారణంగా రైల్వే శానిటరీ ఇంజనీరుగా బొంబాయిలో ఉద్యోగం లభించింది. ఆ సమయంలో తల్లి, భార్య, ఒక కుమారుడు చాలా తక్కువ వ్యవధిలో కనుమరుగవడం గొప్ప విషాదం. పదేళ్ళ తరువాత గాంధీజీ ప్రభావానికి లోనైన తర్వాత 1930 ఏప్రిల్‌లో ముఖాముఖి కలిశారు. గాంధీజీ అనుమతి పొంది, ఉద్యోగానికి అదే నెలలో రాజీనామా చేసి సబర్మతీ ఆశ్రమం బయలుదేరారు. ఇదీ స్థూలంగా పొట్టి శ్రీరాములు జీవిత నేపథ్యం.



పడమటిపల్లె యాత్రలో సాయిచంద్

తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం కావాలనే కోరికతో తొలి సమావేశం బాపట్లలో 1913లో జరిగింది. ఆ తరువాత నాలుగు దశాబ్దాలకు పొట్టి శ్రీరాములు నిరాహార దీక్ష చేసి ప్రాణాలు ఎందుకు బలిపెట్టవలసి వచ్చిందో చరిత్రలోకి వెళ్లి చూడాలి.

తెలుగు వారి ప్రత్యేక రాష్ట్రం కోసం ఎస్‌కే ధార్ కమీషన్ (1948), జేవీపీ కమిటీ (1949), మరో మూడు కమిటీలు రిపోర్టులిచ్చాయి. అయితే సి. రాజగోపాలాచారి, జవహర్‌లాల్ నెహ్రూ, భోగరాజు పట్టాభి సీతారామయ్య, నీలం సంజీవరెడ్డి వంటివారి సొంత ఆలోచనల కారణంగా చాలా పరిణామాలు సంభవించాయి. గాంధీజీకి వియ్యంకుడై 1952 జనవరి 26 దాకా అధికారం చలాయించిన, సొంత భాష ప్రయోజనాల కోసం తపించిన తమిళుడైన సి. రాజగోపాలాచారి తెలుగు వారికి పెద్ద రాష్ట్రం ఏర్పడటాన్ని వ్యతిరేకించారంటారు. బెంగాల్ వంటి ప్రాంతాల్లో మాదిరిగా కమ్యూనిస్టు పార్టీ తెలుగు ప్రాంతంలో స్థిరపడి తనకి ఇబ్బంది కలిగించకూడదని నెహ్రూ భావనలు, నీలం సంజీవ రెడ్డి స్థానిక రాజకీయ ప్రయోజనాలు వెరసి రాష్ట్ర అవతరణను అడ్డుకున్నాయి.

వీటన్నిటినీ గమనించిన పొట్టి శ్రీరాములు చలించి తన వంతుగా నిరాహారదీక్షకు దిగారు. దీక్ష ప్రారంభించిన తర్వాత కూడా అదేమీ పెద్ద ప్రభావం చూపబోదని పలు నివేదికలు మదరాసు నుంచి ఢిల్లీ వెళ్ళాయి. అయితే పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ అయిన తర్వాతనే తెలుగువారి మనోభీష్టం బయటి ప్రపంచానికి తెలిసి వచ్చింది. ఆ కారణంగానే 1956లో తెలుగు, తమిళం, కన్నడం మలయాళం భాషలవారికి ప్రత్యేక రాష్ట్రాలు ఏర్పడ్డాయి.

ఇంతటి ఘనమైన త్యాగ చరిత్రను, పొట్టి శ్రీరాములు వంటి సాధారణవ్యక్తి నిరుపమాన త్యాగాన్ని తెలుగు వారికి గుర్తు చెయ్యాలని 66 ఏళ్ళ అవివాహితుడైన సాయిచంద్ తన కాలినడకతో తెలియచెప్పాలని ప్రయత్నిస్తున్నారు!

వ్యాసకర్త ఆకాశవాణి మాజీ ఉన్నతోద్యోగి

మొబైల్: 94407 32392

రామబాణపు రుచి

శిష్ట రక్షణలో రామనామం ఎలాంటి రక్షాకవచమో, దుష్ట శిక్షణలో రామబాణం అంతటి తిరుగులేని ఆయుధం. రామనామ రుచి తెలిసినవాళ్ళు, అలనాటి ఆంజనేయ స్వామి నుంచి భద్రాచల రామదాసు వరకు, త్యాగరాజ స్వామి వరకు ఎందరో మహానుభావులున్నారు. రామబాణం రుచి చూసినవాళ్లలో తాటక నుంచి దశముఖుడి దాకా చాలామంది ఉన్నారు. కానీ, ఆ రుచి చూసి కూడా కొంతకాలం బతికి బట్టకట్టినవాడు మారీచు డొక్కడు కనిపిస్తాడు.

జ్యోతిర్మయం

మొదట, విశ్వామిత్రుడి యజ్ఞం విధ్వంసం చేయడానికి వెళ్ళినప్పుడు, మారీచుడు బాల రాముడి మానవాస్త్రం బారిన పడ్డాడు. అప్పుడే ఆగ్నేయాస్త్రంతో సుబాహుడిని యమపురికి పంపిన రాముడు, మారీచుడితో మళ్ళీ పని పడుతుందని తెలిసి అతడి ప్రాణాలు తీయలేదు. ఒకే ఒక్క బాణం దెబ్బతో నూరు యోజనాల అవతల సముద్రంలో పడేశాడు. మరోసారి కూడా మారీచుడు, దండకారణ్యంలో నివసిస్తున్న దాశరథి మీద దాడి చేయబోయి భంగపడ్డాడు. చావు ఎలాగో తప్పింది (ఎలాగో ఏమిటి, ఆ లీలా మానుషుడి లీల వల్లే), కానీ ఆ తరవాత, మారీచుడు మళ్ళీ మామూలు రాక్షసుడు కాలేకపోయాడు!

సమయం వచ్చినప్పుడు, మారీచుడు రామబాణం దెబ్బ గురించి రావణుడిని కూడా హెచ్చరించి హితవు చెప్పాడు. 'ఓ రావణా, ఆ రామబాణం దెబ్బకు, ఆ రోజు నుంచి నేటివరకూ నాకు ప్రతి చెట్టులోనూ, చేమలోనూ, నారచీరలు కట్టి ధనుర్ధారిగా ఉన్న రాముడు, పాశహస్తుడైన యముడిలా, పదే పదే కనిపిస్తుంటాడు. ఒక్క రాముడు కాదు వెయ్యి రాములు! ఎక్కడ చూసినా రాముడే! కలలోనూ, మెలకువలోనూ రాముడే! ఆ రామభీతి వల్ల, ఇప్పటికీ నాకు 'ర'తో మొదలయ్యే 'రత్నం','రథం' లాంటి ఏ పదం వినిపించినా, విపరీతమైన భయం పుట్టుకొస్తుంది –'ర'కారాదీని నామాని రామత్రస్తస్య, రావణ!, 'ర'త్నాని చ, 'ర'థాశ్చైవ, త్రాసం సంజనయంతి మే! (వాల్మీకి, 3–39–17). నేను ఆయన ప్రభావం బాగా తెలిసి చెప్తున్నాను. ఆయనతో యుద్ధం చేసి గెలవటం నీ వల్ల అయ్యే పని కాదు!' అని. రావణుడు ఇలాంటి హితవులు వినేవాడయితే రామాయణ కథే ఉండేది కాదు!

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** బ.చతుర్దశి సా.6.24 వరకు, తదుపరి అమావాస్య, **నక్షత్రం:** జ్యేష్ఠ తె.4.32 వరకు (తెల్లవారితే శుక్రవారం), తదుపరి మూల, **వర్జ్యం:** ఉ.10.52 నుండి 12.23 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.10.10 నుండి 10.52 వరకు, తదుపరి ప.2.31 నుండి 3.14 వరకు, **అమృతఘడియలు:** రా.8.58 నుండి 9.36 వరకు; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు; **సూర్యోదయం** 6.29 : **సూర్యాస్తమయం** 5.26.

నిశ్చితార్థానికి వెళ్తూ..
శాశ్వత నిద్రలోకి..

- అగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొన్న ఇన్నోవా
- ఇద్దరి దుర్మరణం.. మరో ఆరుగురికి తీవ్ర గాయాలు


నంజుండప్ప (75)


సత్యనారాయణ (55)

పెనుకొండ రూరల్: నిశ్చితార్థానికి బయలుదేరిన వారు మార్గమధ్యంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తిరిగిరాని లోకాలకు చేరుకున్నారు. ఘటనలో ఇద్దరు మృత్యువాత పడగా మరో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పెనుకొండ 44వ జాతీయ రహదారిపై బుధవారం ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శ్రీసత్యసాయి జిల్లా పరిగి మండలం శ్రీరంగరాజుపల్లికి చెందిన మారుతికి తాడిపత్రి మండలంలోని కొడవండ్లపల్లికి చెందిన అమ్మాయితో వివాహం జరిపించాలని కుటుంబీకులు నిర్ణయించారు. బుధవారం కొడవండ్లపల్లిలో నిశ్చితార్థం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు మారుతితో పాటు 15 మంది బంధువులు ఉదయం పరిగి నుంచి ఇన్నోవా, సుమో వాహనాల్లో బయలుదేరారు. మార్గమధ్యంలో కొత్తచెరువు యూటర్న్ సమీపాన ఆగి ఉన్న సిమెంట్ లారీ (ఏపీ04 డీడబ్ల్యూ 7703)ని ఇన్నోవా వాహనం వెనుక నుంచి బలంగా ఢీ కొంది. ఈ ఘటనలో డ్రైవింగ్ చేస్తున్న శ్రీరంగరాజుపల్లికి చెందిన సత్యనారాయణ (55), పక్కనే కూర్చున్న కర్ణాటక రాష్ట్రం గౌరిబిదనూరు సమీపంలోని గొటకనూరుకు చెందిన నంజుండప్ప (75) అక్కడికక్కడే మృతి చెందారు. ఇన్నోవాలో ఉన్న మరో ఆరుగురు గాయపడ్డారు. పోలీసులు క్షతగాత్రులను అంబులెన్సుల ద్వారా పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ. రమేష్‌బాబు తెలిపారు.

పొగమంచు తెచ్చిన తంటా

- ఒకదాన్నొకటి ఢీకొన్న పది వాహనాలు
- పల్నాడు జిల్లాలో ఘటన


జాతీయ రహదారిపై ఒకదాన్నొకటి ఢీకొన్న వాహనాలు

నాదెండ్ల: పొగ మంచు కారణంగా జాతీయ రహదారిపై కేవలం కొద్ది నిమిషాల వ్యవధిలో పదుల సంఖ్యలో వాహనాలు ఒకదానినొకటి ఢీకొని రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించిన ఘటన బుధవారం ఉదయం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం పసుమర్రు గ్రామానికి చెందిన సుదర్శనరావు గుంటూరు సమీపంలోని పొత్తూరు టుబాకో కంపెనీలో మెషిన్ ఆపరేటర్‌గా పనిచేస్తుంటాడు. బుధవారం ఉదయం తన ద్విచక్ర వాహనంపై డ్యూటీకి బయలుదేరాడు. జాతీయ రహదారిపై గణపవరం వద్ద ప్రసన్న వంశీ స్పిన్నింగ్ మిల్లు సమీపానికి రాగానే పొగమంచు కారణంగా వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొంది. దీంతో ద్విచక్ర వాహనం లారీ టైర్ల కింద నుజ్జునుజ్జవగా సుదర్శనరావు స్వల్ప గాయాల పాలయ్యాడు. వెనుక వస్తున్న వాహనాలు నెమ్మదించి రోడ్డుపై నిలిచాయి. పొగమంచు ఉండటంతో ముందు నిలిచి ఉన్న లారీని వెనుక నుంచి మరో వాహనం, అశోక్‌లేలాండ్ మినీ లారీలు, కారు, ట్యాంకర్ ఒకదానినొకటి ఢీకొన్నాయి. ప్రమాదం జరిగిన ప్రదేశంలో జనాలు గుమిగూడటంతో ప్రమాదాన్ని గుర్తించిన ఆర్టీసీ డ్రైవర్ బస్సును కొద్దిదూరంలో నిలిపాడు. ఆ వెనుకే మరో ఆర్టీసీ బస్సు నిలిచింది. చెన్నై నుంచి హైదరాబాద్ వెళ్తున్న లోడ్ లారీ వెనుక నుంచి ఆర్టీసీ బస్సును ఢీకొంది. దీంతో ముందు ఆర్టీసీ బస్సులోని ఇరువురికి స్వల్ప గాయాలయ్యాయి. పది వాహనాలు ఒకదాన్నొకటి ఢీకొనటంతో రెండు గంటలపాటు జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. ఈ ప్రమాదంలో రాజమహేంద్రవరానికి చెందిన లారీ క్లీనర్ ప్రసాద్ గాయాలపాలయ్యాడు. క్షతగాత్రులను 108లో చిలకలూరిపేట వైద్యశాలకు తరలించారు. ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులను మరో బస్సులో గమ్యస్థానాలకు చేర్చారు. మొదట ప్రమాదానికి కారణమైన లారీని పోలీసులు స్వాధీనం చేసుకుని డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.

నష్టాల నుంచి లాభాల్లోకి డీసీఐఎల్

- 2020–21 ఆర్థిక సంవత్సరంలో రూ.167.97 కోట్ల నష్టం
- 2021–22లో రూ.5.17 కోట్ల లాభాల్లోకి..

దొండపర్తి(విశాఖ దక్షిణ): డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(డీసీఐఎల్) 2021–22 ఆర్థిక సంవత్సరంలో లాభాల్లోకి అడుగుపెట్టింది. 2020–21 ఆర్థిక సంవత్సరంలో రూ.167.97 కోట్ల వరకు నష్టాలను చవిచూసిన సంస్థ.. గతేడాది మొత్తం ఆదాయం రూ.801.54 కోట్లు కాగా.. పన్ను మినహా రూ.5.17 కోట్ల లాభాన్ని ఆర్జించింది. బుధవారం డీసీఐఎల్ ప్రధాన కార్యాలయంలో సంస్థ 46వ వార్షిక సాధారణ సమావేశం(ఏజీఎం) జరిగింది. డీసీఐఎల్ బోర్డు చైర్మన్, పోర్టు చైర్మన్ కె.రామమోహనరావు, ఎండీ అండ్ సీఈవో కెప్టెన్ ఎస్.దివాకర్, సీహెచ్‌వోడీ కేఎం చౌదరి, ఏఎం పి.సుధాకర్ పాల్గొన్న ఈ సమావేశంలో 2021–22 ఆర్థిక ఫలితాలను వాటాదారులు ఆమోదించారు. ఆ ఫలితాల ప్రకారం..

- సంస్థ నిర్వహణ ఆదాయం గతేడాది రూ.766.92 కోట్లు కాగా.. ప్రస్తుతం రూ.801.54 కోట్లకు చేరింది. ఇతర ఆదాయం రూ.2.45 కోట్లు వచ్చింది.
- అలాగే షేరు విలువ 2020–21లో మైనస్ రూ.59.99గా ఉండగా.. ఈ సంవత్సరం రూ.1.84గా ఉంది.
- ఆత్మ నిర్భర్ భారత్ కార్యక్రమం కింద కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో డీసీఐ ద్వారా మూడు 12 వేల క్యూబిక్ మీటర్ల డ్రెడ్జర్‌ల నిర్మాణానికి నిపుణుల కమిటీ చేసిన సిఫార్సులకు మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది.
- మొదటి డ్రెడ్జర్ పనులు 2022లో ప్రారంభం కాగా, రెండో డ్రెడ్జర్ పనులు 2025లో జరగనున్నాయి. ఈ రెండు డ్రెడ్జర్ల సేకరణ, పని తీరు ఆధారంగా మూడో డ్రెడ్జర్ బాధ్యతలను సంస్థకు అప్పగించనున్నారు.

శ్రీవారి సర్వ దర్శనానికి 36 గంటలు


ధ్వజస్తంభం వద్ద సత్యాత్మ తీర్థ స్వామి

తిరుమల: తిరుమలలో 12 కంపార్టుమెంట్లు నిండాయి. సర్వ దర్శన టోకెన్లు లేనివారికి 36 గంటలు, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి 3 గంటలు పడుతుంది.

స్వామి వారి సేవలో ప్రముఖులు

ఉత్తరాజ మఠం పీఠాధిపతి పడంగల వారు సత్యాత్మ తీర్థ స్వామికి శ్రీవారి ఆలయం తరఫున బుధవారం చిన్నమర్యాద చేశారు. ఆయనకు శ్రీవారి ఆలయం వద్ద టీటీడీ అర్చకస్వాములు, అధికారులు ఇస్తికఫాల్ స్వాగతం పలికి దర్శనం చేయించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. స్వామితో పాటు వారి శిష్య బృందం కూడా ఉన్నారు. అలాగే, స్వామివారిని పాట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాజేష్ కుమార్ వర్మ, కర్ణాటక మంత్రి ఈశ్వరప్ప, సినీ నటుడు ఆశిష్ సిద్ధార్థ దర్శించుకున్నారు.

హత్యకు గురైన మొదటి పిటిషనర్

- ప్రాణభయం వ్యక్తం చేసిన రెండో పిటిషనర్
- అతనికి భద్రత కల్పించాలని పల్నాడు జిల్లా ఎస్పీకి హైకోర్టు ఆదేశం
- నర్సరావుపేట జామా మసీదు వ్యవహారంపై విచారణ 28కి వాయిదా

సాక్షి, అమరావతి : కోర్టులో వ్యాజ్యం దాఖలు చేసిన ఇద్దరిలో ఓ పిటిషనర్ హత్యకు గురవడంతో రెండో పిటిషనర్‌గా ఉన్న 70 ఏళ్ల షేక్ ఫరీద్‌కు తగిన భద్రత కల్పించాలని పల్నాడు జిల్లా ఎస్పీని హైకోర్టు బుధవారం ఆదేశించింది. తదుపరి ఉత్తర్వులు జారీ చేసేంతవరకు ఈ భద్రతను కొనసాగించాలని చెప్పింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల కాపీని తక్షణమే జిల్లా ఎస్పీకి వాట్సాప్, ఈమెయిల్ ద్వారా పంపాలని హైకోర్టు రిజిస్ట్రీని ఆదేశించారు. పల్నాడు జిల్లా, నర్సరావుపేట శ్రీరాంపురంలోని జామా మసీదు నిర్వహణను అధీనంలోకి తీసుకునేందుకు మైనారిటీ శాఖ ప్రయత్నిస్తోందని, మసీదు ఆస్తులు ప్రైవేటు వ్యక్తుల పరమవకుండా చర్యలు తీసుకునేలా ఆదేశాలివ్వాలని కోరుతూ షేక్ ఇబ్రహీం, షేక్ ఫరీద్ ఈ ఏడాది సెప్టెంబర్‌లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం మరోసారి విచారణకు వచ్చింది. ఈ సందర్భంగా పిటిషనర్ల తరపు న్యాయవాది టి.అనూప్ కుమార్ వాదనలు వినిపిస్తూ.. పిటిషన్‌ను ఉపసంహరించుకోకపోతే హతమారుస్తామంటూ కొందరు వ్యక్తులు పిటిషనర్లను బెదిరించారని చెప్పారు. మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు నర్సరావుపేట రామిరెడ్డి పేట వద్ద మొదటి పిటిషనర్ షేక్ ఇబ్రహీంను దారుణంగా హత్య చేశారని తెలిపారు. రెండో పిటిషనర్ షేక్ ఫరీద్‌కు సైతం ప్రాణహాని ఉన్నందు, ఆయనకు తగిన భద్రత కల్పించేలా పోలీసులను ఆదేశించాలని కోరారు. ఈ వాదనలను న్యాయమూర్తి పరిగణనలోకి తీసుకుని, షేక్ ఫరీద్‌కు తగిన భద్రత కల్పించాలని పల్నాడు జిల్లా ఎస్పీని ఆదేశించారు. తదుపరి విచారణను 28కి వాయిదా వేశారు.

'జగనన్న సంకల్పం' ట్రైలర్ విడుదల

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): 'జగనన్న సంకల్పం' చిత్రం ప్రజాదరణ పొందుతుందని తెలుగు అకాడమీ చైర్మన్ నందమూరి లక్ష్మీపార్వతి అన్నారు. ఆర్కే బ్యానర్‌పై నిర్మించిన 'జగనన్న సంకల్పం' ట్రైలర్ విడుదల ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగింది. లక్ష్మీపార్వతి ట్రైలర్‌ను ఆవిష్కరించారు. చిత్ర దర్శకుడు కల్లూరు రుద్రకిరణ్ పాల్గొన్నారు.

టీడీపీ మాజీ ఎమ్మెల్యేపై కేసు నమోదు

ముదినేపల్లి రూరల్: కైకలూరు మాజీ ఎమ్మెల్యే జయమంగళ వెంకటరమణపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ షణ్ముఖసాయి తెలిపారు. ఏలూరు జిల్లాలోని పెదపాలపర్రు వద్ద హైవేపై ధాన్యం ఉంచి వాహనాల రాకపోకలకు విఘాతం కల్పించేలా జయమంగళ ఆధ్వర్యంలో టీడీపీ నేతలు నిరసనకు దిగారని చెప్పారు. ప్రయాణికులకు ఇబ్బంది కల్పించడంతో పాటు నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించిన కారణంగా, మాజీ ఎమ్మెల్యేతో పాటు టీడీపీ నేతలు చల్లగుల్ల శోభనాద్రిచౌదరి, దావు నాగరాజుతో పాటు మరో 32 మందిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

మోడల్ బైలాస్ ప్రకారమే ఎన్నికలు నిర్వహిస్తాం

- హైకోర్టుకు నివేదించిన ఏపీహెచ్‌ఏఏ ప్రస్తుత కార్యవర్గం
- ఇప్పటికే షెడ్యూల్‌ను కోర్టు ముందుంచినట్లు వెల్లడి
- షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని ధర్మాసనం ఆదేశం



సాక్షి, అమరావతి : మోడల్ బైలాస్ ప్రకారమే ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాదుల సంఘం (ఏపీహెచ్‌ఏఏ) ఎన్నికలు నిర్వహిస్తామని ప్రస్తుత కార్యవర్గం బుధవారం హైకోర్టుకు నివేదించింది. ఇప్పటికే ఖరారు చేసిన షెడ్యూలు ప్రకారమే ఎన్నికలు నిర్వహిస్తామని వివరించింది. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు.. ఆ షెడ్యూల్ ప్రకారం ప్రశాంత, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహిస్తారని ఆశిస్తున్నట్లు తెలిపింది. ఈ వ్యాజ్యంలో ఇక విచారించేందుకు ఏమీ లేదని, వ్యాజ్యాన్ని మూసివేస్తున్నట్లు తెలిపింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య ధర్మాసనం బుధవారం ఉత్తర్వులిచ్చింది. హైకోర్టు న్యాయవాదుల సంఘం కార్యవర్గం కాలపరిమితి ముగిసిప్పటికీ, ఎన్నికలకు బార్ కౌన్సిల్ చర్యలు తీసుకోలేదని, తన ఫిర్యాదునూ పట్టించుకోలేదని న్యాయవాది ఎన్.విజయభాస్కర్ దాఖలు చేసిన పిటిషన్‌పై సింగిల్ జడ్జి జస్టిస్ దేవానంద్ ఇటీవల విచారణ జరిపారు. పిటిషనర్ ఫిర్యాదు ఆధారంగా తీసుకున్న చర్యలపై నివేదిక ఇవ్వాలని బార్ కౌన్సిల్‌ను ఆదేశించారు. ఈ ఆదేశాలతో హైకోర్టు న్యాయవాదుల సంఘం కార్యకలాపాల నిర్వహణకు ఏడుగురు న్యాయవాదులతో ఓ అడ్‌హాక్ కమిటీని బార్ కౌన్సిల్ చైర్మన్ నియమించారు. దీంతో అడ్‌హాక్ కమిటీ వెంటనే కార్యవర్గం నుంచి బాధ్యతలు తీసుకోవాలని జస్టిస్ దేవానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ ప్రస్తుత కార్యవర్గం అధ్యక్షుడు కె.జానకిరామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కోనపల్లి నర్సిరెడ్డి వేర్వేరుగా ధర్మాసనం ముందు అప్పీళ్లు దాఖలు చేశారు. ఈ అప్పీళ్లపై సీజే ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ జరిపింది. తాము మోడల్ బైలాస్ ప్రకారమే ఎన్నికలు నిర్వహిస్తామని ప్రస్తుత అధ్యక్షుడు జానకిరామిరెడ్డి తరపున సీనియర్ న్యాయవాది ఎస్.సత్యనారాయణ ప్రసాద్ కోర్టుకు తెలిపారు. ఎన్నికల షెడ్యూల్‌ను ఈ నెల 14న కోర్టు ముందుంచామని, దాని ప్రకారమే ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు.

చిత్తూరు ఆర్టీసీ-2 డిపోకు గోల్డ్ అవార్డు

చిత్తూరు రూరల్: చిత్తూరు ఆర్టీసీ–2 డిపోకు గోల్డ్ అవార్డు వరించింది. విద్యుత్ ఆదాలో చిత్తూరు బస్టాండ్ రాష్ట్ర స్థాయిలో తొలి స్థానంలో నిలిచింది. చిత్తూరు బస్టాండ్‌లో సోలార్ సిస్టం ఉంది. ఇది 100 కెడబ్ల్యూపీ సామర్థ్యంతో నెలకు 9,000 యూనిట్ల విద్యుత్‌ను అందిస్తోంది. తద్వారా నెలకు రూ.1.5 లక్షలు ఆదా అవుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని బస్టాండ్‌ల్లోనూ విద్యుత్ ఆదాలో చిత్తూరు బస్టాండ్ తొలి స్థానంలో నిలవడంతో గోల్డ్ అవార్డును ఆ డిపో అధికారులు అందుకున్నారు. డిపో అధికారులను డీపీటీవో జితేంద్రనాథ్‌రెడ్డి, నేషనల్ మజ్దూర్ యూనియన్ నేతలు భాస్కర్, నారాయణ, వినోద్, గోపీనాథ్ అభినందించారు.

ట్రిపుల్‌ఎఫ్ కర్మాగారంలో భారీ విస్ఫోటనం

- ఒకరు గల్లంతు.. ఐదుగురికి తీవ్రగాయాలు
- ఇద్దరి పరిస్థితి విషమం


ట్రిపుల్‌ఎఫ్ కర్మాగారంలో పేలుడుకు ఎగసిన మంటలు

పెంటపాడు: పశ్చిమగోదావరి జిల్లా పెంటపాడు మండలం ప్రత్తిపాడు గ్రామంలోని ట్రిపుల్‌ఎఫ్ కర్మాగారంలో బుధవారం సాయంత్రం భారీ విస్ఫోటనం సంభవించింది. పరిశ్రమలో మూడంతస్తుల మేర ఉన్న ఎక్సైస్‌గా పిలిచే సాల్వెంట్ ప్లాంట్‌లో జరిగిన ప్రమాదంలో మంటలు భారీగా ఎగసిపడ్డాయి. ప్రమాదం జరిగిన సమయంలో ప్లాంట్‌లో 9 మంది పనిచేస్తుండగా వారిలో తాడేపల్లిగూడెం మండలం కుంచనపల్లికి చెందిన గుడిగంట మల్లికార్జునరావు అనే కార్మికుడి ఆచూకీ తెలియలేదు. అతడు గల్లంతైనట్టు భావిస్తున్నారు. కాగా మరో ముగ్గురు కార్మికులు తృటిలో తప్పించుకుని పరుగులు తీయడంతో ప్రాణాలు దక్కించుకున్నారు. మిగిలిన ఐదుగురు కార్మికులకు తీవ్ర గాయాలు కాగా వారిని తాడేపల్లిగూడెంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వారిలో పరిస్థితి తీవ్రంగా ఉన్న ఇద్దరిని రాజమండ్రి తరలించినట్టు ఎస్ఐ జి.సత్యనారాయణ తెలిపారు. ఘటనా స్థలాన్ని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు పరిశీలించారు. పరిశ్రమ యాజమాన్యంతో మాట్లాడి విస్ఫోటనంలో దగ్ధమైన యంత్రాలను పరిశీలించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని ఆస్పత్రి యాజమాన్యాన్ని ఫోన్‌లో కోరారు.

చెవిరెడ్డి మణిరెడ్డికి కన్నీటి వీడ్కోలు

- ముగిసిన అంత్యక్రియలు
- తరలివచ్చిన అభిమానులు, పార్టీ శ్రేణులు


చెవిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డికి అంతిమ సంస్కారం నిర్వహిస్తున్న కుమారులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, రఘునాథ రెడ్డి

తిరుపతి రూరల్: ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే, తుడా చైర్మన్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తండ్రి చెవిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి అలియాస్ మణిరెడ్డి (76) అంత్యక్రియలు బుధవారం ముగిశాయి. మణిరెడ్డికి నివాళులర్పించేందుకు మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు, తిరిగి బుధవారం ఉదయం నుంచే ఆయన స్వగ్రామం తుమ్మలగుంటకు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల నలుమూలల నుంచి అభిమానులు తరలివచ్చారు. అంతిమయాత్ర ప్రారంభంలో తండ్రి పార్థివదేహం వద్ద చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కన్నీరుమున్నీరయ్యారు. తుమ్మలగుంట శ్మశానవాటికలో మణిరెడ్డి చిన్నకుమారుడు రఘునాథరెడ్డి తండ్రికి తలకొరివి పెట్టారు. డిప్యూటీ సీఎం నారాయణస్వామి, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి తుమ్మలగుంటలో మణిరెడ్డికి నివాళులర్పించారు.

బహుజనుల పెన్నిధి సీఎం జగన్

- 815వ రోజు రిలేనిరాహార దీక్షలో బహుజన నేతలు


జగనన్న జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని దుస్తులు పంపిణీ చేస్తున్న బహుజన నాయకులు

తాడికొండ: రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల సంక్షేమానికి ఎనలేని కృషి చేస్తూ..పేదల పక్షపాతిగా, పెన్నిధిగా పేరుతెచ్చుకున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని బహుజన పరిరక్షణ సమితి నాయకులు స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సెస్ రోడ్డు జంక్షన్‌లో బుధవారం మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 815వ రోజు కొనసాగుతున్న రిలేనిరాహార దీక్షలో పలువురు మాట్లాడారు. రాష్ట్రంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమం అందేలా నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే నగదు మళ్లింపు పథకాలను అందజేస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్నారని తెలిపారు. చంద్రబాబునాయుడు గత 14 ఏళ్లలో తాను దోచుకుని దాచుకోవడంతో పాటు తన సామాజిక వర్గానికి భారీగా దోచిపెట్టేందుకే అధికారాన్ని వినియోగించుకున్నాడని విమర్శించారు. తనకిదే ఆఖరి చాన్సు అంటూ తిరుగుతున్న చంద్రబాబును తథాస్తు దేవతలను ఆశీర్వదిస్తారని చెప్పారు. ఒక్క అమరావతినే అభివృద్ధిచేసి రాయలసీమ, ఉత్తరాంధ్రను గాలికొదిలేస్తే ఆ ప్రాంత ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు.

రుషికొండ సర్వేకు మేమే కమిటీ వేస్తాం

మీ కంటి తుడుపు కమిటీ మాత్రమే

- కమిటీలో రాష్ట్ర ప్రభుత్వాధికారులకు స్థానం కల్పించడం సరికాదు
- కేంద్ర ప్రభుత్వానికి తేల్చి చెప్పిన హైకోర్టు సీజే ధర్మాసనం
- కమిటీపై అభ్యంతరాలను లిఖితపూర్వకంగా ఇవ్వాలని పిటిషనర్లకు ఆదేశం
- విచారణ నేటికి వాయిదా

సాక్షి, అమరావతి : విశాఖపట్నం రుషికొండ రిసార్ట్ పునరుద్ధరణలో భాగంగా చేపట్టిన తవ్వకాల విషయంలో సర్వేకు కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ (ఎంవోఈఎఫ్) ఏర్పాటు చేసిన కమిటీపై హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. కమిటీలో రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు స్థానం కల్పించడాన్ని తప్పుపట్టింది. తామే కమిటీని ఏర్పాటు చేస్తామని చెప్పింది. తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

అందులో ఎలాంటి దురుద్దేశాలు లేవు...

విశాఖ జిల్లా యండాడ గ్రామం సర్వే నంబర్ 19లోని కోస్టల్ రెగ్యులేషన్ జోన్‌లో చెట్ల నరికివేత, భూమి తవ్వకాలకు అనుమతులివ్వడంపై జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ వేర్వేరుగా దాఖలు చేసిన వ్యాజ్యాలపై సీజే ధర్మాసనం ఇటీవల విచారణ జరిపింది. తవ్వకాలపై సర్వే చేసి నివేదిక ఇచ్చేందుకు బాధ్యతాయుతమైన అధికారి నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేయాలని కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖను ఆదేశించింది. ఈ వ్యాజ్యాలు బుధవారం మరోసారి విచారణకు వచ్చాయి. మూర్తి యాదవ్ తరపు సీనియర్ న్యాయవాది కేఎస్ మూర్తి వాదనలు వినిపిస్తూ.. పర్యావరణం, ఇతర అంశాల్లో నైపుణ్యం ఉన్న కేంద్ర అధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. కమిటీకి ఎంవోఈఎఫ్ అధికారే నేతృత్వం వహిస్తారని కేంద్ర ప్రభుత్వం తరపున డిప్యూటీ సొలిసిటర్ జనరల్ (డీఎస్‌జీ) ఎన్.హరినాథ్ చెప్పారు. క్షేత్రస్థాయి పరిస్థితులపై అవగాహన ఉన్నందునే సర్వేలో సహాయ పడేందుకు రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు స్థానం కల్పించినట్లు చెప్పారు. ఇందులో ఎలాంటి దురుద్దేశాలూ లేవన్నారు. కమిటీని నోటిఫై చేస్తూ ఎంవోఈఎఫ్ ప్రొసీడింగ్స్ జారీ చేసిందన్నారు. ధర్మాసనం జోక్యం చేసుకుంటూ.. రుషికొండ తవ్వకాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఆరోపణలు ఎదుర్కొంటోందని, అలాంటప్పుడు రాష్ట్ర ప్రభుత్వాధికారులను కమిటీలో నియమించడం ఎంత వరకు సబబని ప్రశ్నించింది. ఈ కమిటీ కంటి తుడుపు చర్య మాత్రమేనంది. కమిటీలో ఉన్న ప్రభుత్వ శాఖలు స్వతంత్రమైనవని రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) చింతల సుమన్ చెప్పారు. శాఖల ముందు ఆంధ్రప్రదేశ్ అని ఉన్నంత మాత్రాన ప్రభుత్వ నియంత్రణలో పనిచేస్తున్నట్లు కాదన్నారు. అందువల్లే ఆ శాఖల అధికారులకు స్థానం కల్పించారని వివరించారు. అందరి వాదనలు విన్న ధర్మాసనం.. ఎంవోఈఎఫ్ కమిటీపై అభ్యంతరాలను లిఖితపూర్వకంగా తమ ముందుంచాలని పిటిషనర్ల తరపు న్యాయవాదులను ఆదేశించింది.

స్కూల్ బస్సు బోల్తా
మణిపూర్‌లో ఏడుగురి మృతి



ఇంఫాల్: మణిపూర్‌లోని నోనీ జిల్లాలో బుధవారం ఘోర ప్రమాదం జరిగింది. పాఠశాల విద్యార్థినులు ప్రయాణిస్తున్న బస్సు బోల్తా పడి ఏడుగురు పిల్లలు విగత జీవులయ్యారు. 25 మంది గాయపడ్డారు. రాష్ట్ర రాజధాని ఇంఫాల్‌కు 55 కిలోమీటర్ల దూరంలోని లాంగ్‌సాయ్ సమీపంలో ఓల్డ్ చాచర్ రోడ్డుపై ఈ దుర్ఘటన జరిగిందని పోలీసులు తెలిపారు. థాంబాల్ను హయ్యర్ సెకెండరీ స్కూల్ విద్యార్థినులు స్టడీ టూర్ కోసం బస్సులో ఖౌపూమ్‌కు బయలుదేరారు. మధ్యలో బస్సుపై డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో బోల్తా పడింది. సమాచారం అందుకున్న అధికారులు రంగంలోకి దిగారు. క్షతగాత్రులను ఇంఫాల్‌లోని ఆసుపత్రులకు తరలించారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున, గాయపడినవారికి రూ.లక్ష చొప్పున పరిహారం ఇవ్వనున్నట్లు మణిపూర్ ముఖ్యమంత్రి ఎన్.బీరెన్ సింగ్ ప్రకటించారు. ప్రమాదంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేల చొప్పున పరిహారం ప్రకటించారు.

క్లుప్తంగా...

ఆ చానళ్లను మూసేయండి
యూట్యూబ్‌కు కేంద్రం ఆదేశం

న్యూఢిల్లీ: ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై తప్పుడు, సంచలనాత్మక వార్తలను వ్యాప్తి చేస్తున్న మూడు చానళ్లను మూసేయాల్సిందిగా యూట్యూబ్‌ను కేంద్రం ఆదేశించింది. ఆజ్‌తక్ లైవ్, న్యూస్ హెడ్‌లైన్స్, సర్కారీ అప్‌డేట్స్ చానళ్లు తప్పుడు వార్తలకు వాహకాలుగా మారాయని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) ఫ్యాక్ట్ చెక్ విభాగం మంగళవారం ప్రకటించింది. కేంద్ర పథకాలతో పాటు సుప్రీంకోర్టు, సీజేఐ, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై కూడా ఇవి తప్పుడు వార్తలు ప్రచారం చేస్తున్నాయని పేర్కొంది. ఈ నేపథ్యంలో కేంద్రం బుధవారం యూట్యూబ్‌కు ఈ మేరకు ఆదేశాలు జారీ చేసినట్టు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అయితే ఆజ్‌తక్ లైవ్ చానల్‌కు ఇండియాటుడే గ్రూప్‌తో సంబంధం లేదని వెల్లడించాయి. ఈ మూడు చానళ్లకు కలిపి 33 లక్షల మంది సబ్‌స్క్రైబర్లున్నాయి. వాటి వీడియోలకు 30 కోట్లకు పైగా వ్యూస్ వచ్చాయి.

ఐదేళ్లలో 3.77 లక్షల మంది ఎంపిక: జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ: యూపీఎస్సీ, ఎస్ఎస్‌సీ, ఆర్ఆర్‌బీ ద్వారా గత ఐదేళ్లలో 3,77,802 మంది అభ్యర్థులను కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానమిచ్చారు. ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీ చేయాలని కేంద్ర ప్రభుత్వ శాఖలు, విభాగాలకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు గుర్తుచేశారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి దేశవ్యాప్తంగా రోజ్‌గార్ మేళాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

డ్రగ్స్ నేరగాళ్లకు జైలే గతి
లోక్‌సభలో కేంద్ర హోం మంత్రి షా

న్యూఢిల్లీ: మాదక ద్రవ్యాల అక్రమ రవాణాలో భాగస్వాములైన బడా నేరగాళ్లను రాబోయే రెండేళ్లలో కచ్చితంగా జైలుకు తరలిస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తేల్చిచెప్పారు. డ్రగ్స్ దందాలో సంపాదించిన డబ్బును దేశంలో ఉగ్రవాద కార్యకలాపాలకు వాడుకుంటున్నారని ఆరోపించారు. ఈ పాపపు సొమ్ము దేశ ఆర్థిక వ్యవస్థకు ముప్పుగా తయారవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ సమస్యపై బుధవారం లోక్‌సభలో జరిగిన స్వల్పకాలిక చర్చలో అమిత్ షా మాట్లాడారు. మాదక ద్రవ్యాల కట్టడికి ఎన్నో చర్యలు తీసుకుంటున్నామన్నారు. డ్రగ్స్ వ్యాపారం చేసేవారిపై కేసుల నమోదు అధికారాన్ని బీఎస్ఎఫ్, సీమా సురక్షాబల్, అస్సాం రైఫిల్స్‌కు కట్టబెట్టామని అమిత్ షా గుర్తుచేశారు. ఈ అంశాన్ని రాజకీయం చేయొద్దని కోరారు. 2014 నుంచి 2022 వరకూ రూ.97,000 కోట్ల విలువైన డ్రగ్స్‌ను ధ్వంసం చేసినట్లు తెలిపారు. 2006 నుంచి 2013 దాకా రూ.23,000 కోట్ల విలువైన సరుకును స్వాధీనం చేసుకుందని వెల్లడించారు.

చార్లెస్ శోభరాజ్‌ను విడుదల చేయండి
నేపాల్ సుప్రీంకోర్టు ఉత్తర్వులు




ఖాట్మాండు: అంతర్జాతీయ నేరగాడు, ఫ్రెంచ్ సీరియల్ కిల్లర్ చార్లెస్ శోభరాజ్(78)ను జైలు నుంచి విడుదల చేయాలని నేపాల్ సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. అనారోగ్యంతో బాధపడుతున్న నేపథ్యంలో శోభరాజ్‌కు జైలు నుంచి విముక్తి కల్పించాలని పేర్కొంది. అతడు స్వదేశానికి వెళ్లిపోవడానికి వీలుగా 15 రోజుల్లోగా ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వానికి సూచించింది. చార్లెస్ శోభరాజ్ 1975 నాటి హత్య కేసులో 2003 నుంచి జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. తనను విడుదల చేయాలని కోరుతూ గతంలో సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. పిటిషన్ దాఖలు చేశాడు.

భారత్‌లో 3 బీఎఫ్.7 కేసులు

న్యూఢిల్లీ: చైనాను వణికిస్తున్న ఒమిక్రాన్ సబ్ వేరియంట్ బీఎఫ్.7 పాజిటివ్ కేసులు భారత్‌లోనూ వెలుగుచూశాయి. దేశంలో ఇప్పటిదాకా 3 కేసులు బయటపడ్డాయని కేంద్ర ఆరోగ్య శాఖ బుధవారం ప్రకటించింది. భారత్‌లో తొలి బీఎఫ్.7 కేసును ఈ ఏడాది సెప్టెంబర్‌లో గుజరాత్ బయోటెక్నాలజీ రీసెర్చ్ సెంటర్ గుర్తించింది. అహ్మదాబాద్‌లోని గోటా ఏరియాలో ఉండే వ్యక్తికి ఈ ఉప వేరియంట్ సోకినట్లు పరీక్షలో తేలింది. అతడు సెప్టెంబర్‌లో విదేశాల నుంచి వచ్చాక కరోనా లక్షణాలు కనిపించాయి. జీనోమ్ సీక్వెన్సింగ్‌లో బీఎఫ్.7గా గుర్తించారు. గుజరాత్‌లోని వడోదరలో ఓ ఎన్ఆర్ఐ మహిళకు సైతం ఇదే సబ్‌వేరియంట్ సోకింది. 61 ఏళ్ల సదరు మహిళ నవంబర్‌లో అమెరికా నుంచి వచ్చారు. వారం తర్వాత పరీక్ష చేయగా బీఎఫ్.7 సోకినట్లు తేలింది. అయితే ఆమె క్రమంగా కోలుకున్నారు. ఒడిశా రాష్ట్రంలోనూ ఒక బీఎఫ్.7 కేసు నమోదైంది. బీఏ.5 అని పిలిచే ఒమిక్రాన్‌కు చెందిన ఉప వేరియంట్ బీఎఫ్.7. అత్యంత వేగంగా వ్యాప్తి చెందడం దీని ప్రధాన లక్షణం. బలమైన ఇన్ఫెక్షన్ కలిగిస్తుంది. కరోనా టీకా తీసుకున్నవారిని సైతం బీఎఫ్.7 ప్రభావితం చేస్తున్నట్లు తేలింది. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి ముప్పు మరింత ఎక్కువ. ఈ నేపథ్యంలో చైనా, ఇతర దేశాల నుంచి వచ్చేవారికి విమానాశ్రయాల్లోనే కరోనా పరీక్షలు చేయనున్నారు.

భయం వద్దు.. జాగ్రత్తలు చాలు



బీఎఫ్.7.. కరోనా ఒమిక్రాన్‌లో సబ్‌వేరియెంట్. ప్రస్తుతం చైనా వెన్నులో వణుకు పుట్టిస్తోంది. విస్తృతంగా వ్యాప్తి చెందే ఈ వేరియెంట్ ప్రపంచ దేశాలకు కొత్తేం కాదు. అక్టోబర్‌లోనే బీఎఫ్.7 కేసులు అమెరికా, కొన్ని యూరప్ దేశాల్లో వెలుగులోకి వచ్చాయి. ఈ సబ్ వేరియెంట్ అత్యంత బలమైనది. కరోనా సోకి యాంటీబాడీలు వచ్చినవారు, వ్యాక్సిన్ తీసుకున్న వారిలో రోగనిరోధక శక్తిని ఎదిరించి మరీ ఇది శరీరంలో తిష్టవేసుకొని కూర్చుంటుంది. అందుకే ప్రజలందరూ జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరని అంటువ్యాధుల నిపుణులు సూచిస్తున్నారు. భారత్‌లో జనవరిలో థర్డ్ వేవ్ వచ్చిన సమయంలో ఒమిక్రాన్‌లోని బీఏ.1, బీఏ.2 సబ్ వేరియెంట్‌లు అధికంగా కనిపించాయి. ఆ తర్వాత బీఏ.4, బీఏ.5లని కూడా చూశాం. ఇన్నాళ్లు అతి జాగ్రత్తలు తీసుకున్న చైనా ఒక్కసారిగా అన్ని ఆంక్షలు ఎత్తేయడంతో అక్కడ ప్రజల్లో కరోనాని తట్టుకునే రోగనిరోధక వ్యవస్థలేదు. అదే ఇప్పుడు చైనా కొంప ముంచింది. వాస్తవానికి ఇప్పుడు చైనాలో నెలకొన్నలాంటి స్థితిని దాటి మనం వచ్చేశామని కోవిడ్–19 జన్యుక్రమ విశ్లేషణలు చేసే సంస్థ ఇన్సాకాగ్ మాజీ చీఫ్ డాక్టర్ అనురాగ్ అగర్వాల్ చెప్పారు. 2021 ఏప్రిల్–మే మధ్యలో డెల్టా వేరియెంట్‌తో భారత్‌లో భారీగా ప్రాణ నష్టం జరిగిందని, ఆ సమయంలో కరోనా సోకిన వారిలో రోగనిరోధక శక్తి అధికంగా ఉందని అన్నారు. ఇక ఒమిక్రాన్‌లో బీఎఫ్.7 చైనాలో అత్యధికంగా వృద్ధుల ప్రాణాలు తీస్తోందని, మన దేశంలో యువజనాభా ఎక్కువగా ఉండడం వల్ల భయపడాల్సిన పని లేదని డాక్టర్ అగర్వాల్ చెబుతున్నారు. అయితే విస్తృతంగా వ్యాప్తి చెందే ఈ వైరస్‌తో జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి. గొంతు నొప్పి, దగ్గు, జ్వరం వంటి లక్షణాలు ఈ వేరియెంట్‌లో ఎక్కువగా కనిపిస్తాయి. మాస్కులు ధరించడం, భౌతిక దూరం వంటి జాగ్రత్తలు తీసుకుంటే బీఎఫ్.7తో భారత్‌కు ముప్పేమీ ఉండదని వైద్య నిపుణులంటున్నారు. ఈ సబ్ వేరియెంట్ కేసులు అమెరికాలోని మొత్తం కేసుల్లో 5%, యూకేలో 7.26% ఉన్నాయి. అక్కడ మరీ అధికంగా కేసులు నమోదు కావడం లేదు. ఆస్పత్రుల్లో చేరే వారి సంఖ్య కూడా అంతగా లేదు. అందుకే భారత్‌లోనూ ఇది ప్రభావం చూపించదనే అంచనాలు ఉన్నాయి.

రెక్కలు విరిచేస్తున్నారు..

అఫ్గాన్ యూనివర్సిటీల్లో అమ్మాయిలకు ఇక నో ఎంట్రీ ● తాలిబన్లు వచ్చాక దుర్భరమైపోతున్న మహిళల బతుకులు



కాబూల్ వర్సిటీ ముందు విద్యార్థినుల అర్ధగింత

అఫ్గానిస్తాన్‌లో చదువుకునే అమ్మాయిలు భయపడినంతా జరిగింది. ఏదో ఒక రోజు ఉన్నత విద్యకి తాము దూరమవుతామని మహిళల ఆందోళనలు నిజమయ్యాయి. యూనివర్సిటీల్లో ఇక మహిళలకి ప్రవేశం లేదని తాలిబన్లు హుకుం జారీ చేశారు. అంతర్జాతీయంగా వస్తున్న అభ్యంతరాలను బేఖాతర్ చేస్తూ, అఫ్గాన్ మహిళలు కన్న కలల్ని కల్లలు చేస్తూ వారి హక్కుల్ని నిర్దాక్షిణ్యంగా కాలరాస్తున్నారు. తాలిబన్ల తాజా ఆదేశాలను వ్యతిరేకిస్తూ కాబూల్‌లో అమ్మాయిలు నిరసన ప్రదర్శనలకి దిగితే వాటిని ఉక్కుపాదంతో అణిచివేశారు. యూనివర్సిటీల దగ్గర తాలిబన్ బలగాలు భారీగా మోహరించి అమ్మాయిలు రాకుండా అడ్డుకుంటున్నారు. గత ఏడాది అమెరికా దళాలు వెనక్కి వెళ్లిపోయాక 2021, ఆగస్టు 15న తాలిబన్లు అధికారాన్ని చేజిక్కించుకున్నప్పుడు మహిళలకు అండగా ఉంటామని కల్లబొల్లి కబుర్లు చెప్పారు. ఈ ఏడాదిన్నర కాలంలో మహిళల పరిస్థితి మరింత దుర్భరంగా మారిపోయింది. ఎక్కువ మంది ఇళ్లకే పరిమితమైపోతున్నారు. రోజుకో కొత్త నిర్ణయంతో తాలిబన్లు మహిళల్ని తీవ్ర నిరాశ నిస్పృహలకి గురి చేయడంతో ఎందరో కుంగుబాటు సమస్యలతో బాధపడుతున్నారు. ఉన్నత విద్యకు అమ్మాయిల్ని దూరం చేయడంపై అమెరికా తీవ్ర స్థాయిలో మండిపడింది. అఫ్గాన్‌లో తాలిబన్లు మానవీయ సంక్షోభాన్ని సృష్టిస్తున్నారని విమర్శించింది. కాబూల్ యూనివర్సిటీ బయట అమ్మాయిలు ఏడుస్తూ, ఒకరినొకరు ఓదార్చుకుంటున్న దృశ్యాలు మనసుని పిండేస్తున్నాయి. అఫ్గాన్ మహిళల ఛిద్రమైపోతున్న బతుకు చిత్రం ఎలా ఉందో చూద్దాం.

– సాక్షి నేషనల్ డెస్క్

మగతోడు లేకుండా ప్రయాణాలకు నో

మగతోడు లేకుండా మహిళలు ఎక్కువ దూరం ప్రయాణాలు చేయకూడదని తాలిబన్లు 2021 డిసెంబర్‌లో నియంత్రణ విధించారు. మహిళలు ఒంటరిగా 45 మైళ్ల కంటే ఎక్కువ దూరం వెళ్ల కూడదు. అఫ్గాన్ జనాభాలో 10% మందికి ఆస్పత్రికి వెళ్లాలంటే కనీసం రెండు గంటలు ప్రయాణించాలి. అత్యవసర సమయాల్లో కూడా మగవారు లేకపోతే మహిళలకు చికిత్స ఇవ్వడాన్ని కూడా తాలిబన్లు అడ్డుకున్నారు.

బురఖా లేకపోతే రాళ్ల దాడులు



బురఖా లేకుండా మహిళలు అడుగు బయటకి పెడితే కఠిన శిక్షలు విధించడం మొదలు పెట్టారు. కాబూల్ వంటి నగరాల్లో ఈ నిబంధన గట్టిగా పాటించకపోయినప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు బురఖా లేకుండా వస్తే వారిని ఈడ్చుకువెళ్లడం, రాళ్లతో దాడి చేయడం వంటి అనాగరిక శిక్షలు విధించారు.

ఉద్యోగాలకూ మహిళలు గుడ్ బై

తాలిబన్లు అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రధానమంత్రి ముల్లా మహమ్మద్ హసన్ అఖుండ్ ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలు కొనసాగవచ్చునని భరోసా ఇచ్చారు. కానీ ఆ తర్వాత వారి వేతనాల్లో భారీగా కోత విధించారు. వందలాది మంది మహిళలు ఉద్యోగాలు వదులుకునే పరిస్థితుల్ని తెచ్చారు. మహిళలు నడిపే 3,500కి పైగా చిన్న వ్యాపారాలు మూతపడ్డాయి. కాబూల్‌లో 700 మంది మహిళా జర్నలిస్టులుంటే ఇప్పుడు కేవలం 100 మంది మాత్రమే పని చేస్తున్నారు. గతంలో దేశంలో 40 శాతం మంది మహిళా టీచర్లుంటే ఇప్పుడు అతి కొద్ది మాత్రమే ఉన్నారు.

45% బాలికలు డ్రాపవుట్



జలాలాబాద్ వర్సిటీలోకి అమ్మాయిలు రాకుండా సాయుధ పహారా

2021 సెప్టెంబర్ నుంచి అఫ్గాన్‌లో సెకండరీ స్కూల్స్‌లో అబ్బాయిలకే ప్రవేశం లభిస్తోంది. ఏడో తరగతి నుంచి అమ్మాయిల ప్రవేశాలను నిషేధించారు. ప్రాథమిక, సెకండరీ పాఠశాలల నుంచి 45% మంది అమ్మాయిలు డ్రాపవుట్ అయ్యారు.

26% అమ్మాయిల్లో కుంగుబాటు

మహిళల్ని వంటింటికే పరిమితం చేయడానికి తాలిబన్లు కఠిన నిర్ణయాలు తీసుకోవడంతో వారిని తీవ్ర నిరాశ నిస్పృహల్లోకి నెట్టేసింది. తాలిబన్ల రాక ముందున్న స్వేచ్ఛ కోల్పోవడంతో రెక్కలు తెగిన పక్షుల్లా విలవిలలాడుతున్నారు. అమ్మాయిల్లో 26% మంది మానసిక కుంగుబాటుతో బాధపడుతూ ఉంటే అబ్బాయిల్లో 16% మందికి ఆ సమస్య ఉంది. 27% అమ్మాయిలు ఆందోళన ఒత్తిడిని ఎదుర్కొంటూ ఉంటే అబ్బాయిల్లో 18శాతంగా ఉంది.

పెరిగిపోయిన బాల్యవివాహాలు

దుర్భర దారిద్ర్యంలో బతుకుతున్న కుటుంబాలు తాలిబన్లు అధికారంలోకి వచ్చాక తిండికి కూడా కరువు వచ్చింది. అమ్మాయిల్ని పోషించలేక బాల్యవివాహాలు జరిపించడం మొదలు పెట్టారు. తాలిబన్లు అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో కుటుంబ ఆర్థిక పరిస్థితి మెరుగుపరుచుకోవడం కోసం జరిగిన బాల్య వివాహాల్లో 88% మంది బాలికలే ఉన్నారని అంతర్జాతీయ హక్కుల సంస్థ ఆమ్నెస్టీ వెల్లడించింది.

కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో...
నెలకో పాదయాత్ర
హరియాణాలో జోడో యాత్రలో రాహుల్



జోడో యాత్రలో మాజీ సైనికులతో రాహుల్

నూహ్ (హరియాణా): ''కాంగ్రెస్, బీజేపీ మధ్య జరుగుతున్న పోరాటం కొత్తదేమీ కాదు. రెండు భిన్న భావజాలాల మధ్య వేలాది ఏళ్లుగా జరుగుతూ వస్తున్నదే. ప్రజల గొంతుకగా నిలవడమే కాంగ్రెస్ సిద్ధాంతం. కొద్దిమంది పెద్దలకు మాత్రమే సర్వం దోచిపెట్టడం బీజేపీ సిద్ధాంతం'' అని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ అన్నారు. ఆయన భారత్ జోడో యాత్ర బుధవారం రాజస్తాన్ నుంచి హరియాణాలోకి ప్రవేశించింది. పలువురు మాజీ సైనికులు తదితరులు ఆయన వెంట నడిచారు. ఈ సందర్భంగా అతి శీతల వాతావరణంలోనూ భారీ సంఖ్యలో గుమిగూడిన ప్రజలనుద్దేశించి ఆయన మాట్లాడారు. ''ఏసీల్లో కూర్చుని, కార్లలో తిరిగితే అర్థం కాని ఎన్నో విషయాలను యాత్ర ద్వారా తెలుసుకుంటున్నా. మన దేశంలో రాజకీయ నాయకులకు, ప్రజలకు మధ్య భారీ అగాథముంది. కాంగ్రెస్, బీజేపీతో సహా అన్ని పార్టీలకూ ఇది వర్తిస్తుంది. ప్రజల గొంతు వినే అవసరం లేదన్నది నాయకుల అభిప్రాయం. అందుకే గంటల కొద్దీ ప్రసంగాలిస్తుంటారు. దాన్ని మార్చేందుకు నేను ప్రయత్నిస్తున్నా. రోజూ ఆరేడు గంటలు నడుస్తున్నా. ఈ సందర్భంగా రైతులు, కార్మికులు, యువత, చిరుద్యోగుల వంటి అన్ని వర్గాల వారి అభిప్రాయాలు వింటూ సాగుతున్నాం. చివర్లో చాలా క్లుప్తంగా మాత్రమే మేం మాట్లాడుతున్నాం'' అని చెప్పారు. ఇకపై ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో కనీసం నెలకో రోజు నేతలు పాదయాత్ర చేయాలని అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు సూచిస్తానన్నారు.

దేశ భద్రతపై మౌనమా?

- కేంద్రంపై సోనియా గాంధీ ఆగ్రహం
- కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ భేటీ

న్యూఢిల్లీ: భారత్–చైనా సరిహద్దు అంశంపై పార్లమెంట్‌లో చర్చించకుండా కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి అవలంబిస్తోందని ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత సోనియా గాంధీ మండిపడ్డారు. దేశ భద్రతకు సంబంధించిన వ్యవహారంపై ప్రభుత్వం మౌనంగా ఉండడం ఏమిటని నిలదీశారు. బుధవారం పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో తమ ఎంపీలను ఉద్దేశించి సోనియా మాట్లాడారు. మన దేశ భూభాగాన్ని చైనా దురాక్రమిస్తున్నా నరేంద్ర మోదీ ప్రభుత్వం నోరుమెదపడం లేదని ఆరోపించారు. పార్లమెంట్‌లో చర్చిద్దామని కోరినా పట్టించుకోవడం లేదన్నారు. దేశ రక్షణ, సరిహద్దు పరిస్థితిపై దేశ ప్రజలకు నిజాలు చెప్పాలిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. తన చర్యలు, విధానాలు ఏమిటో కూడా చెప్పాలన్నారు.

క్షేత్రస్థాయిలో ఏం జరుగుతోంది?

దేశ సరిహద్దును చైనా సైన్యం ఉల్లంఘిస్తుండడం అత్యంత ఆందోళనకరమైన అంశమని సోనియా గాంధీ పేర్కొన్నారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ చైనా సైన్యం దాడులను సమర్థంగా తిప్పికొడుతున్న మన జవాన్లకు మన దేశం యావత్తూ అండగా నిలవాలని పిలుపునిచ్చారు. దేశ భద్రతకు సవాలు ఎదురైనప్పుడు పార్లమెంట్‌ను విశ్వాసంలోకి తీసుకోవడం ఒక ఆనవాయితీ అని గుర్తుచేశారు. మోదీ ప్రభుత్వం మాత్రం అందుకు సిద్ధంగా లేదని ఆక్షేపించారు. పార్లమెంట్‌లో చర్చ జరగకపోవడం వల్ల రాజకీయ పార్టీలకు, ప్రజలకు క్షేత్రస్థాయిలో జరుగుతున్నదేమిటో తెలియడం లేదన్నారు. దేశంలో విభజన రాజకీయాలు, సమాజంలో ఒక వర్గాన్ని లక్ష్యంగా చేసుకోవడం, విద్వేషాలు రెచ్చగొట్టడం వంటివి కొనసాగుతున్నాయని, దీనివల్ల విదేశాల నుంచి పొంచి ఉన్న ముప్పును ఎదిరించడం మన దేశానికి కష్టతరం అవుతుందని సోనియా ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయ వ్యవస్థను చట్టం పరిధి నుంచి తప్పించేందుకు ప్రభుత్వం కుట్రలు పన్నుతోందన్నారు. జ్యుడీషియరీని పలుచన చేయొద్దని సూచించారు.



చైనాపై పార్లమెంటులో చర్చ కోసం విపక్ష నేతలతో కలిసి నినాదాలు చేస్తున్న సోనియా

'చైనా'పై చర్చ జరగాల్సిందే

పార్లమెంటు ఆవరణలో విపక్షాల ధర్నా ● మీ హయాంలో చర్చించారా?: కేంద్రం

న్యూఢిల్లీ: చైనాతో సరిహద్దు ఉద్రిక్తతలపై పార్లమెంటులో చర్చ జరగాల్సిందేనని విపక్షాలన్నీ మరోసారి డిమాండ్ చేశాయి. కాంగ్రెస్ నేత సోనియాగాంధీ సారథ్యంలో బుధవారం పార్లమెంటు ఆవరణలో గాంధీ విగ్రహం వద్ద ధర్నాకు దిగాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, నేతలు, డీఎంకే, శివసేన, ఎన్సీపీ, ఆర్జేడీ, జేడీ(యూ), వామపక్షాలతో సహా 12 విపక్షాల ఎంపీలు పాల్గొన్నారు. ''ప్రధాని మోదీ మౌనం వీడాల్సిందే. చైనా దురాక్రమణ యత్నాలపై మా ప్రశ్నలకు సభలో బదులిచ్చి తీరాల్సిందే'' అని వారంతా నినదించారు. అయితే ఆ డిమాండ్‌ను కేంద్రం మరోసారి తోసిపుచ్చింది. యూపీఏ హయాంలో ఇలాంటి అంశాలను సభలో చర్చకు తాము డిమాండ్ చేస్తే ఇవ్వలేదని కేంద్ర న్యాయ మంత్రి కిరెన్ రిజిజు అన్నారు.

రాహుల్ యాత్రపై రగడ

కరోనా దృష్ట్యా తాత్కాలికంగా ఆపేయండి
- రాహుల్‌కు కేంద్ర ఆరోగ్య మంత్రి మాండవీయ లేఖ
- ప్రజాదరణకు భయపడి కుయుక్తులు: కాంగ్రెస్
- రాజస్తాన్, కర్ణాటకల్లో మీ యాత్రల మాటేమిటి?
- వాటికి కరోనా ప్రొటోకాల్ వర్తించదా?: జైరాం
- ప్రజారోగ్యంతోనూ రాజకీయాలంటూ ధ్వజం



మాస్క్‌తో మాండవీయ

న్యూఢిల్లీ/నూహ్ (హరియాణా): కరోనా విజృంభిస్తున్న నేపథ్యంలో వీలైతే భారత్ జోడో యాత్రను కొంతకాలం పాటు వాయిదా వేసుకోవాలంటూ కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీకి కేంద్ర ఆరోగ్య మంత్రి మన్సుఖ్ మాండవీయ రాసిన లేఖ రాజకీయ రగడకు దారితీసింది. యాత్రకు వెల్లువెత్తుతున్న ప్రజాదరణను చూసి అధికార బీజేపీ భయపడుతోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు. అందుకే ఎలాగైనా దాన్ని ఆపించేందుకు కుయుక్తులు పన్నుతోందని ఆరోపించారు. హర్యానాలో జోడో యాత్రలో పాల్గొంటున్న ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. ''జోడో యాత్రలో కరోనా ప్రొటోకాల్స్‌ను తూచా తప్పకుండా పాటిస్తాం. అయితే ముందుగా వాటిని ప్రకటించమనండి. ఓవైపు పార్లమెంటు సమావేశాలు మామూలుగానే కొనసాగుతున్నాయి. విమానాలతో సహా ఎక్కడా మాస్క్ నిబంధన కూడా అమల్లో లేదు. కరోనా వ్యాప్తి ముప్పు నిజంగానే అంత తీవ్రంగా ఉంటే సమావేశాలను వాయిదా వేయండి. మాస్క్ తప్పనిసరి చేయండి. జనాలు గుమిగూడటం తదితరాలను నిషేధించండి. అవేవీ లేకుండా కేవలం జోడో యాత్రను మాత్రమే ఆపేయాలంటూ కేంద్ర మంత్రి లేఖ రాయడమేంటి? రాజస్తాన్, కర్ణాటకల్లో బీజేపీ చేస్తున్న యాత్రలు, ర్యాలీలు ఆయనకు కన్పించలేదా? వాటిలో కరోనా ప్రొటోకాల్స్ పాటిస్తున్నారా? జోడో యాత్రకే తప్ప బీజేపీ యాత్రలకు ఏ నిబంధనలూ వర్తించవా? అందులో కరోనా నిబంధనలు పాటించడం లేదంటూ బీజేపీ ఎంపీ రాసిన లేఖ ఆధారంగా ఇలా ప్రవర్తిస్తారా? ఎందుకీ ద్వంద్వ ప్రమాణాలు?'' అంటూ తీవ్రస్థాయిలో దుయ్యబట్టారు. చివరికి అత్యంత కీలకమైన ప్రజారోగ్యంతోనూ రాజకీయాలు చేయడం బీజేపీకే చెల్లిందంటూ జైరాం ఎద్దేవా చేశారు. ''2020 మార్చిలో కరోనా కల్లోలం మొదలవగానే తక్షణం లాక్‌డౌన్ విధించండని కాంగ్రెస్ పదేపదే సూచించింది. కానీ కేవలం మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలదోసేందుకే లాక్‌డౌన్ విధింపును వారానికి పైగా ఆలస్యం చేసిన చరిత్ర మోదీ సర్కారుది'' అంటూ మండిపడ్డారు. దమ్ముంటే ఈ అంశంపై విపక్షాలతో చర్చకు రావాలని బీజేపీకి సవాలు విసిరారు.

మాండవీయ ఏమన్నారంటే...

జోడో యాత్రపై ముగ్గురు రాజస్తాన్ బీజేపీ ఎంపీలు మాండవీయకు ఫిర్యాదు చేశారు. ''యాత్రలో భాగంగా రాజస్తాన్‌లోకి ప్రవేశిస్తున్న ఇతర రాష్ట్రాల వారిలో కరోనా లక్షణాలు కన్పిస్తున్నాయి. కనుక కరోనా ప్రొటోకాల్స్ పూర్తిగా పాటించే వారే యాత్రలో పాల్గొనేలా, అందుకు ముందు, తర్వాత వారందరినీ ఐసోలేట్ చేసేలా చూడండి'' అంటూ లేఖ రాశారు. దీన్ని ఉటంకిస్తూ రాహుల్‌కు, సీఎం గెహ్లోట్‌కు మాండవీయ మంగళవారం లేఖ రాశారు. ''కరోనా ప్రొటోకాల్స్ పాటించేలా చూడండి. లేదంటే కొంతకాలం యాత్రను ఆపే అంశాన్ని పరిశీలించండి'' అని సూచించారు.

ఉక్రెయిన్‌కు పేట్రియాట్ క్షిపణులు

- గైడెడ్ బాంబులు, 80 కోట్ల డాలర్లు
- భారీ ప్యాకేజీ ప్రకటించిన అమెరికా

వాషింగ్టన్: ఉక్రెయిన్‌కు అమెరికా మరో భారీ సహాయ ప్యాకేజీ ప్రకటించింది. 180 కోట్ల డాలర్ల విలువైన సైనిక సాయం అందజేయనుంది. ఇందులో ఒక బిలియన్ డాలర్ల విలువైన ఆయుధాలు, 800 మిలియన్ డాలర్ల నిధులున్నాయి. పేట్రియాట్ క్షిపణులు, ఉక్రెయిన్ యుద్ధ విమానాల కోసం అత్యంత కచ్చితత్వంతో కూడిన గైడెడ్ బాంబులను తొలిసారిగా ఉక్రెయిన్‌కు ఇవ్వనుంది. ఉక్రెయిన్‌పై రష్యా వైమానిక దాడులు ముమ్మరం చేస్తోంది. డ్రోన్లు ప్రయోగిస్తోంది. వాటిని తిప్పికొట్టడానికే కొత్త ఆయుధాలిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ బుధవారం అమెరికాకు చేరుకున్నారు. అధ్యక్షుడు జో బైడెన్‌తో భేటీ కానున్నారు. అమెరికా కాంగ్రెస్‌లో ప్రసంగిస్తారు. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం మొదలైన తర్వాత జెలెన్‌స్కీ మరో దేశంలో అధికారికంగా పర్యటిస్తుండడం ఇదే తొలిసారి.

ఉక్రెయిన్ యుద్ధం 'విషాదం': పుతిన్

మాస్కో: ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని 'ఓ విషాదం'గా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అభివర్ణించారు! ''ఉక్రెయిన్ ప్రజలను మేమెప్పుడూ మా సోదరులుగానే చూశాం. ఇప్పటికీ అలాగే చూస్తున్నాం. ఇప్పుడక్కడ జరుగుతున్నది కచ్చితంగా విషాదమే'' అని అంగీకరించారు. ఏకపక్షంగా కయ్యానికి కాలు దువ్వి 9 నెలలుగా ప్రపంచమంతటినీ అతలాకుతలం చేస్తున్న ఆయన బుధవారం అత్యున్నత సైనికాధికారులతో భేటీలో ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే ఈ యుద్ధానికి కారణం పశ్చిమ దేశాలే తప్ప తాము కాదని చెప్పుకొచ్చారు. లక్ష్యాలు సాధించేదాకా ముందుకే వెళ్లి తీరతామని పునరుద్ఘాటించారు. మరోవైపు రష్యా సైన్యం సంఖ్యను ఇప్పుడున్న 10 లక్షల నుంచి 15 లక్షలకు పెంచుతామని రక్షణ మంత్రి సెర్గీ షొయిగూ ప్రకటించారు. వీరిలో దాదాపు 7 లక్షల మంది స్వచ్ఛంద, కాంట్రాక్టు సైనికులుంటారన్నారు. ఫిన్లండ్, స్వీడన్‌లకు చెక్ పెట్టేందుకు పశ్చిమ రష్యాలో నూతన సైనిక విభాగాలను నెలకొల్పుతామని షొయిగూ ప్రకటించారు.

వైద్య సిబ్బందికి ఇందిరా శాంతి బహుమతి

న్యూఢిల్లీ: ఇందిరాగాంధీ స్మారక ట్రస్టు స్థాపించిన 'ఇందిరాగాంధీ ప్రైజ్ ఫర్ పీస్, డిసార్మమెంట్, డెవలప్‌మెంట్–2022'ను దేశంలోని మొత్తం వైద్య సిబ్బందికి ప్రకటించారు. 2020, 2021లో కరోనా మహమ్మారి వ్యాప్తి ఉధృతంగా ఉన్న సమయంలో అందించిన సేవలను గాను ఈ బహుమతిని ప్రదానం చేయనున్నారు. ఇందిరాగాంధీ శాంతి బహుమతి కింద రూ.కోటి నగదు, ఒక ట్రోఫీ, ప్రశంసా పత్రం అందజేస్తారు.



రోగులకు నాణ్యమైన భోజనం

ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందే రోగులకు నాణ్యమైన పెట్టేందుకు జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

- 8లో



ఘనంగా క్రిస్మస్ హైటీ

క్రీస్తు బోధనల సారాన్ని అర్థం చేసుకుని, ప్రతి ఒక్కరూ సంఘానికి ఉపయోగపడాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి కోరారు.

- 8లో

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం ఫూల్‌బాగ్: సమగ్రశిక్ష ఆధ్వర్యంలో నడువబడుతున్న పట్టణ అణగారిని పిల్లల వసతి గృహం (నేతాజీ సుభాష్ చంద్రబోస్ అవస్య విద్యాలయం) నిర్వహణకు అర్హతగల ఎన్‌జీఓలు ఈనెల 28లోగా దరఖాస్తు చేసుకోవాలని సమగ్రశిక్ష ఏపీసీ డాక్టర్ వీఏ స్వామినాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌జీఓలు ప్రభుత్వ అనుమతితో రిజిస్ట్రేషన్ లేదా గుర్తింపు పొందాలన్నారు. ఎన్‌జీఓ సొసైటీ రిజిస్ట్రేషన్ వివరాలు, మూడు సంవత్సరాల ఐటీ రిటర్న్స్, ట్రాన్‌జాక్షన్స్ వివరాలు తెలియజేయాల్సి ఉంటుందన్నారు.

న్యూస్‌రీల్

23,24న మంత్రి బొత్స జిల్లా పర్యటన

విజయనగరం అర్బన్: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ గురువాం రాత్రి విజయనగరం జిల్లాకు చేరుకుంటారు. 23న ఉదయం 10.30 గంటలకు పార్వతీపురం లయన్స్ క్లబ్‌లో జరిగే జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 1.30 గంటలకు శ్రీకాకుళం వెళ్తారు. అక్కడ జరిగే పార్టీ జిల్లాస్థాయి సమావేశంలో పాల్గొని సాయంత్రం 6 గంటలకు తన నివాసానికి చేరుకుంటారు. 24న ఉదయం 10.30 గంటలకు బొండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 4 గంటలకు మెరకముడిదాం మండలం ఇప్పలవలసలో రైతు భరోసా కేంద్రం, గ్రామసచివాలయ భవనాలు ప్రారంభిస్తారు. అనంతరం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారు.

నాక్ గుర్తింపునకు సెంచూరియన్ సన్నద్ధం



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జీఎస్ఎన్ రాజు

నెల్లిమర్ల రూరల్: నాక్ గుర్తింపు పొందేందుకు నెల్లిమర్ల మండలం టెక్కలిలో ఉన్న సెంచూరియన్ యూనివర్సిటీ సిద్ధమవుతోందని వైస్ చాన్సలర్ జీఎస్ఎన్ రాజు అన్నారు. వర్సిటీలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాక్ గుర్తింపునకు అవసరమైన సదుపాయాలు వర్సిటీలో ఉన్నాయని చెప్పారు. మర్ని సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమణారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ వర్మ, ప్రొఫెసర్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

పదోతరగతి పరీక్ష ఫీజు చెల్లింపు గడువు పెంపు

విజయనగరం ఫూల్‌బాగ్: పదోతరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లింపునకు ప్రభుత్వం గడువు పెంచిందని డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఈ నెల 24లోగా, రూ.50 అపరాధరుసుముతో ఈనెల 29లోగా, రూ.200 అపరాధ రుసుముతో జనవరి 3లోగా, రూ.500 అపరాధరుసుముతో జనవరి 9లోగా ఫీజు చెల్లించవచ్చన్నారు. రెగ్యులర్ విద్యార్థులు అన్ని సబ్జెక్టులకు కలిసి రూ.125, మూడు లేదా అంతకన్నా తక్కువ సబ్జెక్టులకు రూ.110, మూడు కన్నా ఎక్కువ సబ్జెక్టులకు రూ.125, ఒకేషనల్ అభ్యర్థులు రెగ్యులర్ పరీక్ష రుసుమునకు అదనంగా రూ.60 చెల్లించాలన్నారు. వయస్సు కాండినేషన్ ఫీజు రూ.300, మైగ్రేషన్ సర్టిఫికెట్ ఫీజు రూ.80 ఉంటుందన్నారు. పూర్తివివరాలకు www. bseap.ors వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

ఏఐటీయూసీ జాతీయ సమితి సభ్యురాలిగా స్రవంతి



విజయనగరం ఫూల్‌బాగ్: కేరళ రాష్ట్రం అలెప్పుజలో ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు జరిగిన ఏఐటీయూసీ 42వ జాతీయ మహాసభల్లో జాతీయ సమితి సభ్యురాలిగా ఏపీ రాష్ట్రం నుంచి కూన స్రవంతి ఎంపికయ్యారు. ఆమె స్వస్థలం విజయనగరంలోని ఫూల్‌బాగ్ కాలనీ. ఏపీ మధ్యాహ్న పథక వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలిగా సేవలందిస్తున్నారు. ఆమె పని తీరును మెచ్చుకొని ఏఐటీయూసీ నాయకత్వం జాతీయ సమితిలోకి తీసుకుంది.

రూ.244 కోట్లతో నాడు-నేడు పనులు

- ఎస్ఎస్ఏ పీఓ స్వామినాయుడు



ప్రభుత్వ జూనియర్ కళాశాల శ్లాబును పరిశీలిస్తున్న ఎస్ఎస్ఏ పీఓ స్వామినాయుడు

గజపతినగరం: జిల్లాలో రూ.244కోట్లతో నాడు-నేడు పనులు జరుగుతున్నాయని సర్వశిక్ష ప్రాజెక్టు ఆఫీసర్ వేమలి స్వామినాయుడు తెలిపారు. గజపతినగరం ప్రభుత్వ జూనియర్ కళాశాల పనులను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 739 పాఠశాలలు, కళాశాలల్లో పనులు సాగుతున్నాయన్నారు. నూతన విద్యావిధానంలో భాగంగా వెయ్యికి పైగా అదనపు తరగతి గదుల నిర్మాణం సాగుతోందని చెప్పారు.

జగనన్నపై జనాభిమానం

- వాడవాడలా ముఖ్యమంత్రి పుట్టినరోజు వేడుకలు
- జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల జేజేలు
- భారీ కేక్‌లను కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపిన నాయకులు
- పలుచోట్ల కార్యకర్తల సేవా కార్యక్రమాలు
- రక్తం కొరత తీర్చేందుకు రక్తదాన శిబిరాల నిర్వహణ
- ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు జేజేలు పలికారు. ఆయన పుట్టిన రోజు వేడుకలను విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో బుధవారం ఉత్సవంలా నిర్వహించారు. భారీ కేక్‌లను కట్ చేసి సంక్షేమ సారథికి నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేశారు. మొక్కలు నాటారు. మెగా వైద్య, రక్తదాన శిబిరాలు నిర్వహించారు. ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. పేదలకు దుస్తులు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి విద్యార్థులకు జగన్ మామయ్య కానుకగా బైజూస్ కంటెంట్ ట్యాబ్‌లను ప్రజాప్రతినిధులు, అధికారులు పంపిణీ చేశారు.



50 కేజీల భారీ కేకును కట్‌చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: అన్ని వర్గాల సమానాభివృద్ధి, సంక్షేమ పాలన ప్రదాత జగన్‌మోహన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా వందలాది యువత స్వచ్ఛందంగా రక్తదానం చేయడం అభినందనీయమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. విజయనగరం జిల్లా కేంద్రంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో 420 మంది రక్తదానం చేశారు. పార్టీ దివ్యాంగుల విభాగం ఏర్పాటు చేసిన 50 కేజీల భారీ కేక్‌ను నియోజకవర్గ పరిశీలకుడు నరేష్‌కుమార్ అగర్వాలాతో కలిసి కోలగట్ల కట్ చేశారు. 2,500 మంది నిరుపేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఘోషాసుపత్రిలో రూ.లక్ష విలువైన వైద్య పరికరాలను అందజేశారు. జిల్లా కేంద్రాసుత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

పేదల పక్షపాతి జగన్‌మోహన్‌రెడ్డి...

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లగా భావిస్తూ రాష్ట్రంలో తనదైన శైలిలో పరిపాలన చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అని ఎమ్మెల్సీ డాక్టర్ పీవీవీ సూర్యనారాయణరాజు (సురేష్‌బాబు) అన్నారు. నెల్లిమర్ల పట్టణంలోని కుసుమంచి వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు

జగన్ జన్మదినం నిజమైన పండగ...



సీఎం పుట్టిన రోజును అభిమానులతో కలిసి జరుపుకుంటున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

రాష్ట్రంలోని అన్ని వర్గాలకు సమానంగా, కులాలు పార్టీలకు అతీతంగా సంక్షేమపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు నిజమైన పండగ రోజని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య చెప్పారు. గజపతినగరంలోని పార్టీ కార్యాలయ ఆవరణలో మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. భారీ కేకును కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. సంక్షేమ సారథిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు.

అభివృద్ధి ప్రదాత



రాజాం: వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

కరోనా వంటి క్లిష్ట పరిస్థితులను అధిగమించి రాష్ట్రాన్ని ప్రగతి వైపు నడిపిస్తున్న సీఎం జగన్ నిజమైన అభివృద్ధి ప్రదాత అని రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అభివర్ణించారు. రాజాంలోని పార్టీ కార్యాలయంలో భారీ కేక్ కట్‌చేశారు. మల్లికార్జున కాలనీలోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు, పండ్లు ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌తో కలసి పంపిణీచేశారు. సంతకవిటి మండలకేంద్రంలో జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు.

దుష్ట శక్తులు అడ్డుకున్నా సంక్షేమ పాలన...



చీపురుపల్లిలో కేక్‌ను కట్ చేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రతిపక్ష పార్టీలు, ఓ వర్గం మీడియా దుష్టశక్తుల్లా అడ్డుకున్నా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల అభివృద్ధే ధ్యేయంగా సంక్షేమ పాలనను అందిస్తున్నారని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు స్పష్టం చేశారు. పోటీ ప్రపంచంలో సత్తా చాటేలా పేదల పిల్లలనూ తీర్చిదిద్దేందుకే బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను విద్యార్థులకు కానుక ఇస్తున్నారని వివరించారు. చీపురుపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో ఆయన ట్యాబ్‌లను పంపిణీ చేశారు. మండల పరిషత్తు కార్యాలయం వద్ద వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మెగా వైద్య, రక్తదాన శిబిరాలను ప్రారంభించారు. భారీ కేక్ కట్ చేశారు. ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. మెరకముడిదాం మండల కేంద్రంలో మొక్కలను నాటారు.

డిజిటల్ ఎడ్యుకేషన్‌కు జగన్ నాంది

దేశంలో మరెక్కడా లేనివిధంగా ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ ఎడ్యుకేషన్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర చెప్పారు. పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్‌తో కలిసి సాలూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యను ఆస్తిగా అందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డికి ఆశీస్సులు అందించాలంటూ విద్యార్థులంతా తమ తల్లిదండ్రులకు చెప్పాలని కోరారు. అంతకుముందు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా భారీ కేక్‌ను పార్టీ నియోజకవర్గ పరిశీలకులు మీసాల మీసాల నీలకంఠంనాయుడుతో కలిసి కట్ చేశారు.



ట్యాబ్‌లు అందుకున్న విద్యార్థులతో డిప్యూటీ సీఎం రాజన్నదొర

జనం మదిలో చోటు

మ్యానిఫెస్టోను 99 శాతం తూచా తప్పకుండా అమలుచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనం గుండెల్లో కొలువై ఉన్నారని బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. బొబ్బిలిలోని పార్టీ కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరం ప్రారంభించారు. వందమంది రక్తదానం చేశారు. భారీకేక్‌ను కట్ చేసి అభిమానులకు తినిపించారు. కార్యక్రమంలో వందలాది మంది కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



బొబ్బిలిలో ఎమ్మెల్యే శంబంగి ఆధ్వర్యంలో రక్తదానం చేస్తున్న యువత

యుగపురుషుడు..



పేదలకు వస్త్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

పేదరికాన్ని జయించేది విద్యేనని బాబాసాహెబ్ అంబేద్కర్ చెప్పిన మాటను నిజం చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యుగపురుషుడని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అభివర్ణించారు. శృంగవరపుకోట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి జగన్ ఆయురారోగ్యాల కోసం దేవీ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పేదలకు అన్నదానం చేశారు. కొత్తవలస మండల కేంద్రంలో వృద్ధులు, వికలాంగులు, మహిళలకు దుస్తులు, దుప్పట్లను కొప్పలవెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, నియోజకవర్గ పరిశీలకుడు తైనాల విజయ్ కుమార్‌తో కలిసి పంపిణీ చేశారు.

విద్యార్థులకు బంగారు భవిష్యత్

- ఉచిత ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల
- ఆంధ్రప్రదేశ్‌లోనే ఇలాంటి అవకాశాలు: కలెక్టర్ సూర్యకుమారి



ధర్మపురి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, కలెక్టర్‌సూర్యకుమారి, తదితరులు

విజయనగరం: విద్యార్థినీ, విద్యార్థుల బంగారు భవిష్యత్తే లక్ష్యంగా విద్యారంగంలో ఎన్నో విప్లవాత్మక సంస్కరణలకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, దానిలో భాగంగానే ఉచిత ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ఒకవైపు చదువు, మరోవైపు విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తూ, పాఠశాలల్లో సకల సౌకర్యాలు కల్పిస్తోందని ఉద్ఘాటించారు. ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ధర్మపురి జిల్లా పరిషత్ వేదికగా కలెక్టర్ ఎ.సూర్యకుమారితో కలిసి బుధవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ముందుగా పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్న చిన్నారులు సౌజన్య, హరినాథ్, ఆంగ్లంలో మాట్లాడి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు, పథకాలను వివరించారు. వీరిని డిప్యూటీ స్పీకర్, కలెక్టర్ అభినందించి ఆశీర్వదించారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకొని ప్రతి ఒక్కరూ బాగా చదువుకొని జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అమ్మ ఒడి, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, విద్యాకానుక, నాడు-నేడు తదితర పథకాలు, కార్యక్రమాలు విద్యారంగంలో ఉత్తమ ఫలితాల సాధనకు దోహదపడుతున్నాయన్నారు. విజయనగరం నియోజకవర్గానికి సంబంధించి 260 మంది విద్యార్థులకు డిప్యూటీ స్పీకర్, కలెక్టర్, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు చేతుల మీదుగా ట్యాబ్‌లు అందజేశారు.

ఏపీలోనే ఇలాంటి వసతులు, సౌకర్యాలు

కలెక్టర్ ఎ.సూర్యకుమారి మాట్లాడుతూ విద్యావ్యవస్థలో ఆంధ్రప్రదేశ్‌లోనే ఇలాంటి అద్భుత అవకాశాలు, వసతులు అందుబాటులో ఉన్నాయని, వీటిని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. జిల్లా వ్యాప్తంగా 457 పాఠశాలల్లో చదువుతున్న 8వ తరగతి విద్యార్థులకు ముందుగా ట్యాబ్‌లు అందజేస్తున్నామన్నారు. 18 వేల మంది విద్యార్థులు, 2,457 మంది ఉపాధ్యాయులకు లబ్ధి చేకూరనుందని వివరించారు. బైజూస్ కంటెంట్ తో కలిపి ఒక్కో ట్యాబ్‌కు రాష్ట్ర ప్రభుత్వం రూ.32 వేలు ఖర్చుచేసినట్టు వెల్లడించారు. జిల్లాకు రూ.58 కోట్లు కేటాయించిందన్నారు. కార్యక్రమంలో డీఈఓ లింగేశ్వరరెడ్డి, సర్వశిక్ష ఏపీసీ స్వామినాయుడు, మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతి, అధికారులు పాల్గొన్నారు.

పేదల అభివృద్ధిని దుష్ట శక్తులు అడ్డుకుంటున్నాయ్

- పెత్తందారి వ్యవస్థకు బాస్ చంద్రబాబు
- దమ్ముంటే ఇంగ్లిష్ మీడియం వద్దని చెప్పాలి
- జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

చీపురుపల్లి: రాష్ట్రంలో పేదల అభివృద్ధిని ప్రతిపక్ష పార్టీలతో బాటు కొన్ని పత్రిక, మీడియా చానళ్లు దుష్టశక్తుల్లా మారి అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నాయని, ఎంతమంది ఒక్కటైనా పేదల అభివృద్ధి కోసం కంకణం కట్టుకున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాన్ని అడ్డుకోలేరని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు స్పష్టం చేశారు. చీపురుపల్లి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం నియోజకవర్గ స్థాయిలో 1040 మంది ఎనిమిదవ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా విద్యార్థులతో కలిసి హ్యాపీ బర్త్‌డే సీఎం మామయ్య అంటూ కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న పేద పిల్లలు ఇంగ్లిష్ నేర్చుకుని కార్పొరేట్‌కు దీటుగా తయారవ్వాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచన చేస్తుంటే ప్రతిపక్ష పార్టీలు కోర్టుకెళ్లి అడ్డుకుంటున్నాయన్నారు. చంద్రబాబునాయుడు పిల్లలు, మనమలు విదేశాల్లో చదువుకోవాలి?.. పేద పిల్లలు మాత్రం నిరంతరం కూలీలుగానే మిగిలిపోవాలా అంటూ ప్రశ్నించారు. పెత్తందారీ వ్యవస్థకు బాస్‌గా ఉన్న చంద్రబాబునాయుడు పేదల అభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్నారన్నారు. మూడు రోజులు జిల్లా పర్యటనకు వస్తున్న చంద్రబాబునాయుడుకు దమ్ము, ధైర్యం ఉంటే ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం వద్దని బహిరంగ సభల్లో ప్రకటించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులను టాపర్‌లుగా తీర్చిదిద్దగలిగే సామర్థ్యం ఉన్న ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నారనే నమ్మకం తమకు ఉందన్నారు. చదువుతోనే సమాజం అభివృద్ధి చెందుతుందనే బాబాసాహెబ్ అంబేద్కర్ మాటలను నిజం చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని పేర్కొన్నారు. ఇంగ్లిష్ నేర్చుకోవాలంటే కార్పొరేట్ పాఠశాలలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉన్నత ప్రమాణాలు అందించేందుకు బైజూస్ కంటెంట్‌తో ఎంతో విలువైన ట్యాబ్‌లను విద్యార్థులకు ఉచితంగా అందజేస్తున్నట్లు చెప్పారు. ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలాస నియోజకవర్గ పరిశీలకులు కేవీ సూర్య నారాయణరాజు, జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, గుర్ల ఎంపీపీ ప్రమీల, జెడ్పీటీసీ అప్పలనాయుడు, సర్పంచ్ సుధారాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇ.అనంతం, వి.శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, ఎం. విశ్వేశ్వరరావు, డి.జనార్దనరావు, కె.శ్రీనివాసరావు, తోట తిరుపతిరావు, ఇ.గోవింద, ఇ.తిరుమల, డీఈఓ లింగేశ్వరరెడ్డి, డిప్యూటీ డీఈఓ కె.వాసుదేవరావు, చీపురుపల్లి, గరివిడి ఎంఈఓలు భానుప్రకాష్, రామారావు, హెచ్‌ఎం శ్యామలసాయి పాల్గొన్నారు.

బాడీబిల్డింగ్ ఓవరాల్ చాంపియన్ శ్రీకాంత్



వివిధ కేటగిరీలలో ప్రథమ స్థానంలో నిలిచిన బాడీ బిల్డర్లు

రాజాం సిటీ: రాజాం జీఎంఆర్ ఐటీలో మంగళవారం అర్ధరాత్రి 1.30 గంటల వరకు జరిగిన అంతర్ జిల్లాల బాడీబిల్డింగ్ పోటీల ఓవరల్ చాంపియన్‌గా పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన కె.శ్రీకాంత్ నిలిచాడు. పోటీల్లో 13 జిల్లాల నుంచి 150 మంది క్రీడాకారులు పాల్గొని పోటాపోటాగా శరీరసౌష్టవాన్ని ప్రదర్శించారు. 55, 60, 65, 70, 75, 80, 85 కేజీల విభాగంలో హోరాహోరీగా సాగిన పోటీలలో విజేతలను నిర్వాహకులు బుధవారం ప్రకటించారు. ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన వారికి నగదు బహుమతితోపాటు షీల్డ్‌లను బాడీ బిల్డింగ్ అసోసియేషన్ చైర్మన్ ఏవీ రమణమూర్తి, కార్యదర్శి బి.మహేష్, జీఎంఆర్ ఐటీ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ జె.గిరీష్, ప్రిన్సిపాల్ ప్రసాద్ అందజేశారు.

విజేతలు వీరే..

బాడీ బిల్డింగ్ పోటీల్లో ఓవరల్ చాంపియన్‌గా ప్రథమ స్థానంలో పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన కె.శ్రీకాంత్ నిలవగా, కాకినాడకు చెందిన ఎస్.రమేష్ ద్వితీయ స్థానాల్లో నిలిచారు. 55 కేజీల విభాగంలో సీహెచ్ వినయ్ (కాకినాడ), బి.పవన్‌కుమార్ (విజయనగరం), ఎస్.కె.రాజ్‌మహ్మద్ (పార్వతీపురం మన్యం), 60 కేజీల విభాగంలో ఎం.నూకరాజు (విశాఖపట్నం), ఉమేష్ సుబార్ (విజయనగరం), షేక్ అబ్దుల్ ఖాన్ (శ్రీకాకుళం), 65 కేజీల విభాగంలో కె.గౌరీ శంకర్ (శ్రీకాకుళం), వి.జీవన్‌కిషోర్ (విశాఖపట్నం), కె.గోవిందరాజు (శ్రీకాకుళం), 70 కేజీల విభాగంలో ఎస్.కిషోర్ (పార్వతీపురం మన్యం), ఇ.సంతోష్, కె.యశ్వంత్ (విశాఖపట్నం)లు వరుస మూడు స్థానాల్లో నిలిచారు. 75 కేజీల విభాగంలో ఎస్.రమేష్ (కాకినాడ), ఎస్.నిఖిల్‌కుమార్, జె.రవితేజ (విజయనగరం)లు, 80 కేజీల విభాగంలో కె.శ్రీకాంత్ (పార్వతీపురం మన్యం), కె.భార్గవరామ్, కె.బాలాజీ (విజయనగరం), 85 కేజీల విభాగంలో వి.భార్గవ్ (విశాఖపట్నం), ఎస్.రామాచారి (శ్రీకాకుళం), ఎస్.శ్రీనివాస్ (విజయనగరం)లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు.

రైతన్నకు మద్దతు ధర



జేసీ మయూర్ అశోక్

విజయనగరం అర్బన్: ప్రతీ రైతు ధాన్యంను రైతు భరోసా కేంద్రంలో విక్రయించి మద్దతు ధర పొందాలని జేసీ మయూర్ అశోక్ పిలుపునిచ్చారు. ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాలకు ఎప్పటికప్పుడే నగదు జమచేస్తున్నట్టు వివరించారు. 7,955 మెట్రిక్ టన్నుల ధాన్యం రవాణా చేసినందుకు రైతుల ఖాతాల్లో రూ.55,84,663లను జమచేశామన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 39,141 టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, 9,564 రైతుల ఖాతాలకు రూ.7.05 కోట్లు జమచేసినట్టు వెల్లడించారు. మరో రూ.55.39 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు.

క్లుప్తంగా

సత్తా చాటిన మన్యంజిల్లా విద్యార్థులు



మూడవస్థానాన్ని దక్కించుకున్న పాలకొండ వాలీబాల్ జట్టు

పార్వతీపురం టౌన్: సీఎం జగన్‌మోహన్ రెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా విజయవాడలో బుధవారం నిర్వహించిన జగనన్న క్రీడా సంబరాల్లో పార్వతీపురం మన్యం జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. ఈ మేరకు జిల్లా క్రీడల చీఫ్ కోచ్ వెంకటేశ్వరరావు విలేకరులతో మాట్లాడుతూ పాలకొండ నియోజకవర్గం వాలీబాల్ జట్టు రాష్ట్రంలో మూడవ స్థానాన్ని దక్కించుకుని రూ.లక్ష క్యాష్ ప్రైజ్‌ను సొంతం చేసుకున్నట్లు చెప్పారు. రాష్ట్ర స్థాయిలో మూడవ స్థానాన్ని దక్కించుకోవడంతో పాలకొండ వాలీబాల్ జట్టు క్రీడాకారులకు కలెక్టర్ నిషాంత్ కుమార్ ఫోన్ చేసి అభినందించారని తెలిపారు.

టాటా మ్యాజిక్ వాహనం దగ్ధం



దగ్ధమైన టాటా మ్యాజిక్

చీపురుపల్లి: చీపురుపల్లి-గరివిడి ప్రధాన రహదారిలో జగన్నాథ రాజు కాలనీ సమీపంలో టాటా మ్యాజిక్ వాహనం బుధవారం దగ్ధమైంది. రహదారి పక్కన నిలిచి ఉన్న టాటా మ్యాజిక్ వాహనం నుంచి పొగలు, మంటలు వ్యాపించడంతో సమాచారం మేరకు అగ్ని మాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలు అదుపు చేశారు.

లైంగిక దాడికేసులో ముద్దాయికి మూడునెలల జైలు శిక్ష

విజయనగరం లీగల్: మహిళపై లైంగిక దాడి కేసులో గంట్యాడ మండలం నరవ గ్రామానికి చెందిన ముద్దాయి నరవ సన్యాసిరావుకు మూడు నెలల జైలుశిక్షతో పాటు రూ.పదివేల జరిమానా విధిస్తూ మొబైల్ మెజిస్ట్రేట్ మొహ్రాత్ బేగం బుధవారం తీర్పు చెప్పారు. ఏపీపీ శాంతి గౌతమి అందించిన కేసు వివరాలిలా ఉన్నాయి. నరవ గ్రామానికి చెందిన ఓ మహిళ భర్తతో గొడవలు పడుతోంది. నాకు తెలిసిన పోలీసులు ఉన్నారు. మీ భార్యాభర్తల సమస్య పరిష్కరిస్తానని బాధిత మహిళ వద్ద సన్యాసిరావు రూ.ఎనిమిది వేలు తీసుకున్నాడు. ఇలా వారి మధ్య చనువు పెరిగింది. దీన్ని ఆసరాగా తీసుకుని 2018. మార్చి 18న బాధిత మహిళపై సన్యాసి రావు లైంగిక దాడికి పాల్పడ్డాడు. సమీపంలో ఉన్నవారు 100 కి డయల్ చేసి ఫిర్యాదు చేయగా వెంటనే పోలీసులు సన్యాసిరావును అరెస్ట్ చేసి రిమాండ్‌కి తరలించారు. ప్రాసిక్యూషన్ సరైన సాక్ష్యాధారాలతో కేసు రుజువు చేయడంతో మేజిస్ట్రేట్ పై విధంగా తీర్పు చెప్పారు.

జిల్లాస్థాయి షూటింగ్‌బాల్ ఎంపికలు రేపు

బొండపల్లి: గొట్లాంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జిల్లాస్థాయి షూటింగ్‌బాల్ పోటీలకు ఈనెల 23వ ఎంపికలు నిర్వహించనున్నట్లు హెచ్‌ఎం శ్రీరామాచారి, పీడీ యు.ఎస్.సత్యానంద్ తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి ఎంపికలు నిర్వహించనున్నట్లు చెప్పారు. పోటీలకు హజరయ్యే విద్యార్థులు తప్పనిసరిగా స్టడీ సర్టిఫికెట్‌తో పాటు, ఆధార్ కార్డును తీసుకు రావాలని తెలిపారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి

● సమగ్ర శిక్ష జీసీడీఓ రోజారమణి

గుమ్మలక్ష్మీపురం: పబ్లిక్ పరీక్షల్లో టెన్త్, ఇంటర్మీడియట్ విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఇప్పటినుంచే సన్నద్ధం కావాలని పార్వతీపురం మన్యం జిల్లా సమగ్ర శిక్ష జీసీడీఓ. కె.రోజా రమణి అన్నారు. ఈ మేరకు బుధవారం ఆమె గుమ్మలక్ష్మీపురం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం బ్రేక్‌ఫాస్ట్ సమయానికే పాఠశాలను సందర్శించిన ఆమె విద్యార్థులకు వండిపెట్టిన ఆహార పదార్థాలను రుచి చూశారు. అనంతరం తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడి విద్యాప్రమాణాలపై ఆరాతీశారు. ఆమె వెంట ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీరంజని, ఉపాధ్యాయులు ఉన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 547.00
శ్రీకాకుళం	రూ. 551.00

బులియన్

విశాఖపట్నం

బంగారం(24సి. 10గ్రా.)	54,490-00
బంగారం(22సి. 10గ్రా.)	49,950-00
వెండి (కిలో)	73,000-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹130	₹230	₹ 240

రోగులకు నాణ్యమైన భోజనం

- డైట్ చార్జీలు పెంచిన ప్రభుత్వం
- సాధారణ రోగులకు రూ.40 నుంచి రూ.80
- వైద్యులకు రూ.80 నుంచి రూ.100
- మానసిక రోగులకు రూ. 56నుంచి రూ.80 పెరుగుదల
- 11 ఆస్పత్రుల్లో డైట్ అమలు



ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో రోగులకు పెడుతున్న భోజనం

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందే రోగులకు నాణ్యమైన పెట్టేందుకు జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇంతవరకు డైట్ చార్జీలు అతి తక్కువగా ఉండడంతో డైట్ కాంట్రాక్టర్ ఏది పెడితే అది తినాల్సిన పరిస్థితి రోగులది. 15, 20 ఏళ్లుగా ఇదే పరిస్థితి. గతంలో ఏ ప్రభుత్వం కూడా డైట్ చార్జీలు పెంచిన దాఖలాలు లేవు. అయితే ప్రస్తుత ప్రభుత్వం ఆస్పత్రికి వచ్చే పేద రోగులకు రుచికరమైన భోజనాన్ని అందించాలని భావించి డైట్ చార్జీలు పెంచింది. రోగులతో పాటు డాక్టర్, మానసిక రోగుల డైట్ చార్జీలను కూడా పెంచింది.

11 ఆస్పత్రుల్లో డైట్ చార్జీల అమలు

జిల్లాలో వైద్య విధాన్ పరిషత్, వైద్యవిద్య పరిధిలో ఉన్న 11 ఆస్పత్రుల్లో డైట్ (భోజనం) అమలవుతోంది. వైద్య విధాన్ పరిషత్ పరిధిలో పార్వతీపురం జిల్లా ఆస్పత్రి, సాలురు, గజపతనగరం ఏరియా ఆస్పత్రులు, ఎస్.కోట, భద్రగిరి, బొబ్బిలి, బాడంగి, చీపురుపల్లి భోగాపురం సీహెచ్‌సీలు, వైద్య విద్య పరిధిలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, ఘోషాఆస్పత్రుల్లో డైట్ అమలవుతోంది.

సాధారణ రోగులకు రెట్టింపైన డైట్ చార్జీలు

ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందే రోగులకు మూడు పూటలా భోజనం పెడతారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, అదేవిధంగా రాత్రి కూడా భోజనం పెడతారు. ఇప్పటి వరకు సాధారణ రోగులకు మూడు పూటలా భోజనం పెట్టినందుకు డైట్ చార్జీలు రూ.40 చెల్లిస్తున్నారు. ప్రభుత్వం ప్రస్తుతం ఈచార్జీలను రూ. 80కి పెంచింది. అదే విధంగా నైట్ డ్యూటీ చేసే వైద్యులకు భోజనం నిమిత్తం చెల్లించే డైట్ చార్జీలు రూ.80 నుంచి రూ.100కు పెంచింది. అలాగే మానసిక రోగులకు రూ.56 నుంచి రూ.80కి పెంచింది.

పెంచిన చార్జీలతో మంచి భోజనం

గతంలో ఆస్పత్రుల్లో పెట్టే భోజనం తినడానికి చాలామంది అసక్తి చూపేవారు కాదు. డైట్ చార్జీలు తక్కువ అని చెప్పి డైట్ కాంట్రాక్టర్లు కూడా అంతగా నాణ్యతలేని భోజనం పెట్టేవారు. ప్రభుత్వం డైట్ చార్జీలు పెంచడం వల్ల రోగులకు ఇకనుంచి రోగులకు రుచికరమైన మంచి భోజనం దొరకనుంది.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



షన్ముఖరావు మృతదేహం

నెల్లిమర్ల: పట్టణ పరిధిలోని మిమ్స్ సమీపంలో రైలు పట్టాలపై బుధవారం ఉదయం గుర్తు తెలియని మృతదేహాన్ని రైల్వే పోలీసులు కనుగొన్నారు. పలాస-విశాఖపట్నం ప్యాసింజర్ రైలు ఢీకొట్టడంతో సుమారు 40 సంవత్సరాల వయసున్న వ్యక్తి మృతి చెందినట్లు శ్రీకాకుళం జీఆర్పీ ఎస్సై చెల్లూరి శ్రీనివాసరావు తెలిపారు. మృతుడి కుడి చేతిపై రోజా అని తెలుగులో పచ్చబొట్టు ఉన్నట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిసినవారు ఫోన్ 7013273731నంబర్‌కు తెలియజేయాలని సూచించారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీ కొని వ్యక్తి..

గుమ్మలక్ష్మీపురం: ద్విచక్రవాహనంపై వెళ్తూ ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో జరిగిన ప్రమాదంలో భామిని మండలం బత్తిలి గ్రామానికి చెందిన ఎస్.షన్ముఖరావు (40) మృతి చెందాడు. ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఎల్విన్‌పేట జంక్షన్ వద్ద కొన్ని రోజుల నుంచి ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వహిస్తున్న షన్ముఖరావు మంగళవారం సాయంత్రం తనతో పాటు షాపులో ఉన్న భార్య విజయను ముందుగానే ఇంటికి పంపించేసి కాస్త ఆలస్యంగా స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. ఈ క్రమంలో కొసగూడ మలుపు వద్ద గల విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టి కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. బుధవారం ఉదయం అటుగా వెళ్తున్న ప్రయాణికులు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి ఎల్విన్‌పేట పోలీసులు వెళ్లి పరిశీలించి కుటుంబసభ్యులకు సమాచారం అందజేశారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టాటామ్యాజిక్ ఢీకొని మరొకరు..

బొండపల్లి: మండలంలోని అంబటివలస గ్రామం సమీపంలో జాతీయ రహదారి(26)పై టాటా మ్యాజిక్ వాహనం ఢీకొనగా జరిగిన ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. బుధవారం సాయంత్రం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి ఎస్సై ఎస్.రవి తెలిపిన వివరాలిలాలా ఉన్నాయి. మండలంలోని ముద్దూరు గ్రామానికి చెందిన మునకాల శివ(35) ద్విచక్ర వాహనంపై విజయనగరం నుంచి స్వగ్రామం వస్తుండగా గజపతినగరం వైపు నుంచి విజయనగరం వెళ్తున్న టాటా మ్యాజిక్ వాహనం బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అక్కడిక్కడే శివ మృతి చెందగా ఆ వెనుకనే ద్విచక్ర వాహనంపై వస్తున్న వస్తున్న అదే గ్రామానికి చెందిన తండ్రీకొడుకులు బాలి గోవింద, త్రివిక్రమరావులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని విజయనగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి, శివ మృతదేహాన్ని పంచనామా నిమిత్తం గజపతినగరంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు. మృతుడికి భార్య నారాయణమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఘనంగా క్రిస్మస్ హైటీ



కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ సూర్యకుమారి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

- హాజరైన కలెక్టర్ సూర్యకుమారి, జెడ్పీ చైర్మన్

విజయనగరం ఫూల్‌బాగ్: క్రీస్తు బోధనల సారాన్ని అర్థం చేసుకుని, ప్రతి ఒక్కరూ సంఘానికి ఉపయోగపడాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి కోరారు. జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక కంటోన్మెంట్ సీఎస్ఐ చర్చిలో క్రిస్మస్ హైటీ బుధవారం సాయంత్రం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కేక్ కట్ చేసి సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ పరోపకారమే క్రీస్తు బోధనల సారమని పేర్కొన్నారు. సమాజానికి ఉపయోగ పడినప్పుడే, బోధనలకు సార్థకత లభిస్తుందన్నారు. క్రైస్తవుల సంక్షేమం కోసం ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందని చెప్పారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, డీఆర్వో ఎం.గణపతిరావు, జిల్లా పర్యాటక శాఖాధికారి పీఎస్‌పీ లక్ష్మీనారాయణ, మైనారిటీ సంక్షేమ శాఖాదికారి టి.చంద్ర శేఖర రావు, క్రైస్తవ పెద్దలు ఆర్.ఎస్.జాన్, జాన్ మోజెస్, బిషప్ ఫీలోమెన్, ప్రీస్లి, అషా జాన్, ఆనంద్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత బియ్యం పంపిణీ ప్రారంభం

విజయనగరం అర్బన్: జాతీయ ఆహార భద్రత చట్టం (ఎన్‌ఎఫ్‌ఎస్‌ఏ) పరిధిలోని లబ్ధిదారులకు ఉచిత బియ్యం పంపిణీని జిల్లా పౌరసరఫరాల శాఖ బుధవారం ప్రారంభించింది. ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ యోజన (పీఎంజీకేఏవై) పథకం కింద మంజూరైన బియ్యాన్ని జిల్లాలోని చౌకదుకాణాల ద్వారా ఒక్కో లబ్ధిదారుకు నెలరోజులకు సరిపడా 5 కిలోల వంతున బియ్యం పంపిణీ చేస్తారు. డీలర్ దగ్గర నేరుగా జనరేట్ అయిన అర్హుల జాబితా మేరకు పంపిణీ చేస్తారు. వరుసగా మూడునెలలు ఇప్పటివరకు పంపిణీ జరిగింది. నాలుగోనెల పంపిణీ కూడా వీఆర్‌ఓలు వారి పరిధిలోని వలంటీర్ల ద్వారా అందజేస్తారు. లబ్ధిదారులు నేరుగా చౌక దుకాల వద్ద వెళ్లి సరుకులు తీసుకోవాలి. ఈ నెలాఖరులోగా శతశాతం పూర్తి చేయడానికి జిల్లా యంత్రాంగం సిద్ధం చేసింది.

5,51,066 మంది లబ్ధిదారులకు ప్రయోజనం

జిల్లా పరిధిలో పీఎంజీకేఏవై పథకం కింద ఎన్ఎఫ్ఎస్ఏ పరిధిలోని రేషన్ కార్డు లబ్ధిదారులు 5,51,066 మందికి ప్రయోజనం కలుగుతుంది. జిల్లాలోని 5,71,884 సాధారణ రేషన్ కార్డులలోని 97 శాతం లబ్ధిదారులను ఎన్ఎఫ్ఎస్ఏ పరిధి రేషన్ కార్డుదారులనుగా రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ఎంపిక చేసింది.

పల్లెల్లో అచ్చెరువు..!

- అమృత్ సరోవర్ పథకంలో అందంగా చెరువుల నిర్మాణం
- నీటి వనరులు పెంపొందించేలా ప్రణాళికలు
- తాగు, సాగునీటికి కొరత లేకుండా ఏర్పాట్లు



సీతానగరం మండలం జానుమల్లువలసలో సుందరంగా తీర్చిదిద్దిన చెరువు

సీతానగరం/సాలూరు: భావితరాల కోసం నీటి వనరులను రక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని గుర్తించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పక్కాప్రణాళికతో ముందుకు సాగుతోంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ×అమృత్ సరోవర్‌ పథకం ద్వారా సమాజానికి అన్నివిధాలా మేలు చేకూర్చే పనులకు ప్రాధాన్యం ఇస్తోంది. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఉన్నతాధికారులు పార్వతీపురం మన్యం జిల్లాలో అవసరమైన చోట్ల చెరువుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించడంతో ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కలిగేలా చెరువుల పనులు జరిగాయి. జిల్లాలోఉన్న 589 చెరువులను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఉపాధిహామీ పథకం ద్వారా చెరువులను అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ముందుగా ఒక్కో మండలంలో గుర్తించిన నాలుగైదు చెరువులకు అమృత్ సరోవర్ పథకం అమలు చేసి చెరువులను సుందరవనాల్లా తయారు చేశారు.

ఇదీ లక్ష్యం

తాగునీటి అవసరాలను తీర్చడంతో పాటు, జలవనరుల సంరక్షణ లక్ష్యంగా అమృత్ సరోవర్ పథకం అమలు చేస్తున్నారు. కనీసం ఒక ఎకరం స్థలంలో పదివేల క్యూబిక్ మీటర్ల నీటి సామర్థ్యం నిల్వ ఉండేలా చెరువులను అభివృద్ధి చేస్తున్నారు. అభివృద్ధి పనులు చేపట్టిన చెరువులు నీటితో నిండుగా కనిపిస్తుండడంతో, వాటిని మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ మేరకు చెరువు గట్ల చుట్టూ ఉన్న ముళ్ల కంపలు, పిచ్చి మొక్కలు, మొద్దులు తొలగించి గట్లను పటిష్టం చేయడంతో పాటు, దాన్ని గ్రామస్తుల వాకింగ్ ట్రాక్ కోసం అభివృద్ధి చేపట్టాలని నిర్ణయించారు. అందుబాటులో ఉన్న పంచాయతీ నిధులు వినియోగించి, కూర్చునేందుకు వీలుగా బల్లలు, అందమైన చెట్లు నాటేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం ముందుకొచ్చే దాతల సహకారం కూడా తీసుకునేలా పంచాయతీపాలకులకు ప్రభుత్వం స్వేచ్ఛ ఇచ్చింది.

జిల్లాలో చురుగ్గా పనులు

జిల్లాలో ఉన్న 589 చెరువుల అభివృద్ధికి రూ.52 కోట్ల 28 లక్షలు ఖర్చవుతుందని తేల్చారు. ఇప్పటివరకూ రూ.20 కోట్ల 41లక్షల విలువైన పనులు చేపట్టారు. వచ్చే ఏడాది వేసవి నాటికి నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ, అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తున్నారు.

ప్రజోపయోగంగా...

చెరువుల అభివృద్ధి వల్ల ప్రజలకు ఎంతో ఉపయోగం కలిగే విధంగా అభివృద్ధి చేయడంతో చెరువుల్లో పుష్కలంగా నీరు కనిపిస్తోంది. పంచాయతీల ఆధ్వర్యంలో చెరువుల సుందరీకరణ పనులు చేసేలా పాలక వర్గాలకు అవగాహన కల్పిస్తున్నారు.



బలిజిపేట మండలం శివరాంపురంలో ఆహ్లాదకరంగా తయారుచేసిన చెరువు

పనులపై ప్రత్యేక శ్రద్ధ

ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా అమృత్ సరోవర్ పథకం పనులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. గతంలో చెరువులు పిచ్చిమొక్కలతో నీరులేక ఉండేవి. ప్రభుత్వం అమృతసరోవర్ పథకం అమలు చేయడం వల్ల ప్రజల భాగస్వామ్యంతో పనులు చేపట్టడంతో సత్ఫలితాలు వస్తున్నాయి.ఇదే స్ఫూర్తితో జిల్లాకు కేటాయించిన లక్ష్యాన్ని పూర్తి చేస్తాం. ప్రజల అవసరాలు తీర్చేలా చెరువుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నాం.

కె.రామచంద్రరావు, పీడీ ఎన్ఆర్ఈజీఎస్, పార్వతీపురం మన్యం జిల్లా

23న అండర్-19 స్కూల్ గేమ్స్ జట్ల ఎంపిక

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న అండర్-19 స్కూల్ గేమ్స్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక ఈనెల 23న నిర్వహించనున్నట్లు అండర్-19 స్కూల్ గేమ్స్ అసోసియేషన్ కార్యదర్శి పీవీఎల్ కృష్ణ బుధవారం ఒక ప్రకటన తెలిపారు. ఆ రోజు రాజీవ్ క్రీడా మైదానం ప్రాంగణంలో తైక్వాండో క్రీడాకారులతో పాటు గొట్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో షూటింగ్‌బాల్ క్రీడాకారుల ఎంపికలు నిర్వహిస్తామన్నారు, ఎంపిక పోటీల్లో ప్రస్తుతం ఇంటర్మీడియట్ విద్యనభ్యసిస్తూ 2004 జనవరి 1వ తేదీ అనంతరం జన్మించిన మాత్రమే అర్హులుగా పేర్కొన్నారు. ఆ రోజు జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు త్వరలో రాష్ట్రస్థాయిలో జరిగే అంతర్ జిల్లాల పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మాతృ మరణాలు తగ్గించడమే లక్ష్యం

- ప్రసవతేదీకి వారం ముందు ఆస్పత్రుల్లో హైరిస్క్ గర్భిణుల చేరిక
- ప్రసవమయ్యే వరకు పర్యవేక్షణ



ఘోషా ఆస్పత్రికి తనిఖీకి వచ్చిన గర్భిణులు

విజయనగరం ఫోర్ట్: మాతృమరణాలు తగ్గించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. గర్భిణులు సుఖప్రసవమయ్యే విధంగా చర్యలు తీసుకుంటోంది. ముఖ్యంగా హైరిస్క్ గర్భిణుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. హై రిస్క్ ఉన్న గర్భిణులు ప్రసవ సమయంలో ఒక్కోసారి మృత్యువాత పడుతున్నారు. ఈనేపథ్యంలో హైరిస్క్ గర్భిణులు సుఖప్రసవమయ్యే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో వైద్యసిబ్బంది వారిని నిత్యం పర్యవేక్షించనున్నారు. బీపీ, సుగర్, రక్తహీనత, థైరాయిడ్, ఫిట్స్, హెచ్ఐవీ, క్షయ, మొదటి కాన్పులో సిజేరియన్ అయిన వారిని హైరిస్క్ గర్భిణులుగా పరిగణిస్తారు.

వారం రోజుల ముందే ఆస్పత్రుల్లో చేరిక

ప్రతి హైరిస్క్ గర్భిణిని ప్రసవ తేదీకి వారం రోజులు ముందు ఆస్పత్రిలో చేర్పిస్తారు. ప్రసవమయ్యే వరకు వైద్య సిబ్బంది పర్యవేక్షిస్తూ అవసరమైన చికిత్స అందిస్తారు. నెగిటివ్ గ్రూపు రక్తం గల వారికి నెల రోజుల ముందు నుంచి ఆగ్రూపు రక్తాన్ని రిజర్వ్ చేసి ఉంచుతారు. జిల్లాలో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి నవంబర్ నెలాఖరు నాటికి రిజిస్టర్ అయిన గర్భిణులు 19,855 మంది. వారిలో 3,990 మంది హైరిస్క్ గర్భిణులు ఉన్నారు. జిల్లాలో 48 పీహెచ్‌సీలు ఉన్నాయి. గజపజతినగరం, ఎస్.కోటలలో ఏరియా ఆస్పత్రులు ఉన్నాయి. అదేవిధంగా భోగాపురం, చీపురుపల్లి, బాడంగి, బొబ్బిలి, నెల్లిమర్ల సీహెచ్‌సీలు, జిల్లా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఉన్నాయి. హైరిస్క్ గర్భిణులను సమీపంలో ఉన్న సీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రి, జిల్లా ఆస్పత్రుల్లో చేర్పిస్తారు.

హైరిస్క్ గర్భిణుల పట్ల ప్రత్యేక శ్రద్ధ

హైరిస్క్ గర్భిణుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం. వారిని సమీపంలో ఉన్న సీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రిలోగాని, జిల్లా ఆస్పత్రుల్లో ముందుగా చేర్పించే ఏర్పాట్లు చేస్తున్నాం. ఆస్పత్రిలో వారికి ప్రత్యేకంగా బెడ్‌లు కేటాయించి నిరంతరం పర్యవేక్షించి సుఖ ప్రసవమయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం.

డాక్టర్ ఎస్వీ రమణకుమారి, డీఎంహెచ్‌ఓ

మృతదేహంతో పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన

గజపతినగరం: తన భర్త మృతికి ఎక్సైజ్ పోలీసులే కారణమంటూ గజపతినగరం మండలం ఎం.కొత్తవలస గ్రామానికి చెందిన కంకనాల శ్రీను భార్య అప్పలరాజు ఆరోపించారు. భర్త మృతదేహాన్ని పోలీస్‌స్టేషన్ వద్ద ఉంచి బంధువులతో కలిసి బుధవారం రాత్రి ఆందోళన చేశారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... మృతుడు కంకనాల శ్రీను మద్యం బాటిల్స్ అమ్మకాలు సాగిస్తున్నట్టు ఎక్సైజ్ పోలీసులకు సమాచారం అందింది. గజపతినగరం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ముగ్గురు పోలీసులు ఎం.కొత్తవలస వెళ్లి విచారణ జరిపారు. నాలుగు మద్యం సీసాలు దొరకడంతో స్టేషన్‌కు రావాలని చెప్పారు. దీనికి శ్రీను నిరాకరించడంతో పోలీసులు గట్టిగా కొట్టి విడిచిపెట్టారని ఆరోపించారు. పోలీసులు వెళ్లిన కొద్ది సమయానికే శ్రీనుకు పెరాలసిస్ స్ట్రోక్ వచ్చిందని, ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించినా ఫలితం లేకపోయిందని పేర్కొన్నారు. మృతునికి ఇద్దరు భార్యలు, ముగ్గురు పిల్లలు ఉన్నారు. సీఐ ఎల్.అప్పలనాయుడు స్టేషన్‌కు చేరుకుని ఆరా తీశారు. కేసు నమోదుచేసి విచారణ జరుపుతున్నారు. మృతుడు భయస్తుడని, పోలీసులకు పట్టుబడడంతో స్ట్రోక్ వచ్చి ఉండవచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



గజపతినగరం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ వద్ద మృతదేహాన్ని ఉంచి విలపిస్తున్న మృతుని భార్య, బంధువులు

క్లుప్తంగా

రామతీర్థం ఆలయంలో ఆడిట్



రికార్డులు తనిఖీ చేస్తున్న ఆడిట్ అధికారులు

నెల్లిమర్ల రూరల్: రామతీర్థం సీతారామస్వామి దేవస్థాన కార్యనిర్వాహక కార్యాలయంలో అధికారులు బుధవారం ఆడిట్ నిర్వహించారు. జిల్లా అసిస్టెంట్ ఆడిట్ అధికారి ఎంఎస్ఎల్ఎన్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది రికార్డులను తనిఖీ చేశారు. దేవస్థాన ఆదాయ, వ్యయ ఖర్చులపై ఆరా తీశారు. కార్యక్రమంలో సీనియర్ ఆడిటర్లు చంద్రశేఖర్, విజయ్‌కుమార్, విజయలక్ష్మి, కృష్ణారావు పాల్గొన్నారు.

ఆరోగ్య కార్యకర్తల పాత్ర కీలకం..

విజయనగరం ఫోర్ట్: బాలల హక్కుల పరిరక్షణలో ఆరోగ్య కార్యకర్తల (నర్సులు) పాత్ర కీలకమని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. స్థానిక లక్ష్మీ స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో శిక్షణ పొందుతున్న నర్సింగ్ విద్యార్థులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గర్భస్థ లింగ నిర్ధారణ చట్టాన్ని అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. మగ పిల్లలు, ఆడపిల్లలు అనే వివక్ష ఉండకూడదన్నారు. కార్యక్రమంలో బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ జి. హిమబిందు, సభ్యులు చిట్టిబాబు, భవానీ, తదితరులు పాల్గొన్నారు.

జరజాపుపేటలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న రామారావు తదితరులు

నెల్లిమర్ల: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధి జరజాపుపేటలో వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. నగర పంచాయతీ వైస్ చైర్మన్ ఎస్.రామారావు సహా పలువురు రక్తదానం చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం పార్టీ కార్యకర్తల సమక్షంలో భారీ కేక్ కట్ చేశారు. నాయకులు వాసు, శ్రీనివాసరావు, సత్యనారాయణ, హైమావతి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఏడు కోవెళ్లలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

విజయనగరం టౌన్: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా బాబామెట్టలో ఉన్న ఏడుకోవెళ్లలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కేపీపీ రాజు ఆధ్వర్యంలో స్వామివారికి, అమ్మవార్లకు నక్షత్ర హారతి ఇచ్చారు. అనంతరం ఆలయ ఆవరణలో తిరుప్పావై విశిష్టతను వేదపండితులు వివరించారు. కార్యదర్శి శివకుమార్, కోశాధికారి సాంబమూర్తి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్కలతో విద్యార్థులు, బ్రహ్మకుమారీలు

విజయనగరం టౌన్: మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని బ్రహ్మకుమారి మాధురి అన్నారు. స్థానిక ఎస్‌కే డిగ్రీ కళాశాలలో బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం బోర్డ్ ఫర్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ హయ్యర్ ఎడ్యుకేషన్, బ్రహ్మకుమారీస్ సంయుక్తంగా తలపెట్టిన కల్పతరువు కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖాళీలు భర్తీ చేయాలి

విజయనగరం పూల్‌బాగ్: వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని డీవైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు వై.రాము డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో డీవైఎఫ్‌ఐ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సై, కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి సంబంధించి వయోపరిమితి పెంచాలని, అలాగే పోస్టుల సంఖ్య కూడా పెంచాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు హరీష్, రుద్ర ప్రసాద్, సతీష్, రామ్మోహన్, వెంకటేష్, నాయుడు పాల్గొన్నారు.

జనం మలిచిన నాయకుడు..

- ఘనంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు
- వెల్లివిరిసిన సేవాభావం
- మెగా రక్తదాన శిబిరంలో 420 యూనిట్ల రక్తం సేకరణ
- 50 కిలోల భారీ కేక్ కట్ చేసిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, నియోజకవర్గ పరిశీలకుడు నరేష్‌కుమార్ అగర్వాల్



విజయనగరం : జొన్నవలసలో దుస్తులు పంపిణీ చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రిఎజగన్ మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ విజయనగరం నియోజకవర్గం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిర్వహించిన వేడుకల్లో భాగంగా పార్టీ దివ్యాంగుల విభాగం ఏర్పాటు చేసిన 50 కిలోల భారీ కేక్‌ను పార్టీ నాయకులు, కార్యకర్తల జయ జయ ధ్వానాల నడుమ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, నియోజకవర్గ పరిశీలకుడు నరేష్‌కుమార్ అగర్వాల్ కట్ చేశారు. అంతకుముందు నియోజకవర్గ పరిధిలో నిర్వహించిన వివిధ సేవా, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, రేవతీదేవి, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్, జెడ్పీటీసీ సభ్యుడు కెల్ల శ్రీనివాసరావు, ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, పార్టీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, పార్టీ మండల అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు, పరిశ్రమల అభివృద్ధి సలహా మండలి డైరెక్టర్ సంగంరెడ్డి బంగారునాయుడు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ విజయనగరం నగర జోనల్ ఇన్‌చార్జ్‌లు, నగర, మండల పార్టీనాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రదాత జగనన్న...

విభజనతో వెనుకబాటుకు గురైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న ప్రదాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఏపీ శాసనసభా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన జగన్‌మోహన్‌రెడ్డి 50వ జన్మదిన వేడుకల్లో ఆయనతో పాటు పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు నరేష్‌కుమార్ అగర్వాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అవినీతికి తావులేని పాలన అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అని చెప్పారు. జిల్లా కేంద్రాస్పత్రి అభివృద్ధితో పాటు మెడికల్ కళాశాల ఏర్పాటుకు ముఖ్యమంత్రి ఎంతో సహకరించారని తెలిపారు. వందలాది మంది యువత రక్తదానానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఎవరెన్ని ప్రగల్భాలు పలికినా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయమన్నారు.

చేపట్టిన సేవా కార్యక్రమాలు..

- వైఎస్సార్‌సీపీ యువజన, విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నివాసంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయగా...420 మంది రక్తదానం చేశారు.
- పార్టీ మండల అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జొన్నవలసలో నిర్వహించిన కార్యక్రమంలో 500 మంది నిరుపేదలకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి , ఇతర పార్టీ నాయకుల చేతుల మీదుగా దుస్తులు పంపిణీ చేశారు.
- పార్టీ కంటోన్మెంట్ జోన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రాస్పత్రిలో డిప్యూటీ స్పీకర్ కోలగట్లతో పాటు విజయనగరం నియోజకవర్గ పరిశీలకుడు నరేష్ కుమార్ అగర్వాల్ రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.
- వెంకటలక్ష్మి జోనల్ పార్టీ ఆధ్వర్యంలో పేర్లవారి వీధిలో గల చెవిటి మూగ పాఠశాల విద్యార్థులకు కోలగట్ల, నరేష్ కుమార్ అగర్వాల్ స్టీల్ కంచాలు, గ్లాసులు, పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు.
- విజనగరంలో ఘోషాస్పత్రిలో రూ. లక్ష విలువ చేసే స్ట్రెక్చర్లు, బీపీ మిషన్లు, స్టెతస్కోపులు ఆస్పత్రి యాజమాన్యానికి అందజేశారు. అనంతరం ఆస్పత్రిలో బాలింతలకు డిప్యూటీ స్పీకర్, నియోజకవర్గ పరిశీలకుడు, నగర మేయర్, డిప్యూటీ మేయర్లు బాలింతలకు పాలు, రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు.
- ప్రేమ సమాజంలో వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.
- పూల్‌బాగ్‌కాలనీలో గల ద్వారకామయి అంధుల పాఠశాలలో విద్యార్థులకు, వాసవీ వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.



దెంకాడ: కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, తదితరులు



నెల్లిమర్ల: కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పూసపాటిరేగ: కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ కల్యాణి, జెడ్పీటీసీ సభ్యురాలు సీతాలక్ష్మి, తదితరులు

దుప్పట్ల పంపిణీ

నెల్లిమర్ల: ముఖ్యమంత్రి పుట్టినరోజు సందర్భంగా ఎమ్మెల్సీ డాక్టర్ పీవీవీ సూర్యనారాయణరాజు(సురేష్‌బాబు) నెల్లిమర్ల పట్టణంలోని కుసుమంచి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు దుప్పట్లు పంపిణీచేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దవళ లక్ష్మణరావు, మొయిద సూరిబాబు, రామారావు తదితరులు పాల్గొన్నారు. అలాగే నగర పంచాయతీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో వైఎస్సార్‌సీపీ నగర పంచాయతీ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, మాజీ సర్పంచ్ చిక్కాల అరుణకుమారి, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీ పతివాడ సత్యనారాయణ, వైస్ చైర్మన్ కారుకొండ వెంకట కృష్ణారావు, తదితరులు కేక్ కట్‌చేశారు. అలాగే రామతీర్థం జంక్షన్ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జానా ప్రసాద్, రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ నొవడ శ్రీనివాసరావు, కౌన్సిలర్లు చిక్కాల సుమతి, చిక్కాల సంతోష్‌కుమార్, మొయిద శ్రీనివాసరావు, మైపాడ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



విజయనగరం: ఘోషాస్పత్రిలో ఆస్పత్రి సిబ్బందికి బీపీ మిషన్, స్ట్రెచర్లు అందజేస్తున్న కోలగట్ల, నరేష్‌కుమార్ అగర్వాల్



విజయనగరం : కంచం, గ్లాసులు అందుకున్న బధిర విద్యార్థులు



భోగాపురం: మండల కేంద్రంలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు కాకర్లపూడి శ్రీనివాసరాజు

రామతీర్థంలో..

నెల్లిమర్ల రూరల్: మండలంలోని రామతీర్థంలో సీఎం జగన్ మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ అంబళ్ల సుధారాణి, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సలహా మండలి సభ్యుడు అంబళ్ల శ్రీరాములనాయుడు, వైస్ ఎంపీపీలు పతివాడ సత్యనారాయణ, సారిక వైకుంఠంనాయుడు, తదితరులు కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు తినిపించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కంచరాపు సూర్యకళ, గేదెల రామచిరంజీవి, అట్టాడ కృష్ణ, శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు మిరప శాంతి, రెడ్డి సత్యనారాయణ, బొంతు పురుషోత్తమరావు, జగన్నాథం, లెంక గోవింద పాల్గొన్నారు.

మండల కాంప్లెక్స్ ఆవరణలో...

దెంకాడ: మండల కాంప్లెక్స్ ఆవరణంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పీహెచ్‌సీలో రోగులకు ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబు పండ్లు పంపిణీ చేశారు. అంతకుముందు మండల కార్యాలయాల ప్రాంగణంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, జెడ్పీటీసీ సభ్యురాలు బడుకొండ లక్ష్మి, డెంకాడ పీఏసీఎస్ అధ్యక్షుడు రొంగలి కనక సింహాచలం కేక్ కట్ చేశారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణ చేశారు.



విజయనగరం : చెవిటి, మూగ పాఠశాలలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామికి కేక్ తినిపిస్తున్న చిన్నారి



నెల్లిమర్ల రూరల్: కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ అంబళ్ల సుధారాణి, తదితరులు



భోగాపురం: అమటాం రావివలసలో వైఎస్సార్‌సీపీ అభిమానుల మధ్య చిన్నారులచే కేక్ కట్ చేయిస్తున్న రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ ఉప్పాడ శివారెడ్డి



విజయనగరం : ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు , రొట్టెలు పంపిణీ చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

భోగాపురంలో..

భోగాపురం: మండల కేంద్రంతో పాటు అమటాం రావివలస, సవరవిల్లి, నందిగాం, రావాడ, పోలిపల్లి పంచాయతీల్లో ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు కాకర్లపూడి శ్రీనివాసరాజు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ ఉప్పాడ శివారెడ్డి, సర్పంచ్‌లు గరే మురళీమోహనరావు, కర్రోతు వెంకటరమణ, ఉప్పాడ విజయభాస్కరరెడ్డి కేక్ కట్ చేసి వైఎస్సార్‌సీపీ అభిమానులు, చిన్నారులు, పేదలకు పంచి పెట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పడాల శ్రీనివాసరావు, సుందర హరీష్, పడాల భానుప్రకాష్, ఆళ్ళ ఉదయబాబు, రౌతు వాసు, పంచాయతీ వార్డు నంబర్లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రంలో వినూత్నమైన పరిపాలన

పూసపాటిరేగ: సీఎం జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో వినూత్నమైన పరిపాలన అందిస్తున్నారని ఎంపీపీ మహంతి కల్యాణి అన్నారు. జగనన్న పుట్టినరోజు సందర్భంగా స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పతివాడ అప్పలనాయుడు, మహంతి సీతాలక్ష్మి, అల్లాడ రమేష్, ఎస్.సత్యనారాయణరాజు, మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్ధనరావు, గుజ్జు సురేష్‌రెడ్డి, మొంగం నాగబాబు, మహంతి లక్ష్మణరావు , కొయ్య ఎల్లన్నరెడ్డి, ఎడ్ల రామకృష్ణ, పిన్నింటి ఎల్లంనాయుడు, రౌతు శ్రీరామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.



విజయనగరం: దుస్తుల పంపిణీ కార్యక్రమంలో పేదల సందడి



విజయనగరం: ఘోషాస్పత్రిలో పండ్లు పంపిణీ చేస్తున్న మేయర్ విజయలక్ష్మి

మహిళా సంక్షేమానికి కృషి

- ఎంపీపీ అంబళ్ల సుధారాణి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అంబళ్ల సుధారాణి

నెల్లిమర్ల రూరల్: మహిళల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని ఎంపీపీ అంబళ్ల సుధారాణి అన్నారు. మండలంలోని రామతీర్థంలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో మహిళలకు అగరబత్తి, దూప్‌స్టిక్స్, చందనం కవర్ల తయారీపై శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ అంబళ్ల సుధారాణి మాట్లాడుతూ, మహిళల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారన్నారు. దేవాలయాల్లో పూజలకు ఉపయోగించే పుష్పాలతో అగరబత్తీలను తయారు చేయడం వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లదని చెప్పారు. మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, రైల్వేబోర్డు సలహా మండలి సభ్యుడు అంబళ్ల శ్రీరాములనాయుడు, వైస్ ఎంపీపీలు పతివాడ సత్యనారాయణ, సారిక వైకుంఠంనాయుడు, సర్పంచ్ కంచరాపు సూర్యకళ, తహసీల్దార్ రమణరాజు, ఏపీఎం సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యా వికాసమే ప్రభుత్వ లక్ష్యం



విద్యార్థులకు ట్యాబ్‌లు అందిస్తున్న ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, తదితరులు

- ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు
- విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

డెంకాడ: విద్యా వికాసమే లక్ష్యంగా ప్రభుత్వ పాలన కొనసాగుతోందని ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన ట్యాబ్‌లను పంపిణీ చేవారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. స్మార్ట్ లెర్నింగ్‌లో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే 'మనబడి నాడు – నేడు' కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తయారు చేశారని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతో పిల్లలు విద్యకు దూరం కాకూడదన్న ఉద్దేశంతో అమ్మఒడి పథకం ద్వారా ఆర్థిక చేయూత అందిస్తున్నారన్నారు. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, యూనిఫారాలు, బూట్లు, మధ్యాహ్న భోజనం అన్నీ అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వెంకట సత్య వాసుదేవరావు, జెడ్పీటీసీ సభ్యురాలు బడుకొండ లక్ష్మి, డెంకాడ పీఏసీఎస్ అధ్యక్షుడు రొంగలి కనక సింహాచలం, ఎంపీడీఓ స్వరూపారాణి, ఎంఈఓ అంబళ్ల కృష్ణారావు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో జీవితం నాశనం

- రూరల్ సీఐ టీవీ తిరుపతిరావు

విజయనగరం క్రైమ్: యువత మాదకద్రవ్యాల బారిన పడితే జీవితాలు నాశనమవుతాయని రూరల్ సీఐ టీవీ తిరుపతిరావు అన్నారు. జేఎన్‌టీయూ గురజాడ యూనివర్సిటీలో బుధవారం సాయంత్రం విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్, యాంటీ డ్రగ్ ఎవేర్‌నెస్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం యువత డ్రగ్స్‌కు ఎక్కువగా అలవాటవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చాలంటే డ్రగ్స్, ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం అవగాహన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రూరల్ ఎస్సై గణేష్, జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ కుమార్, అధ్యాపకులు, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి సత్కారం



అనిల్ కుమార్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గజపతినగరం: బొండపల్లి మండలంలోని చామలవలస గ్రామానికి చెందిన బోదంకి అనిల్ కుమార్ నవంబర్ 24 నుంచి డిసెంబర్ 4వరకు న్యూజిలాండ్ దేశంలో నిర్వహించిన కామన్వెల్త్ పవర్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో నాలుగు స్వర్ణ పతకాలు సాధించిన విషయం తెలిసిందే. ఆయన్ని స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గం కీర్తి ప్రతిష్టలను అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్లిన అనిల్ కుమార్‌ను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. బొండపల్లి ఎంపీపీ చల్ల చలం నాయుడు, జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు, నాయకులు బోదంకి గౌరి నాయుడు, బోదంకి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పీవీ రావు కృషి మరువలేనిది..

- మాల మహనాడు రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



పీవీ రావు చిత్రపటం ముందు నివాళులర్పిస్తున్న రామకృష్ణ, తదితరులు

విజయనగరం ఫోర్ట్: మాల మహనాడు పటిష్టానికి పీవీ రావు చేసిన కృషి మరువలేనిదని మాల మహనాడు రాష్ట్ర కార్యదర్శి లోగిశ రామకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక మాల మహనాడు కార్యాలయంలో వ్యవస్థాపకుడు పీవీ రావు వర్థంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ, మాలలకు రాజ్యాంగం ద్వారా సంక్రమించిన హక్కుల కోసం పీవీ రావు ఎనలేని కృషి చేశారని చెప్పారు. కార్యక్రమంలో మాల మహనాడు నాయకులు చీడి రామకృష్ణ, చోళ్ల రాజకుమారి, మామిడి కోటారావు, ఈశ్వరావు, ప్రశాంత్ పాల్గొన్నారు.

ప్రజల సుఖ, సంతోషాలే పాలనకు నిదర్శనం

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, తదితరులు

విజయనగరం:

ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సుఖ,సంతోషాలతో ఉన్నామని చెప్పడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనా పటిమకు నిదర్శనమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. పట్టణంలోని 37వ డివిజన్ వీటీ అగ్రహారం బీసీ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరుపై ఆరా తీవారు. కొన్నాళ్లుగా బీసీ కాలనీ అభివృద్ధికి నోచుకోలేదని, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక కార్పొరేటర్ కడియాల రామకృష్ణ చొరవతో అభివృద్ధి చేశామని చెప్పారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో కూడా జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, మేయర్ వేంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతీదేవి, కార్పొరేటర్ కడియాల రామకష్ణ, కార్పొరేషన్, సచివాలయ సిబ్బంది, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్‌పై గ్రామసభ

జామి: మండలంలోని గొడికొమ్ము గ్రామంలో 2021-22, 2022 – 23 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి చేపట్టిన ఉపాధి పనులు, పింఛన్లు తదితర అంశాలపై సర్పంచ్ పి.భవాని అధ్యక్షతన సోషల్ ఆడిట్ బృందం బుధవారం గ్రామసభ నిర్వహించింది. ఉపాధి పథకంలో చేపట్టిన పనులు, వేతనదారులకు చెల్లింపులు, పింఛన్ లబ్ధిదారులు, ఇతర వివరాలను అధికారులు, సోషల్ ఆడిట్ బృంద సభ్యులు సభలో చదివి వినిపించారు. ఈఓపీఆర్డీ ఏ.వి.లక్ష్మి, ఉపాధి హామీ ఏపీ కిరణ్మయి, ఎస్ఆర్పీ రాజు, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్,"ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ జగదీష్, ఎసచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే వి.ఆర్.పాలెంలో ఆ గ్రామ సర్పంచ్ చుక్క లక్ష్మి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు.ఉపాధి హామీ ఏపీడీ శారదాదేవి తదితరులు పాల్గొన్నారు.


వైఎస్సార్ జిల్లా గండ్లూరు గ్రామంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


చిత్తూరు జిల్లా పలమనేరులో ప్రభుత్వ సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

గడప గడపకు మన ప్రభుత్వం


విజయనగరం వి.టి.అగ్రహారంలో సంక్షేమపథకాలను వివరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి


పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండలో పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు

మళ్లీ మాస్కులేద్దాం

▶ మొదటి పేజీ తరువాయి

వివరించారు. కరోనా ముప్పు ఇంకా ముగిసిపోలేదని, ప్రజలంతా తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. రద్దీ ప్రాంతాల్లో మాస్కులు ధరించాలని, అర్హులైనవారంతా కరోనా వ్యాక్సిన్ బూస్టర్ డోసు కచ్చితంగా తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కరోనా విషయంలో ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వం సర్వసన్నద్ధంగా ఉందన్నారు. కోవిడ్–19 వ్యాప్తిని తేలిగ్గా తీసుకోవద్దని చెప్పారు. పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని, మహమ్మారిపై నిఘాను బలోపేతం చేయాలంటూ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశామని వెల్లడించారు.

కొత్త వేరియంట్లు పుట్టుకొచ్చినా ఎదుర్కొందాం

చైనా, జపాన్, దక్షిణ కొరియా, ఫ్రాన్స్, అమెరికా తదితర దేశాల్లో కరోనా కేసులు మళ్లీ పెరుగుతున్నాయని, ఫలితంగా అక్కడి ప్రభుత్వాలకు ఎన్నో సవాళ్లు ఎదురవుతున్నాయని మన్‌సుఖ్ మాండవీయ గుర్తుచేశారు. మన దేశంలో పండుగ సీజన్ రాబోతున్న దృష్ట్యా జాగ్రత్తగా ఉండాలన్నారు. కోవిడ్–19లో కొత్త వేరియంట్లు పుట్టుకొచ్చినా సమర్థవంతంగా నియంత్రించేలా వ్యూహాలు సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. పాజిటివ్ కేసుల నమూనాలను జినోమ్ సీక్వెన్సింగ్ చేయడం ద్వారా కొత్త వేరియంట్లను గుర్తించవచ్చని వివరించారు. ఇందుకు ఇండియన్ సార్స్–కోవ్–2 జినోమిక్స్ కన్సార్టియం(ఇన్సాకాగ్) నెట్‌వర్క్‌ను ఉపయోగించాలని చెప్పారు. ఇన్సాకాగ్‌కు చెందిన జినోమ్ సీక్వెన్సింగ్ ల్యాబ్‌లకు పాజిటివ్ కేసుల నమూనాలను రోజువారీగా పంపించాలని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సూచించారు. కోవిడ్–19 నియంత్రణ కోసం ఈ ఏడాది జూన్‌లో జారీ చేసిన 'ఆపరేషనల్ గైడ్‌లైన్స్'ను ప్రభావవంతంగా అమలు చేయాలన్నారు.

5 రాష్ట్రాల్లోనే 84 శాతం కేసులు

దేశంలో కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లో ఎక్కువగా కరోనా కొత్త కేసులు నమోదవుతున్నాయని అధికారులు వెల్లడించారు. ఈ నెల 20న దేశవ్యాప్తంగా నమోదైన మొత్తం కేసుల్లో 84 శాతం కేసులు ఈ 5 రాష్ట్రాల్లోనే బయటపడ్డాయని పేర్కొన్నారు. దేశంలో నమోదవుతున్న కేసులన్నీ తక్కువ తీవ్రత కలిగినవేనని స్పష్టం చేశారు. కరోనాపై కేంద్ర ఆరోగ్య శాఖ వచ్చేవారం మరోసారి సమీక్ష నిర్వహించనుంది.

ఆందోళన అవసరం లేదు: వీకే పాల్

దేశంలో అర్హులైన వారిలో ఇప్పటిదాకా కేవలం 27–28 శాతం మంది కరోనా టీకా బూస్టర్ డోసు తీసుకున్నారని నీతి ఆయోగ్ సభ్యుడు (ఆరోగ్యం) డాక్టర్ వీకే పాల్ తెలిపారు. సమీక్షా సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. మిగిలినవారు వీలైనంత త్వరగా బూస్టర్ తీసుకోవాలని చెప్పారు. అలాగే జనం గుమికూడేచోట మాస్కు ధరించాలన్నారు. ఇతర వ్యాధులతో బాధపడుతున్నవారు, వృద్ధులు ఈ విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూచించారు. అంతర్జాతీయ విమాన ప్రయాణాల నియమ నిబంధనల్లో ఎలాంటి మార్పులు లేవని పేర్కొన్నారు.

జేఈఈ మెయిన్ సిలబస్ ఖరారు

- మ్యాథమెటిక్స్‌లో 16 టాపిక్‌లు
- ఫిజిక్స్ సెక్షన్–ఏలో 20 టాపిక్స్, సెక్షన్–బిలో ప్రయోగ నైపుణ్యాలు
- ఫిజికల్ కెమిస్ట్రీ, ఆర్గానిక్ కెమిస్ట్రీల్లో 10 చొప్పున టాపిక్స్
- జనవరి పరీక్షల షెడ్యూల్ సమయంలో పలు బోర్డుల ప్రాక్టికల్ పరీక్షలు
- ఒకే తేదీల్లో రెండింటి పరీక్షలు ఉండడంతో విద్యార్థుల ఆందోళన
- జేఈఈ మెయిన్ జనవరి సెషన్ పరీక్షలు వాయిదా వేయాలని విన్నపం

సాక్షి, అమరావతి: దేశంలోనే ప్రతిష్టాత్మక విద్యా సంస్థలు.. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్‌ఐటీ), తదితర జాతీయ విద్యా సంస్థల్లో ప్రవేశాలకు నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్–2023 సిలబస్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) బుధవారం విడుదల చేసింది. దీని ప్రకారం.. మ్యాథమెటిక్స్‌లో 16 టాపిక్‌లు, ఫిజిక్స్ సెక్షన్–ఏలో 20 టాపిక్స్, సెక్షన్–బిలో ప్రయోగ నైపుణ్యాలపై ప్రశ్నలు ఉంటాయి. ఇక కెమిస్ట్రీలోని ఫిజికల్ కెమిస్ట్రీ, ఆర్గానిక్ కెమిస్ట్రీల్లో 10 చొప్పున టాపిక్స్ ఉన్నాయి. తెలుగు, ఇంగ్లిష్, హిందీ తదితర మాధ్యమాల్లో జేఈఈ మెయిన్‌ను నిర్వహించనున్నారు. విద్యార్థులు ఏ భాషలో పరీక్ష రాయాలనుకుంటున్నారో ముందుగానే దరఖాస్తులో పేర్కొనాల్సి ఉంటుంది. జేఈఈ మెయిన్‌లో భాగంగా బీఈ, బీటెక్‌లో ప్రవేశాలకు పేపర్–1, బీఆర్క్ కోసం పేపర్–2ఏ, బీప్లానింగ్‌కు పేపర్–2బీని నిర్వహిస్తారు. పేపర్–1లో మూడు సెక్షన్ల కింద మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీల్లో ప్రశ్నలుంటాయి. కంప్యూటర్ ఆధారితంగా పరీక్షలు జరుగుతాయి. ప్రతి సరైన సమాధానానికి నాలుగు మార్కులు ఉంటాయి. అలాగే నెగిటివ్ ఆన్సర్‌కు 1 మార్కు కోత ఉంటుంది. పేపర్–1లో మూడు సెక్షన్లలో 300 మార్కులకు 90 బహుళైచ్ఛిక సమాధానాల ప్రశ్నలుంటాయి. పేపర్–2ఏలో 400 మార్కులకు 82 ప్రశ్నలు ఇస్తారు. పేపర్–2బీలో 400 మార్కులకు 105 ప్రశ్నలుంటాయి.

జనవరి, ఏప్రిల్‌లో రెండు సెషన్లుగా పరీక్షలు..

కాగా జేఈఈ మెయిన్ పరీక్షలను జనవరి, ఏప్రిల్‌లలో రెండు సెషన్లుగా నిర్వహించేలా ఎన్‌టీఏ షెడ్యూల్ విడుదల చేసింది. తొలి సెషన్ జనవరి 24 నుంచి 31 వరకు, రెండో సెషన్ ఏప్రిల్ 6 నుంచి 12 వరకు నిర్వహించనుంది. ఇప్పటికే తొలి సెషన్‌కు సంబంధించి దరఖాస్తుల ప్రక్రియ కూడా ప్రారంభమైంది. అయితే జనవరి సెషన్ పరీక్షల తేదీల్లోనే పలు ఇంటర్మీడియెట్ బోర్డులు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నాయి. ఒకే తేదీల్లో ఈ రెండు పరీక్షలు రావడం వల్ల తమకు నష్టం కలుగుతుందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పైగా జనవరి సెషన్‌కు సన్నద్ధం కావడానికి తక్కువ సమయం ఇచ్చారని, ఈ తేదీలను పొడిగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే కరోనా సమయంలో రద్దు చేసిన ఇంటర్మీడియెట్‌లో 75 శాతం మార్కులు తప్పనిసరి అనే నిబంధనను పునరుద్ధరించడం వల్ల కూడా ఎక్కువ మందికి నష్టం వాటిల్లుతుందని పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఆ నిబంధనను కూడా సడలించాలని కోరుతున్నారు.

అర్హులెవరికీ ఆగలేదు

- 22.56 లక్షల మంది ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్
- గత ప్రభుత్వంలో ఇచ్చింది కేవలం 100 యూనిట్ల వరకే
- వైఎస్ జగన్ సీఎం అయ్యాక 200 యూనిట్లకు పెంపు
- అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకం వర్తింపు
- బాబు హయాంలో 2018–19లో ఈ పథకం ఖర్చు రూ. 230 కోట్లు
- వైఎస్ జగన్ ప్రభుత్వం 2021–22లో చేసిన ఖర్చు రూ.700 కోట్లు
- ఈ ఏడాది ఇప్పటివరకు వెచ్చించింది దాదాపు రూ.450 కోట్లు
- వాస్తవాలు దాచి, 'ఎస్సీ, ఎస్టీలకు షాక్' అంటూ పచ్చపత్రిక తప్పుడు కథనం
- అర్హత ఉన్న వారిలో ఒక్కరినీ తొలగించలేదని స్పష్టం చేసిన ఇంధనశాఖ

సాక్షి, అమరావతి: ఏడుపుగొట్టు వాడు ఎప్పుడూ ఏడుస్తూనే ఉంటాడు. ఏ కారణం లేకపోయినా, ఏదో ఒకటి చెప్పి ఏడుస్తుంటాడు. తన మెదడులో మెదిలింది బయటకు వెళ్లగక్కి మరీ ఏడుస్తాడు. అందులో నిజం లేదన్న విషయం పట్టదు. ఇందుకు ప్రతీకలే పచ్చ పత్రికలు. విష తుల్యమైన వాటి మెదడు విషమే కక్కుతుంది. అబద్ధాలు వండి వారిస్తుంది. ఇటువంటి మరో కథనమే ఎస్సీ, ఎస్టీలకు ఇస్తున్న ఉచిత విద్యుత్తుపై అవాస్తవ కథనాలు. వాస్తవాలు మాత్రం వేరు. రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీలను ఆదుకోవడానికి నెలకు 200 యూనిట్ల వరకు విద్యుత్‌ను ఉచితంగా అందించాలని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించారు. కేవలం మాటిచ్చి ఊరుకోవడం అలవాటు లేని సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎస్సీ, ఎస్టీల జీవితాల్లో వెలుగులు నింపేందుకు శ్రీకారం చుట్టారు. ఆయన ఆశయానికి అనుగుణంగా ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమలు చేయడానికి 2019 జూలై 25న ప్రభుత్వం జీవో నంబర్ 91 జారీ చేసింది. ఎస్సీ, ఎస్టీ కాలనీలు, తండాల్లో నివసించే వారికి ఉచిత విద్యుత్ అందిస్తామని ఆ జీవోలో స్పష్టంగా పేర్కొంది. దీనికి అనుగుణంగానే విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు ఆ కాలనీల్లో అర్హులైన అందరికీ ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నాయి. దీంతో ఆయా వర్గాల ప్రజలు సీఎం జగన్‌కు గుండెల్లో గుడి కట్టి పూజిస్తున్నారు. తమ ఇంట విద్యుత్ కాంతులు నింపిన దేవుడని చేయెత్తి మొక్కుతున్నారు. ఇదంతా చూసి పచ్చపత్రిక తట్టుకోలేకపోతోంది. ఓ అబద్ధాన్ని బలవంతంగా ప్రజల మెదళ్లలోకి చొప్పించాలని కుట్రలు పన్నుతోంది. అనర్హులను తొలగిస్తే 'ఎస్సీ, ఎస్టీలకు షాక్' అంటూ అసత్య కథనాన్ని అచ్చేసింది. ఆ తప్పుడు కథనాన్ని ఇంధన శాఖ ఖండించింది. అసలు నిజాలను వెల్లడించింది.

ఫ్యాక్ట్ చెక్

ఆరోపణ: ఎస్సీ, ఎస్టీలకు నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం లబ్ధిదారుల సంఖ్యలో ప్రభుత్వం కోత పెట్టింది.

వాస్తవం: ఇది పూర్తిగా అవాస్తవం. గత ప్రభుత్వం అమలు చేసిన ఉచిత విద్యుత్ పథకంలో ఇచ్చింది నెలకు 100 యూనిట్లు కాగా, ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత నెలకు 200 యూనిట్లకు పెంచింది. ఇలా పెంచడం వలన ఏర్పడ్డ అదనపు భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోంది. ఈ పథకం ద్వారా ఉచిత విద్యుత్ పొందడానికి ఈ ఏడాది నవంబర్ వరకు 22.56 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ వినియోగదారులు అర్హత పొందారు. గత ప్రభుత్వం ఈ పథకానికి 2018–19 లో సుమారు రూ. 230 కోట్లు ఖర్చు పెట్టగా, వైఎస్ జగన్ ప్రభుత్వం 2021–22లో రూ.700 కోట్లు ఖర్చు చేసింది. ప్రస్తుత 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు దాదాపు రూ.450 కోట్లు వెచ్చించింది.

ఆరోపణ: సర్వేలో డొల్లతనం వల్ల ఉచిత విద్యుత్ జాబితా నుంచి అర్హుల కనెక్షన్లు తొలగించారు

వాస్తవం: ఇది కూడా అబద్ధమే. ఉచిత విద్యుత్ పథకానికి 200 యూనిట్లకు మించి వినియోగించేవారు, ప్రభుత్వ ఉద్యోగులు, ఆదాయ పన్ను చెల్లించేవారు, ఆధార్ అనుసంధానం చేసినప్పుడు కుల ధ్రువీకరణ బీసీ, ఓసీగా నమోదైన వారిని మాత్రమే అనర్హులుగా నిర్ధారించారు. అర్హుల సర్వీసులేవీ తొలగించలేదు. ఒకవేళ అర్హత ఉండి ఈ పథకం రాకపోతే ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రంతో విద్యుత్ అధికారులను, గ్రామ సచివాలయ అధికారులను సంప్రదించాలని విద్యుత్ పంపిణీ సంస్థలు కోరుతున్నాయి.

అనర్హులకూ ఇమ్మంటారా

అర్హులైన ప్రతి ఒక్క ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు ఈ పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయటానికి రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని ఇంధన శాఖ స్పష్టం చేసింది. ఎస్సీ, ఎస్టీల్లోని నిరు పేదలకు అందాల్సిన ఈ పథకాన్ని కొందరు దుర్వినియోగం చేస్తున్నారని డిస్కంలు వెల్లడించాయి. ప్రభుత్వ ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తూ, ఆదాయ పన్ను చెల్లిస్తున్న వారు సైతం భార్య, ఇతరుల పేరు మీద ఉచిత విద్యుత్ సర్వీసులు తీసుకున్నట్లు తెలిపాయి. ఇలాంటి వారిని గుర్తించి అనర్హుల జాబితాలో చేరుస్తున్నట్లు తెలిపాయి. విద్యుత్ వృథాను, అక్రమ కనెక్షన్లను తగ్గించడం ద్వారా వాస్తవ అర్హులకు లబ్ధి చేకూర్చాలనేది తమ ధ్యేయమని, అర్హులెవరూ ఆందోళన చెందవద్దని డిస్కంలు చెబుతున్నాయి. ఎస్సీ ఎస్టీ విద్యుత్ కనెక్షన్‌తో ఆధార్ నంబరు అనుసంధానం చేయడం ద్వారా రెండో కనెక్షన్‌కు ఉచిత విద్యుత్ పథకం అమలు కాకుండా నియంత్రణ విధిస్తున్నట్లు జరుగుతున్న ప్రచారాన్ని డిస్కంలు ఖండించాయి. అది వాస్తవం కాదని, పచ్చ పత్రిక రాతలు అనర్హులకు కూడా ఉచిత విద్యుత్ ఇవ్వాలంటున్నట్టుగా ఉన్నాయని డిస్కంలు మండిపడ్డాయి.

కరోనాపై అప్రమత్తం

- రాష్ట్రంలో అదుపులోనే వైరస్
- గడచిన 50 రోజుల్లో 30వేల టెస్టులు చేయగా 130 పాజిటివ్ కేసుల నమోదు
- విలేజ్ క్లినిక్స్‌లోనే కరోనా నిర్ధారణ పరీక్షలు
- అందుబాటులో సరిపడా బెడ్స్, మందులు, ఆక్సిజన్



సాక్షి, అమరావతి: వివిధ దేశాల్లో కరోనా కేసులు అకస్మాత్తుగా పెరుగుతుండటంతో కేంద్రం సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. రాష్ట్రంలో వైరస్ పూర్తిగా అదుపులో ఉందని, కేసుల సంఖ్య పెరిగినా ఎదుర్కోవడానికి అవసరమైన వనరులు పుష్కలంగా ఉన్నాయని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు వెల్లడించారు. రాష్ట్ర ప్రజలు ఆందోళన చెందాల్సిన పనిలేదని స్పష్టం చేస్తున్నారు. గడచిన 50 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా 30,440 నమూనాలను పరీక్షించగా.. కేవలం 130 పాజిటివ్ కేసులు నమోదయ్యాయని వైద్య శాఖ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ లెక్కన పాజిటివ్ రేటు 0.42 శాతంగా ఉంది.

విలేజ్ క్లినిక్‌లలోనే పరీక్షలు

గ్రామాల్లోని వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లలోనే ప్రభుత్వం కరోనా నిర్ధారణ పరీక్షలను అందుబాటులోకి తెచ్చింది. ప్రతి విలేజ్ క్లినిక్‌లో 10 టెస్టింగ్ కిట్స్‌ను వైద్య శాఖ అందుబాటులో ఉంచింది. రాష్ట్రంలో 29 ఆర్టీపీసీఆర్ ల్యాబ్‌లు అందుబాటులో ఉన్నాయి. వేరియంట్‌ల గుట్టురట్టు చేసే జీనోమ్ సీక్వెన్సింగ్ ల్యాబ్ సౌకర్యం కూడా మన వద్ద ఉంది.

34 వేల ఆక్సిజన్ బెడ్స్ రెడీ

కరోనా కేసులు ఎక్కువగా నమోదైనా ప్రజలకు వైద్య సేవలు అందించడానికి వీలుగా ఆస్పత్రుల్లో బెడ్స్ నిరంతరం అందుబాటులో ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 12,292 జనరల్ బెడ్స్, 34,763 ఆక్సిజన్, 8,594 ఐసీయూ, 1,092 పీడియాట్రిక్ ఐసీయూ, 54 వేల క్వారంటైన్ పడకలు ఉన్నాయి. దీంతో పాటు 5,813 వెంటిలేటర్‌లు, 5,610 పీడియాట్రిక్, 297 నియోనటల్ వెంటిలేటర్‌లు సిద్ధంగా ఉన్నాయి. సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం తీసుకున్న చర్యలతో ఆక్సిజన్ సరఫరాకు ఎటువంటి కొరత లేదు. 170 పీఎస్ఏ ప్లాంట్‌లు, డీ–టైప్ ఆక్సిజన్ సిలిండర్‌లు, ఆక్సిజన్ కాన్సెన్‌ట్రేటర్స్ ద్వారా ఆస్పత్రుల్లో నిరంతరాయంగా ఆక్సిజన్ సరఫరా అందించేలా వసతులు ఉన్నాయి.

18 ఏళ్లు పైబడిన వారికీ రెండు డోసులు పూర్తి

రాష్ట్రంలో 18 ఏళ్లు పైబడిన వారందరికీ ఇప్పటికే రెండు డోసుల వ్యాక్సినేషన్ ప్రక్రియ పూర్తయింది. మరోవైపు హెల్త్‌కేర్ వర్కర్‌లకు 100 శాతం, ఫ్రంట్‌లైన్ వర్కర్‌లలో 93 శాతం మందికి, 60 ఏళ్లు పైబడిన జనాభాలో 73 శాతం, 18 నుంచి 59 ఏళ్ల వారిలో 33 శాతం మందికి ప్రికాషన్ డోసు కూడా అందింది. 12 నుంచి 17 ఏళ్ల పిల్లలందరికీ మొదటి డోసు పూర్తవగా, మొదటి డోసు వేసుకున్న 15 నుంచి 17 ఏళ్ల వారికి 99.7 శాతం, 12 నుంచి 14 ఏళ్ల వారిలో 98.17 శాతం మందికి రెండో డోసు కూడా వేశారు.

ఆందోళన అవసరం లేదు

కరోనా వ్యాప్తిపై వార్తలను చూసి ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. రాష్ట్ర ప్రభుత్వం పూర్తి అప్రమత్తంగా ఉంది. కావాల్సిన వైద్య సదుపాయాలు, టెస్టింగ్, క్వారంటైన్ వసతులు మన దగ్గర మెరుగ్గా ఉన్నాయి. క్రిస్మస్, జనవరి ఫస్ట్, సంక్రాంతి ఇలా వరుసగా సెలవు దినాలు, పండుగలు వస్తున్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు పాటిస్తే చాలు.

–జె.నివాస్, కమిషనర్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమం

ఏపీ ఇన్ పార్లమెంట్

రాజ్యసభ

ఏపీలో స్కూళ్ల అభివృద్ధికి రూ.867 కోట్లు

రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్రం జవాబు

సాక్షి, న్యూఢిల్లీ: సమగ్ర శిక్షా పథకం కింద 2022–23లో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పన, భవనాల మరమ్మతుల కోసం కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు రూ.867 కోట్లు విడుదల చేసినట్లు కేంద్ర విద్యాశాఖ సహాయమంత్రి అన్నపూర్ణాదేవి చెప్పారు. రాజ్యసభలో బుధవారం వైఎస్సార్‌సీపీ ఎంపీ వి.విజయసాయిరెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. కేంద్రం విడుదల చేసిన నిధుల్లో ఈ ఏడాది డిసెంబర్ 15 నాటికి రూ.823 కోట్లు ఖర్చుచేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి నివేదించినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు అభివృద్ధి చేసేందుకు ఏపీ ప్రభుత్వం నాడు–నేడు పేరుతో వినూత్న పథకాన్ని రూపొందించిందని చెప్పారు.

రూ.17,883.69 కోట్లతో ఏపీలో జాతీయ రహదారుల విస్తరణ

ఏపీలో రూ.17,883.69 కోట్ల అంచనా వ్యయంతో 22 జాతీయ రహదారుల అభివృద్ధి, విస్తరణ ప్రాజెక్టులు చేపట్టినట్లు జాతీయ రహదారులశాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ప్రశ్నకు జవాబిచ్చారు.

ఏపీ కేంద్రీయ వర్సిటీల్లో బోధన సిబ్బంది నియామకం లేదు

ఆంధ్రప్రదేశ్‌లోని సెంట్రల్ వర్సిటీ, సెంట్రల్ ట్రైబల్ వర్సిటీల్లో 1.4.2017 నుంచి 31.12.2021 వరకు బోధన సిబ్బందిని ఒక్కరిని కూడా నియమించలేదని కేంద్ర విద్యాశాఖ సహాయమంత్రి సుభాష్ సర్కార్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య ప్రశ్నకు మంత్రి జవాబిచ్చారు.

గ్రేహౌండ్స్ శిక్షణ కేంద్రానికి 385 ఎకరాలు

గ్రేహౌండ్స్ శిక్షణ కేంద్ర ప్రాజెక్టు కోసం ఏపీ ప్రభుత్వం విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం జగన్నాధపురం గ్రామంలో 385 ఎకరాల భూమిని గుర్తించిందని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి నిత్యానంద రాయ్ తెలిపారు. బీజేపీ సభ్యుడు జి.వి.ఎల్.నరసింహారావు ప్రశ్నకు బదులిచ్చారు. కేంద్ర ప్రభుత్వం మొత్తం భూమికి నిధులివ్వాలని సిఫార్సు చేసిందని చెప్పారు.

బీసీ రిజర్వేషన్లకు కేంద్రం అనుమతి అవసరంలేదు

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో ఏ కులానికైనా బీసీ రిజర్వేషన్లు కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి అవసరంలేదని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారతశాఖ సహాయమంత్రి ప్రతిమా భౌమిక్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కాపులకు రిజర్వేషన్లు కల్పించడంపై బీజేపీ ఎంపీ జి.వి.ఎల్.నరసింహారావు ప్రశ్నకు మంత్రి జవాబిచ్చారు.

లోక్‌సభ

డ్రగ్స్ నియంత్రణలో చట్టాలు, శిక్షలు ఆశించిన ఫలితాలివ్వడంలేదు

లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

సాక్షి, న్యూఢిల్లీ: భారతదేశం సహా ప్రపంచవ్యాప్తంగా డ్రగ్స్ నియంత్రణలో అనుసరించే శిక్షలు, చట్టాలు ఆశించిన ఫలితాలు ఇవ్వడం లేదని వైఎస్సార్‌సీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఆవేదన వ్యక్తం చేశారు. మరిన్ని కఠిన చట్టాలు, శిక్షలు రావాలని అభిప్రాయపడ్డారు. డ్రగ్స్ నియంత్రణకు కేంద్రం తీసుకుంటున్న చర్యలపై బుధవారం లోక్‌సభలో జరిగిన స్వల్పకాలిక చర్చలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.5 కోట్లతో 15 డీఅడిక్షన్ కేంద్రాలు ప్రారంభించారని చెప్పారు.

చేనేతలకు ఆరోగ్య బీమా ప్రతిపాదన లేదు

ఆంధ్రప్రదేశ్ సహా ఏ రాష్ట్రంలోను చేనేతల కోసం ప్రత్యేకంగా ఆరోగ్య బీమా ప్రవేశపెట్టే ప్రతిపాదన కేంద్రానికి అందలేదని కేంద్ర జౌళిశాఖ సహాయమంత్రి దర్శన జర్దోష్.. వైఎస్సార్‌సీపీ ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రశ్నకు సమాధానమిచ్చారు.

మూడేళ్లలో ఆరు వేర్‌హౌస్‌లు

సెంట్రల్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ ఏపీలో మూడేళ్లలో ఆరు వేర్‌హౌస్‌లు నిర్మించిందని కేంద్ర వినియోగదారుల వ్యవహారాలశాఖ సహాయమంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతి తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ సత్యవతికి సమాధానమిచ్చారు.

ఆహారభద్రతలో 2.68 కోట్ల మంది

జాతీయ ఆహార భద్రత చట్టం–2013 కింద ఆంధ్రప్రదేశ్‌లో 2.68 కోట్లమంది లబ్ధిదారులున్నారని మంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతి తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ గొడ్డేటి మాధవి ప్రశ్నకు సమాధానమిచ్చారు.

విద్యలో అసమానతలు లేకుండా చూడండి

కేంద్రీయ సాంకేతిక విద్యాసంస్థల్లో అసమానతలు లేకుండా చూడాలని కేంద్ర విద్యాశాఖ మంత్రికి వైఎస్సార్‌సీపీ ఎంపీ చింతా అనూరాధ విజ్ఞప్తి చేశారు. లోక్‌సభలో ఆమె మాట్లాడారు.

అంబరాన్నంటిన సంబరం

- సంక్షేమ సారథికి జన నీరాజనం
- ఊరూవాడ పండుగలా సీఎం వైఎస్ జగన్ పుట్టిన రోజు వేడుకలు
- వస్త్ర, అన్నదానాలు, రక్తదానం చేసి ప్రేమాభిమానాలు చాటుకున్న జనం
- మొక్కలు నాటి వికలాంగులకు ట్రైసైకిళ్లు పంపిణీ


కృష్ణా జిల్లా సంగమూడి జెడ్పీ పాఠశాల విద్యార్థుల వినూత్న ప్రదర్శన


విశాఖలో హ్యాపీ బర్త్‌డే సీఎం జగన్ అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న స్థానికులు

సంగమూడి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు విద్యాభివృద్ధి కోసం సీఎం జగన్ చేస్తున్న కృషికి కృతజ్ఞతగా ''హ్యాపీ బర్త్ డే జగన్ మామ'' అంటూ అక్షర రూపంలో కూర్చుని ముఖ్యమంత్రికి శుభాకాంక్షలు తెలిపారు.
– కృత్తివెన్ను

సాక్షి, నెట్‌వర్క్: సంక్షేమ సారథి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజుని పురస్కరించుకుని బుధవారం రాష్ట్రవ్యాప్తంగా సంబరాలు అంబరాన్ని అంటాయి. కేవలం రాష్ట్రంలోనే కాకుండా తెలంగాణతోపాటు వివిధ రాష్ట్రాల్లోనూ, విదేశాల్లోనూ వైఎస్సార్‌సీపీ శ్రేణులు, సీఎం వైఎస్ జగన్ అభిమానులు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా దాదాపు అన్నిచోట్లా పేదలకు, అనాథలకు వస్త్రదానం చేశారు. భారీ ఎత్తున అన్నదానాలు నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా మొక్కలు నాటారు. వికలాంగులకు ట్రైసైకిళ్లు పంపిణీ చేశారు. రోగులకు పండ్లు అందజేశారు. భారీ ఎత్తున రక్తదాన శిబిరాలు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రజాప్రతినిధులను బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ముఖ్యంగా తమ వర్గాల్లో ఆర్థిక, విద్య, రాజకీయ, సామాజిక, మహిళా సాధికారత తీసుకొచ్చేందుకు మహత్తర కృషి చేస్తున్న సీఎం పుట్టిన రోజు వేడుకలను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, పేదలు సహా అన్ని వర్గాల ప్రజలూ నిర్వహించారు. తద్వారా సీఎం జగన్‌పై తమ ప్రేమాభిమానాలు చాటుకున్నారు. ఇందుకోసం పోటీలు పడి వేడుకలు నిర్వహించారు. తమ కుటుంబ సభ్యుడిగా సీఎం వైఎస్ జగన్‌ను భావించి.. ప్రతి ఇంటా పండుగలా నిర్వహించడంతో సంబరాలు అంబరాన్నంటాయి. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో అభిమానులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఎక్కడికక్కడ సీఎం వైఎస్ జగన్ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్‌లు కట్ చేసి.. మిఠాయిలు పంచిపెట్టారు. వివిధ రాష్ట్రాలతోపాటు అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా, ఇంగ్లండ్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, తదితర దేశాల్లోనూ సీఎం జన్మదిన వేడుకలను అభిమానులు ఘనంగా నిర్వహించారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో 15 మంది వైద్యులతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. సీఎం జగన్ జన్మదినం సందర్భంగా కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు, మంత్రులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వైఎస్సార్ జిల్లా పులివెందులలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి రక్తదానం చేశారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో మంత్రులు అంబటి రాంబాబు, విడదల రజిని, పలువురు ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపట్టారు. కర్నూలు, నంద్యాల, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో మెగా రక్తదాన, వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ధర్మవరంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి నేతృత్వంలో పది వేల మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. చెన్నైలోని భారత్ యూనివర్సిటీలో బీటెక్ చదువుతున్న ఏపీ విద్యార్థులు కేక్ కట్ చేశారు.


తిరుపతిలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

సీఎం పుట్టిన రోజున 49 ఎకరాల భూ పంపిణీ

సీతంపేట: సీఎం జగన్ జన్మదినం సందర్భంగా విశాఖపట్నంకు చెందిన సుబ్రహ్మణ్యం రాజు కుమారుడు వెంకటపతిరాజు పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట మండలంలో 49 ఎకరాల భూమిని పంపిణీ చేశారు. బిల్లమడ, మోహన్ కాలనీకి చెందిన గిరిజనులకు గిఫ్ట్‌డీడ్ కింద జిరాయితీ సాగుభూమి రిజిస్టర్డ్ డాక్యుమెంట్లను సీతంపేట ఐటీడీఏ పీవో బి.నవ్య, పాలకొండ సబ్ కలెక్టర్ నూరుల్‌కమర్ చేతుల మీదుగా అందజేశారు. బిల్లమడలో 30 కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి ఎకరా 33 సెంట్లు చొప్పున మొత్తం 40 ఎకరాలు, రెండు ఎకరాలు గ్రామకంఠానికి, మరో ఎకరా కమ్యూనిటీ హాల్‌కు ఇచ్చారు. మోహన్ కాలనీలో 6 కుటుంబాలకు ఎకరా చొప్పున 6 ఎకరాలు పంపిణీ చేశారు.

16 కిలోమీటర్ల వెంబడి రహదారి పక్కన మొక్కలు

ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ సుమారు మూడు వేల మొక్కలను ఎనిమిది కిలోమీటర్ల పొడవునా రహదారికి ఇరువైపులా మొత్తం 16 కిలోమీటర్ల మేర నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో ఆయన తనయుడు కొట్టు విశాల్, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొన్నాయి. తాడేపల్లిగూడెం పట్టణంలోని కనకదుర్గ ఆలయం నుంచి వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం వరకు నాలుగు లైన్లుగా విస్తరిస్తున్న రోడ్డుకు ఇరువైపులా వీటిని నాటారు. విజయవాడ నుంచి ప్రత్యేకంగా వాహనాలలో తీసుకొచ్చిన రోజీ ట్రంపెట్ ట్రీ, సపోటేసి మొక్కలను పెట్టారు. దాదాపు రూ.26 లక్షల విలువ చేసే మొక్కలను నాటారు.


వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ వద్ద మొక్కలు నాటుతున్న వీసీ జానకీరామ్, కొట్టు విశాల్

డెహ్రాడూన్‌లో వేడుకలు

ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో సీఎం పుట్టిన రోజు వేడుకలు ఘనంగా జరిగాయి. మూడో జాతీయస్థాయి మహిళా కమిషన్ల సదస్సులో పాల్గొనేందుకు డెహ్రాడూన్ వెళ్లిన ఏపీ మహిళా కమిషన్ సభ్యులు కర్రి జయశ్రీరెడ్డి, గజ్జల లక్ష్మీరెడ్డి, బూసి వినీత అక్కడ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాఖండ్, తెలంగాణ, కర్ణాటక, అసోం, గుజరాత్ రాష్ట్రాల మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌లు, సభ్యులు పాల్గొన్నారు.


అనంతపురంలో ఏర్పాటు చేసిన శిబిరంలో రక్తదానం చేస్తున్న యువత


శ్రీకాకుళం జిల్లా పలాసలో రక్తదానం చేస్తున్న అభిమానులు

సాక్షి ఫ్యామిలీ
శ్రీకాకుళం
గురువారం ॥ 22-12-2022

శాంటా వస్తాడట... గిఫ్ట్స్ ఇస్తాడట...
మమ్మీ... నాక్కూడా ఇస్తాడా?
డాడీ... నేనడిగింది ఇస్తాడా?
పిల్లలు... బంగారు కొండలు.
శాంటా వారికి ఇష్టమైన తాతయ్య.
కానుకలిచ్చే తాతయ్య.
పిల్లల్ని మంచి మార్గంలో పెట్టడానికి
మంచి బుద్ధులు చెప్పడానికి
చదువులో ప్రోత్సహించడానికి
ఊరికే సంతోషపెట్టడానికి
అర్ధరాత్రి దిండు కింద కానుకలు పెట్టి
తల్లిదండ్రులే శాంటాలు అవుతారు.
పిల్లలు ఈ సంతోషానికి హక్కుదారులు.
పెద్దలు ఈ సంతోషం పంచాల్సిన
బాధ్యత కలిగిన వారు.
క్రిస్మస్‌ను సంతోషమయం చేయండి.
పిల్లలను ఈ కానుకలతో
ఎలా ప్రోత్సహించవచ్చు?
ఏ కానుకలు ఇవ్వొచ్చు?



క్రిస్మస్ వేళ

మమ్మీ... శాంటా ఏమిచ్చాడో చూడు..

‘అమ్మా... శాంటా క్లాజ్ ఎక్కడ ఉంటాడు?’
‘నార్త్ పోల్‌లో’
‘ఎప్పుడు వస్తాడు?’
‘రేపు క్రిస్మస్ అనగా ఇవాళ రాత్రి వస్తాడు’
‘ఎలా వస్తాడు?’
‘ఎగిరే జింకల బగ్గీ మీద బోలెడన్ని గిఫ్ట్స్ వేసుకుని, ఏయే పిల్లాడికి ఏయే గిఫ్ట్ ఇవాలో వాటి మీద పేరు రాసుకుని వస్తాడు’
‘మన ఇంటికి వస్తాడా?’
‘ఎందుకు రాడు?’
‘నాకు గిఫ్ట్ ఇస్తాడా?’
‘ఇస్తాడు. మంచి పిల్లలకు మంచి గిఫ్ట్ ఇస్తాడు. అల్లరి పిల్లలకు గిఫ్ట్ ఇవ్వడు’
‘నేను మంచి పిల్లాడినేగా’
‘నాకేం తెలుసు. నీకు తెలియాలి’
‘నేను అల్లరి చేయనుగా’
‘అయితే నీకు గిఫ్ట్ తెచ్చిస్తాడులే’



క్రిస్మస్ వచ్చిందంటే పిల్లలందరికీ క్రిస్మస్ తాత గుర్తుకొస్తాడు. తెల్లటి ఫర్ అంచుల ఎర్రటి బట్టలు వేసుకుని, ఇంత పొడవు తెల్ల గడ్డంతో, ఎర్ర టోపీతో, కళ్లద్దాలు పెట్టుకుని ‘జింగిల్ బెల్స్ జింగిల్ బెల్స్’ పాడుతూ కానుకలు తెచ్చే శాంటా తాత కోసం ఎదురు చూపులు మొదలవుతాయి. మూడు నాలుగేళ్ల వయసు నుంచి పదేళ్ల లోపు పిల్లలకు క్రిస్మస్ తాత మీద ఎంతో నమ్మకం. సంవత్సరమంతా ఎదురు చూసైనా తాత ఇచ్చే బహుమతి అందుకోవాలనుకుంటారు. ఏ బహుమతి ఇస్తాడో అనే సస్పెన్స్‌ని ఎంజాయ్ చేస్తారు. కాస్త పెద్ద పిల్లలకు తాత మీద డౌట్ ఉన్నా తెల్లారే సరికి తమ బెడ్ మీద పక్కనే ఉన్న గిఫ్ట్స్‌ను చూస్తే ఆనందం. సంతోషం. వాటిని తాత ఇచ్చినా సరే. తాత పేరుతో ఎవరు ఇచ్చినా సరే. కాని ఆ రోజంతా ‘శాంటా ఏం ఇచ్చాడో చూడు’ అని అందరికీ చూపడం ఎంత బాగుంటుందో.

పిల్లలకు ఏం గిఫ్టులు ఇవ్వొచ్చు? వీటిలోంచి ఎంచుకోండి.

1. ఆర్ట్ మెటీరియల్, 2. బొమ్మల పుస్తకాలు
3. మూస్, 4. పిగ్గీ బ్యాంక్, 5. కెలడీస్కోప్
6. ఇండోర్ ప్లాంట్, 7. కుక్కపిల్ల
8. స్మార్ట్ వాచ్, 9. స్మార్ట్ స్పీకర్స్
10.పోర్టబుల్ ఆడియో ప్లేయర్
11. క్రిస్మస్ టీషర్ట్స్, 12. హెడ్ సెట్స్ 13. టాయ్స్

‘అమ్మా.. నాకేం గిఫ్ట్ కావాలో శాంటాకు ఎలా తెలుస్తుంది?
‘ఉత్తరం రాసి నాకు ఇవ్వు పోస్ట్ డబ్బాలో పడేస్తాను’
‘సరే’
‘నేను కోరిందే ఇస్తాడా?’
‘శాంటాకు రాయి. తాతయ్యా... నేను బాగా చదువుకుంటాను. బుద్ధిగా ఉంటాను. క్లాస్‌లో అల్లరి చేయను. అమ్మ చెప్పినట్టు వింటాను. అన్నం తినని మారాం చేయక పెట్టిందల్లా తింటాను. అబద్ధాలు చెప్పను. ఎక్కువగా ఫోన్‌తో ఆడను. నేను గుడ్‌బాయ్‌గా ఉంటాను అని రాయి. అప్పుడు తెస్తాడు’
‘సరే’

కానుకలు ఎప్పుడూ పిల్లలను ఉత్సాహపరుస్తాయి. తల్లిదండ్రులు క్రిస్మస్ సందర్భంగా వారికి నచ్చిన చిన్నచిన్న కానుకలైనా ఇచ్చి ప్రోత్సహించాలి. ‘పోయిన సంవత్సరం మంచి మార్కులు తెచ్చుకున్నావుగా. అందుకని ఈ గిఫ్ట్. చాలా బుద్ధిగా ఉంటున్నావుగా... అందుకని ఈ గిఫ్ట్. చెల్లితో/అక్కతో కొట్లాడటం లేదు కదా అందుకని ఈ గిఫ్ట్. మంచి ఫ్రెండ్స్‌ను చేసుకున్నావుగా. అందుకని ఈ గిఫ్ట్’ ఇలా చెప్పి కానుకలు ఇస్తే వారు తాము మంచి పనులు చేస్తున్నామనే నమ్మకానికి వస్తారు. చేయాలని అనుకుంటారు. వాటికి కానుకలు ఉంటాయని ఉత్సాహపడతారు. క్రిస్మస్ తాతను చూపి దురలవాట్లు (గోర్లు కొరకడం, హ్యాండ్ రైటింగ్ కరెక్ట్ చేసుకోకపోవడం, పుస్తకాల బ్యాగ్ సరిగ్గా ఉంచుకోకపోవడం, స్కూల్ ఎగ్గొట్టడం.. వంటివి) మాన్పించవచ్చు. అవి మానతామని హామీ ఇస్తేనే తాత గిఫ్ట్ ఇస్తాడని చెప్పాలి.
మెర్రీ క్రిస్మస్.

ముగ్గు - ముచ్చట



17 చుక్కలు
17 వరుసలు



సుజాత పివిఎల్,
నేరేడ్‌మెట్, హైదరాబాద్





ఆర్.ఇందిర, బొబ్బిలి,
విజయనగరం జిల్లా

21 చుక్కలు :
11 వచ్చేవరకు
మధ్యచుక్క

ముగ్గులు పంపవలసిన చిరునామా: ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com

విమానం నడిపిన అమ్మాయిలను చూస్తున్నాం.
విమానంలో యుద్ధం చేసే అమ్మాయిలనూ చూశాం.
ఇప్పుడు... విమానాలు తయారు చేస్తున్న అమ్మాయిని చూద్దాం.



“నేను మహిళలకు చెప్పే మాట ఒక్కటే... మనల్ని మనం ‘ఇంజనీర్, సైంటిస్ట్, పైలట్’ అని ప్రొఫెషన్‌పరంగా మాత్రమే గుర్తించుకోవాలి. ‘ఉమన్ ఇంజనీర్, ఉమన్ పైలట్, ఉమన్ సైంటిస్ట్’ అని జెండర్‌పరంగా కాదు. అన్ని పరీక్షలనూ మగవాళ్లతోపాటు పూర్తి చేసి ఈ స్థాయికి వచ్చాం. రిజర్వేషన్‌లలో రాలేదు. ఇక ఉమన్ అని జెండర్‌తో ఐడెంటిఫై అవడం ఎందుకు?

– వల్లూరి సుధీర,
ఏరోస్పేస్ మాన్యుఫాక్చరింగ్ ఇంజనీర్

మన వృత్తే మన గుర్తింపు

● జెండర్ రేఖను చెరిపేసిన ధీర

వల్లూరి సుధీర ఏరో స్పేస్ మాన్యుఫాక్చరింగ్ ఇంజనీర్. జర్మనీలోని లిలియమ్ ఎయిర్‌క్రాఫ్ట్ కంపెనీలో మ్యాన్యుఫాక్చరింగ్ ఇంజనీరింగ్ ప్రాడక్ట్ టీమ్‌కి హెడ్. ఆ కంపెనీ స్థాపించిన తర్వాత ఉద్యోగంలో చేరిన వంద మంది ఇంజనీర్‌లలో ఒకే ఒక యువతి ఆమె. సెలవు మీద హైదరాబాద్‌కి వచ్చిన సుధీర ఈ రంగంలో అడుగుపెట్టడానికి స్ఫూర్తినిచ్చిన సందర్భాన్ని, ఏరోస్పేస్ మ్యాన్యుఫాక్చరింగ్ విభాగంలో తన ప్రయాణాన్ని సాక్షితో పంచుకున్నారు.

ఆ ఉద్యోగ ప్రకటన!

“మా తాతయ్య జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాలో సైంటిస్ట్‌గా పశ్చిమబెంగాల్, ఒడిశాల్లో ఉద్యోగం చేశారు. అమ్మమ్మ అదే డిపార్ట్‌మెంట్‌లో క్లర్క్‌గా భువనేశ్వర్‌లో రిటైర్ అయ్యారు. నేను ఏరోస్పేస్ ఇంజనీర్ కావడానికి డైరెక్ట్‌గా ప్రభావితం చేయలేదు, కానీ పరోక్షంగా వారి నేపథ్యం నాకు మంచి భరోసా నిచ్చింది. నిజానికి మా అమ్మానాన్నలిద్దరి మూలాలూ ఆంధ్రప్రదేశ్, పశ్చిమ గోదావరి జిల్లా, తణుకులోనే ఉన్నాయి. అమ్మానాన్న హైదరాబాద్‌లో సెటిల్ కావడంతో నా బాల్యం భాగ్యనగరంలోనే. విద్యానగర్‌లోని అరబిందో ఇంటర్నేషనల్ స్కూల్‌లో చదివాను. ఎయిత్ క్లాస్‌లో ఉన్నప్పుడు ఇంగ్లిష్ పేపర్‌లో ఒక ప్రకటన చూశాను. పైలట్‌ల కోసం ప్రకటన అది. అయితే మగవాళ్లకు మాత్రమే. అప్పుడు ‘అమ్మాయిలెందుకు వద్దు’ అనిపించింది. అమ్మాయిలు విమానయాన రంగానికి సంబంధించిన కోర్సులు చదవరా అని కూడా అనుకున్నాను. నేను ఏరోస్పేస్ లేదా ఏరోనాటికల్ కోర్సులు చేయాలని నిర్ణయించుకున్నాను. మా అమ్మానాన్న పెద్దరికపు సవరణలేమీ చేయకుండా నన్ను నేను కోరుకున్న కోర్సులో చేర్చారు. బీటెక్ ఏరోనాటికల్ ఇంజనీరింగ్, దుండిగల్‌లోని ఎమ్ఎల్ఆర్ ఇన్‌స్టిట్యూట్‌లో చేశాను. అప్పట్లో నాకు ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో చేరి ఆర్మీలో పని చేయాలని ఉండేది. పరీక్షలు రాశాను, కానీ సెలెక్ట్ కాలేదు. అప్పుడు ఆదిభట్లలో ఉన్న ‘టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్’ కంపెనీ మా క్యాంపస్‌కి ప్లేస్‌మెంట్ గురించి వచ్చింది, అలా 2012లో టాటా కంపెనీలో ఉద్యోగంలో చేరాను. ప్రొడక్షన్ ప్లానింగ్, కంట్రోల్ విభాగాల్లో సీనియర్ ఎగ్జిక్యూటివ్‌గా చేయడంతో పని మీద మంచి పట్టు వచ్చింది. రెండేళ్లు ఉద్యోగం చేసిన తర్వాత మాస్టర్స్ చేయాలని, అది కూడా మాన్యుఫాక్చరింగ్‌లోనే చేయాలనుకుని యూఎస్‌లోని అరిజోనా స్టేట్ యూనివర్సిటీకి వెళ్లాను. కోర్స్ పూర్తయిన తర్వాత గల్ఫ్ స్ట్రీమ్ ఏరోస్పేస్ కార్పొరేషన్‌లో ఉద్యోగం చేశాను. అది బిజినెస్ జెట్‌లు తయారు చేసే కంపెనీ. ఇప్పటి వరకు నాది చాలా మామూలు జర్నీనే. 2017లో పెళ్లి, అబ్బాయి నాకు బీటెక్ క్లాస్‌మేటే. ఇప్పుడు ఇండియన్ కోస్ట్ గార్డ్‌లో ఏవియేషన్ ఆఫీసర్. పెళ్లి తర్వాత ఇండియాలో ఉద్యోగం కోసం చూస్తున్నప్పుడు జర్మనీలో మంచి అవకాశం వచ్చింది.

సబ్జెక్ట్‌ని నిరూపించుకోవాల్సిందే!

ఆటోమొబైల్, మాన్యుఫాక్చరింగ్ వంటి సాంకేతికత ఎక్కువగా ఉంటే రంగాల్లో టెక్నికల్ పీపుల్‌తో పని చేసేటప్పుడు వాళ్లు ఆడవాళ్ల మాటను పట్టించుకోరనే అభిప్రాయం కూడా ఉంటుంది. ఇక్కడ సమస్య ఎక్కడ వస్తుందంటే... యంగ్ ఇంజనీర్‌కంటే సీనియర్ టెక్నీషియన్‌కి ఎక్కువ విషయాలు తెలిసి ఉంటాయనడంలో సందేహం లేదు. కొత్త మార్పును తెచ్చేటప్పుడు టెక్నికల్ పీపుల్‌కి మనం విషయమంతా వివరించేటప్పుడు సబ్జెక్ట్ పరంగా మనం ఒక అడుగు ముందున్నామనే విషయాన్ని నిరూపించుకోవాలి. ఈ నిరూపణ మగవాళ్లకైనా ఉంటుంది, ఆడవాళ్లకూ ఉంటుంది.

నాలుగేళ్ల కిందట నేను మాత్రమే

జర్మనీలో ‘లిలియమ్ ఎయిర్ క్రాఫ్ట్’ కంపెనీలో ఎయిర్ క్రాఫ్ట్ ఫైనల్ అసెంబ్లీ ఇంజనీర్‌గా ఉద్యోగం వచ్చింది. ఆ కంపెనీలో అప్పుడు... అంటే 2018లో వందమంది ఇంజనీర్‌లలో అమ్మాయిని నేను మాత్రమే. అయితే ఆ గుర్తింపు నాకు పెద్దగా సంతోషాన్నివ్వదు. అమ్మాయిలు కోరుకోవాల్సింది జెండర్ సెపరేషన్‌తో కూడిన గుర్తింపు కాదు. వందమందిలో యాభై మంది అమ్మాయిలు ఎందుకు ఉండకూడదు అని ప్రశ్నించుకోవాలి, మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలనేది నా ఆకాంక్ష. ఇప్పుడు మా కంపెనీలో ఎనిమిది వందల మంది ఇంజనీర్‌లున్నారు, వారిలో వందమంది వరకు అమ్మాయిలున్నారు. ఈ నాలుగేళ్లలో వచ్చిన పురోగతి. ఈ ఫీల్డ్‌లో అమ్మాయిలు నెగ్గుకురావడం కష్టమనేది అపోహ మాత్రమే. నేనిప్పుడు మ్యాన్యుఫాక్చరింగ్ ఇంజనీరింగ్ ప్రాడక్ట్ టీమ్‌కి హెడ్‌ని. ఎంతో మందిని ఇంటర్వ్యూ చేసి ఉద్యోగంలోకి సెలెక్ట్ చేసుకోగలిగాను. మా టీమ్‌లో పోలండ్, బ్రెజిల్, యూకే, యూరప్ దేశాల వాళ్లు ఉన్నారు. వాళ్లతో కలిసి పని చేయడం, వాళ్ల నుంచి పని తీసుకోవడంలో ఎక్కడా ఇబ్బందులేవీ రాలేదు. అయితే ఒక టాస్క్ ఇచ్చే ముందు వాళ్ల బేసిక్ అండర్‌స్టాండింగ్ లెవెల్స్‌ని అర్థం చేసుకోగలిగితే టీమ్‌తో పని చేయించుకోవడం ఏ మాత్రం కష్టంకాదనేది నా అభిప్రాయం. నేను టీమ్ లీడర్‌లుగా, ఇంజనీర్‌లుగా ఎంతో మంది మహిళలను చూశాను, వారితో పనిచేశాను కూడా. మిగిలిన అన్ని రంగాల్లోలాగానే ఈ రంగంలో కూడా మహిళలు బాగా రాణిస్తున్నారు” అన్నారు ఏరోస్పేస్ మాన్యుఫ్యాక్చరింగ్ ఇంజనీర్ వల్లూరి సుధీర.

– వాకా మంజులారెడ్డి

వీకెండ్ వస్తుందంటేనే చాలామందిలో ఒక జోష్ వస్తుంది.
ఫ్రెండ్స్‌తో కలిసి పార్టీ చేసుకున్నాం.
కుటుంబంతో కలిసి పిక్నిక్‌లకు వెళ్లాం.. అంటూ
ఆ ఫొటోలను సోషల్‌మీడియాలో షేర్ చేసి
ఆనందాన్ని పంచుకుంటాం.
వాటికి వచ్చిన లైక్స్, కామెంట్స్ చూసి మురిసిపోతుంటాం.
ఇలాంటి వీకెండ్ పార్టీ జాబితా మీద
నిఘా వేసే మోసగాళ్లు డిజిటల్‌లో పొంచి ఉన్నారు జాగ్రత్త.

సైబర్ టాక్



వీకెండ్ పార్టీ యూజర్లపై నిఘా!

డిజిటల్ మోసగాడి లక్ష్యం ప్రముఖుల సోషల్ మీడియా అకౌంట్స్‌ను అనుకరిస్తూ వారి పేరిట నకిలీ అకౌంట్స్‌ను సృష్టించడం. ఈ జాబితాలో రాజకీయ నాయకులు, నటీనటులు, కంపెనీ అధినేతలు, ప్రముఖుల అకౌంట్స్ ఉండే అవకాశాలే ఎక్కువ. నకిలీ అకౌంట్స్‌తో మోసం చేసేవారు అన్ని ఆన్‌లైన్ సామాజిక ప్లాట్‌ఫారమ్‌లలో కనిపిస్తారు. వీరిలో చాలా మంది ప్రమాదకారులు కానప్పటికీ, పరువు నష్టం లేదా విరాళాలు అడగడం/ రుణాలు కోరడం/ కనెక్ట్ అయిన వెంటనే డబ్బు దోపిడీ చేయడం .. వంటి వాటిపై దృష్టి సారించే వారున్నారు.

ముందే ప్లాన్

డిజిటల్ మోసగాళ్లు ముందుగా చేసుకున్న ప్లాన్ ప్రకారం ఏ మాత్రం నమ్మదగని కంటెంట్‌ను సృష్టిస్తారు. బాధితులు లేదా ఇతర హెల్త్ కేర్ ప్రొవైడర్స్ నుండి సమాచారాన్ని దొంగిలించడానికి టెలిఫోన్ స్కామర్లు ఎన్‌సిబి, ఇతర డ్రగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెంట్లలాగా నటించే విస్తృత మోసపు పథకాలు రిలీజ్ చేస్తుంటారు. ముఖ్యంగా వీక్ ఎండ్ పార్టీ కల్చర్ ఉన్న ఆన్‌లైన్ వినియోగదారులకు ఈ విధమైన కాల్స్ చేస్తుంటారు. స్కామర్లు నకిలీ పేర్లు, ప్రసిద్ధ డ్రగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు లేదా అసలు విభాగాలలోని పోలీసు అధికారుల పేర్లను కూడా ఉపయోగిస్తారు.

ప్రధానమైన ఎంపిక

వైద్యపరమైన సమస్యలు, విడాకులు, కొత్త ఉద్యోగం, పార్టీల అవగాహన, గేమింగ్, కొనుగోళ్లు చేయాలనుకునేవారు, లైఫ్ స్టైల్ అవగాహన, టెక్నాలజీ, ట్రావెల్, స్పోర్ట్స్.. వంటి టాపిక్స్ గురించి చర్చించే సామాజిక ప్రొఫైల్స్‌ను మోసగాళ్లు ఎంచుకుంటారు.

మోసగాళ్ల సాధారణ లక్షణాలు

- దాడి చేసేవారి మాటల్లో వేగం ఉంటుంది. దీనిని గమనించి బాధితులు వెంటనే అలర్ట్ అవ్వచ్చు.
- డబ్బుకు సంబంధించి ధ్రువీకరణ పొందడానికి ఊహించని రిక్వెస్ట్‌లు పంపుతారు. ఇది ఇ-మెయిల్స్‌కు ఎక్కువ.
- స్కామర్లు తరచుగా ‘ప్రైవేట్, గోప్యమైన, రహస్య’ పదాలను ఉపయోగిస్తారు,
- చాలాసార్లు స్కామర్లు మీ ఇన్‌బాక్స్‌లోకి ప్రవేశించడానికి ఇ మెయిల్ స్పూఫింగ్ లేదా ఒకేలా కనిపించే ఇమెయిల్‌ను ఉపయోగిస్తారు.

ఇటీవలి కొత్త దాడులు

- మోసగాళ్లు దొంగిలించిన ఉన్నతాధికారుల ఖాతాలను ఉపయోగించి ఆన్‌లైన్‌లో నకిలీ ఖాతాను సృష్టిస్తున్నారు. మోసగాళ్ళు వారి డిజిటల్ ప్రొఫైల్ (DP)ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి లేదా సీనియర్ బ్యూరోక్రాట్ చిత్రంతో సృష్టిస్తారు. స్కామర్ ఆ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ లేదా బ్యూరోక్రాట్‌గా నటించి వారి బృందాలకు వాట్సప్ సందేశాలను పంపుతాడు.
- వారు వారాంతపు పార్టీపై అవగాహన ఉన్న వ్యక్తులను లక్ష్యంగా చేసుకుంటారు. మొత్తం డేటా సోషల్ మీడియా పోర్టల్‌ల నుండి సేకరిస్తారు.
- స్కామర్ల కథనాలు కొద్దిగా మారవచ్చు కూడా. సాధారణంగా, వారు చట్టవిరుద్ధమైన డ్రగ్స్‌తో ప్యాక్ చేసిన పార్సిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు మీకు చెప్తారు. ఇది బాధితుల పేరుతో కొరియర్ చేయబడింది, లేదా అక్రమ మాదకద్రవ్యాలతో చేసిన ప్యాక్‌ను స్వాధీనం చేసుకున్నట్టు, కొరియర్‌కు సంబంధించిన సమాచారాన్ని కూడా సృష్టిస్తారు. అంతేకాదు, మాదకద్రవ్యాల రవాణా, మనీలాండరింగ్ కోసం బాధితుడిని అరెస్టు చేయబోతున్నారని బెదిరించడం.
- బాధితులు వారి ఇ మెయిల్‌లు, వాట్సాప్ సంభాషణలకు సరిగ్గా స్పందించకపోతే, స్కామర్లు మొత్తాలను చెల్లించనందుకు అరెస్టు చేయడానికి లా ఎన్‌ఫోర్స్‌మెంట్, ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీలుగా నటిస్తూ నకిలీ నోటీసులు పంపడం ద్వారా బాధితుడిని బెదిరించడం ప్రారంభిస్తారు. బాధితురాలికి బకాయిపడిన మొత్తంపై అప్పీలు చేసుకునే అవకాశం ఇవ్వకుండా చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.
- దోపిడీలో భాగంగా, బాధితుడు తమకు చెల్లింపుగా డబ్బును బదిలీ చేయడానికి లేదా బాధితుడు సహకరించడానికి సిద్ధంగా ఉన్నాడని నిరూపించడానికి నకిలీ అధికారి పైన పేర్కొన్న కారణాన్ని చూపుతాడు. UPIని ఉపయోగించి డబ్బును ట్రాన్స్‌ఫర్ చేయమని చెబుతారు.

మోసగాళ్ల బారిన పడకుండా..

● మీ ఖాతాలకు ప్రత్యేక, ఆల్ఫాన్యూమరిక్ అక్షరాలతో సంక్లిష్టమైన పాస్‌వర్డ్‌లను ఉపయోగించండి ● (2FA) రెండు కారకాల ప్రమాణీకరణను ప్రారంభించండి. ● లాక్/ గార్డ్ వంటివి మీ ప్రొఫైల్ ఫీచర్లకు ఉపయోగించండి. ● సమాచార భాగస్వామ్యాన్ని నియంత్రించడానికి మీ సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌ల కోసం గోప్యతా సెట్టింగ్‌లను కాన్ఫిగర్ చేయండి ● సామాజిక ప్లాట్‌ఫారమ్‌లలో సున్నితమైన, వ్యక్తిగత సమాచారాన్ని ఎప్పుడూ షేర్ చేయవద్దు. ● అనుమానాస్పద లింక్‌లపై క్లిక్ చేయడం మానుకోండి, https://isitphishing.org/తో లింక్‌ను ధృవీకరించండి. ● నిజ జీవితంలో మీకు తెలిసిన, విశ్వసించే వ్యక్తులతో మాత్రమే కనెక్ట్ అవ్వండి. ● ఆఫ్‌లైన్- ఆన్‌లైన్ అందరినీ ఒకే విధంగా పరిగణించాలి. ● మీ సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌ల కోసం GPS లొకేషన్ ఫీచర్‌కి యాక్సెస్ ఆపేయండి. ● మీ ఆర్థిక లావాదేవీలను ఉపయోగించే సమయాల్లో రిక్వెస్ట్ చేయడం, రిప్లై ఇవ్వడం వంటివి చేసే ముందు మీ ఇమెయిల్ హెడర్‌లను కూడా చెక్ చేయడం అలవాటు చేసుకోండి.

సోషల్ మీడియాలో మోసం జరిగితే..

- Instagram లో అయితే https://help.instagram.com/370054663112398
- YouTube లో అయితే https://support.google.com/youtube/answer/2801947?hl=en
- Facebook లో అయితే https://www.facebook.com/help/contact/169486816475808
- LinkedIn లో అయితే https://www.linkedin.com/help/linkedin/answer/61664/reporting-fake-profiles?lang=en రిపోర్ట్ చేయచ్చు.

సైబర్ క్రైమ్ పోర్టల్...

పరిస్థితి తీవ్రతను బట్టి జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్ https://www.cybercrime.gov.inలో రిపోర్ట్ చేయచ్చు.
మోసం చేయడానికి రకరకాల వేషాలు వేయడం, పరువు తీయడం లేదా మోసం చేయడం లేదా మోసం చేయాలనే ఉద్దేశ్యంతో తప్పుడు గుర్తింపు ఉండటం.. వంటివి నేరంగా ఈ పోర్టల్‌లో ఉంటుంది.



ఇన్‌పుట్స్: అనీల్ రాచమల్ల,
డిజిటల్ వెల్‌బియింగ్ ఎక్స్‌పర్ట్,
ఎండ్ నౌ ఫౌండేషన్



నీనా గుప్తా

నేడు జాతీయ గణిత దినోత్సవం

అందమైన అంకెల లోకంలో అపురూప విజేత

చిన్నప్పుడు బొమ్మలతో కాదు లెక్కలతో ఆడుకుంది నీనాగుప్తా.
జటిలమైన గణిత సమస్యల పరిష్కారంలో తనదైన ప్రతిభ చూపి యువతరానికి ఆదర్శంగా నిలుస్తుంది.
‘గణితంలో నైపుణ్యం సాధించడానికి ఒక జీవితకాలం చాలదు’ అంటున్న నీనాగుప్తా గణితంపై ఆసక్తి,
పరిశోధనలనే తన జీవనవిధానంగా మార్చుకుంది...

చాలామంది పిల్లల మాదిరిగా చిన్నప్పుడు లెక్కలు అంటే భయపడేది కాదు నీనాగుప్తా. లెక్కలతోనే ఆడుకునేది. పాడుకునేది. తల్లిదండ్రులకు గణితం అంటే ఇష్టం. నీనాకు చిన్నవయసులోనే గణితంలో మెలకువలు నేర్పించి, ఆ సబ్జెక్ట్ అంటే ఇష్టమయ్యేలా చేశారు. స్కూల్లో మ్యాథ్స్‌లో ఎప్పుడూ తానే మొదటి స్థానంలో నిలిచేది.

గణితశాస్త్రవేత్త ఆస్కార్ జరిస్కి లెక్క ఒకటి 65 సంవత్సరాలుగా పరిష్కారం కాకుండా ఉంది. ఈ సమస్యను పరిష్కరించి 2014లో ‘యంగ్ సైంటిస్ట్’ అవార్డ్ అందుకుంది నీనా. 2019లో ‘శాంతిస్వరూప్ భట్నాగర్’ అవార్డ్ అందుకుంది. గత సంవత్సరం అత్యున్నత పురస్కారం అయిన ‘రామానుజన్ ప్రైజ్’ కు ఎంపికైంది.

‘నీనాగుప్తా పరిశోధనలు బీజగణితానికి సంబంధించి ఆమె నైపుణ్యానికి అద్దం పడతాయి. భావితరాలకు ఉపయోగపడతాయి’ అని గుప్తాను కొనియాడింది రామానుజన్ అవార్డ్ కమిటీ.

‘మ్యాథ్స్‌లో ఒక సవాలు మనకు స్వాగతం పలుకుతుంది. ఆ సవాలును స్వీకరించి విజయం సాధించినప్పుడు వచ్చే ఆనందం మాటల్లో చెప్పలేనిది’ అంటుంది నీనా.

‘చదివించింది చాలు. పెద్ద చదువులు ఎందుకు’ అని నీనా గురించి ఇరుగు,పొరుగు మాటలను తల్లి లెక్క చేయలేదు. కూతురుకు అన్ని విధాలుగా అండగా నిలబడింది.

‘ఒక మహిళకు మరో మహిళ అండగా ఉంటే, ధైర్యం ఇస్తే ఎన్నో విజయాలు సాధించవచ్చు’ అని తల్లిని ఉద్దేశించి అంటుంది నీనా.



గణితంలో ప్రతిభకు గాను 2022 మార్చి 8న రాష్ట్రపతి చేతుల మీదుగా ‘నారీ శక్తి పురస్కారం’ అందుకుంటున్న నీనా గుప్తా

‘నీనా పనితీరును పదిహేను సంవత్సరాలుగా గమనిస్తున్నాను. ఎప్పటికప్పుడు తన ప్రతిభను మరింతగా మెరుగుపరుచుకుంటూనే ఉంది. ఆమెకు గణితమే ప్రపంచం’ అన్నారు ఐఎస్ఐ, కోల్‌కతా ప్రొఫెసర్ అమర్త్య కుమార్ గుప్తా.

‘అభిరుచిగా మొదలైన గణితం ఇప్పుడు నా జీవనవిధానంగా మారింది’ అంటున్న 38 సంవత్సరాల నీనాగుప్తా ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ (ఐఎస్ఐ), కోల్‌కతాలో ప్రొఫెసర్‌గా పనిచేస్తుంది.

తాజాగా ఫోర్బ్స్ ఇండియా ఉమెన్-పవర్ (సెల్ఫ్‌మేడ్ ఉమెన్-2022) జాబితాలో చోటు సంపాదించింది.

‘ఈ గుర్తింపు నా బాధ్యతను మరింత పెంచింది’ అంటున్న నీనాగుప్తా గణితంపై భయాలను తొలగించి, అందరికీ చేరువ చేయడానికి అవసరమైన భవిష్యత్ ప్రణాళికకు రూపకల్పన చేసుకుంది.



అడిలైడ్ టోర్నీతో సానియా సీజన్ షురూ

భారత మహిళా టెన్నిస్ స్టార్ సానియా మీర్జా 2023 సీజన్‌ను అడిలైడ్ ఇంటర్నేషనల్ ఓపెన్ టోర్నీ ద్వారా ప్రారంభించనుంది. జనవరి 1 నుంచి 7 వరకు ఆస్ట్రేలియాలో జరిగే ఈ టోర్నీలో సానియా కజకిస్తాన్ ప్లేయర్ అన్నా డానిలినాతో కలిసి డబుల్స్ విభాగంలో బరిలోకి దిగనుంది. ఈ మేరకు నిర్వాహకులు ఈ టోర్నీలో ఆడుతున్న క్రీడాకారిణుల జాబితాను విడుదల చేశారు. ఈ ఏడాది సానియా 16 టోర్నీలలో పోటీపడగా... రెండు టోర్నీలలో (చార్ల్స్‌టన్ ఓపెన్, స్ట్రాస్‌బర్గ్ ఓపెన్) రన్నరప్ ట్రోఫీతో సంతృప్తి పడింది. ఆమె 26 మ్యాచ్‌ల్లో గెలిచి, 16 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది.

కెరీర్ బెస్ట్ ర్యాంక్‌లో అక్షర్ పటేల్



అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ టెస్ట్ బౌలర్ల ర్యాంకింగ్స్‌లో భారత స్పిన్నర్ అక్షర్ పటేల్ కెరీర్ బెస్ట్ 18వ ర్యాంక్‌ను అందుకున్నాడు. తాజా ర్యాంకింగ్స్‌లో అక్షర్ 20 స్థానాలు పురోగతి సాధించాడు. బంగ్లాదేశ్‌తో తొలి టెస్ట్‌లో అక్షర్ ఐదు వికెట్లు పడగొట్టాడు. బుమ్రా నాలుగో ర్యాంక్‌లో, అశ్విన్ ఐదో ర్యాంక్‌లో కొనసాగుతున్నారు. బ్యాటర్స్ ర్యాంకింగ్స్‌లో పుజారా, గిల్ 10 స్థానాల చొప్పున ఎగబాకి వరుసగా 16వ, 54వ ర్యాంక్‌ల్లో నిలిచారు.



ప్రిక్వార్టర్ ఫైనల్లో రష్మిక

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మహిళల టోర్నీలో హైదరాబాద్ అమ్మాయి శ్రీవల్లి రష్మిక ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. నవీ ముంబైలో బుధవారం జరిగిన సింగిల్స్ తొలి రౌండ్‌లో రష్మిక 6-0తో రియా భాటియా (భారత్)పై గెలిచింది. రష్మిక తొలి సెట్ గెలిచాక రియా గాయం కారణంగా వైదొలగడంతో రెండో సెట్‌ను నిర్వహించలేదు. డబుల్స్ తొలి రౌండ్‌లో రష్మిక-వైదేహి (భారత్) జోడీ 4-6, 6-4, 10-8తో శ్రావ్య శివాని-జెన్నిఫర్ (భారత్) ద్వయంపై నెగ్గి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. హైదరాబాద్‌కే చెందిన సౌజన్య బవిశెట్టి డబుల్స్‌లో క్వార్టర్ ఫైనల్లోకి చేరింది. తొలి రౌండ్‌లో సౌజన్య-షర్మదా (భారత్) జోడీ 6-4, 7-6 (11/9)తో సహజ-సోహా (భారత్) జంటను ఓడించింది.

శ్రీనిధి డెక్కన్ ఎఫ్‌సీ గెలుపు



రామ్లున్‌చుంగా

ఇంఫాల్: భారత దేశవాళీ ఫుట్‌బాల్ టోర్నీ ఐ-లీగ్‌లో హైదరాబాద్‌కు చెందిన శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) ఆరో విజయం నమోదు చేసింది. బుధవారం జరిగిన తొమ్మిదో లీగ్ మ్యాచ్‌లో శ్రీనిధి డెక్కన్ ఎఫ్‌సీ 1-0 గోల్ తేడాతో నెరోకా ఎఫ్‌సీ జట్టును ఓడించింది. ఆట 47వ నిమిషంలో సబ్‌స్టిట్యూట్ రామ్లున్‌చుంగా శ్రీనిధి జట్టుకు గోల్ అందించాడు. ప్రస్తుతం శ్రీనిధి జట్టు 19 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో ఉంది.

26న రాష్ట్ర ర్యాంకింగ్ చెస్ టోర్నీ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర చెస్ సంఘం (టీఎస్‌సీఏ) ఆధ్వర్యంలో ఈనెల 26న తెలంగాణ రాష్ట్ర ర్యాంకింగ్ చెస్ టోర్నీ జరగనుంది. లాల్‌బహదూర్ స్టేడియంలోని యోగా హాల్ వేదికగా జరిగే అండర్-7, 9, 11, 13, 15, 17, 19 బాలబాలికల విభాగాల్లో ఈ టోర్నీని నిర్వహిస్తారు. స్పాట్ ఎంట్రీలు స్వీకరించరు. టోర్నీలో పాల్గొనాలనుకునే వారు 7337578899 లేదా 7337399299 ఫోన్ నంబర్లలో నిర్వాహకులను సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని టీఎస్‌సీఏ అధ్యక్షుడు కేఎస్ ప్రసాద్ కోరారు.

2-0 లక్ష్యంగా...

జోరు మీదున్న భారత్ | **నేటి నుంచి బంగ్లాదేశ్‌తో రెండో టెస్టు** | **బంగ్లా పోటీనిచ్చేనా!** | **ఉదయం 9 నుంచి సోనీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం**

వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌కు అర్హత సాధించే ప్రయత్నంలో భారత్‌కు మరో సవాల్. అందుబాటులో ఉన్న ఆరు టెస్టుల్లో ఐదు గెలిస్తే ఖాయంగా డబ్ల్యూటీసీ ఫైనల్ చేరే అవకాశం ఉన్న టీమిండియా ఇందులో మొదటి అంకాన్ని పూర్తి చేసింది. స్వదేశంలో ఆస్ట్రేలియాతో నాలుగు మ్యాచ్‌ల సిరీస్ హోరాహోరీగా సాగే అవకాశం ఉండటంతో దానికి ముందు వీలైనన్ని ఎక్కువ పాయింట్లు తమ ఖాతాలో వేసుకోవాలని జట్టు భావిస్తోంది. ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్‌తో చివరిదైన రెండో టెస్టులోనూ విజయమే లక్ష్యంగా జట్టు బరిలోకి దిగుతోంది. గత మ్యాచ్ చివర్లో కాస్త పట్టుదల కనబర్చగలిగిన బంగ్లాదేశ్ సొంతగడ్డపై ఈ మ్యాచ్‌లోనైనా ఎలాంటి పోటీనిస్తుందో చూడాలి.

మిర్పూర్: బంగ్లాదేశ్‌పై తొలి టెస్టులో ఘన విజయం సాధించిన భారత్ అదే జోరును కొనసాగించాలని పట్టుదలగా ఉంది. నేటి నుంచి షేర్-ఎ-బంగ్లా స్టేడియంలో జరిగే రెండో టెస్టులో భారత్, బంగ్లాదేశ్ తలపడనున్నాయి. బలబలాల దృష్ట్యా చూస్తే మన జట్టు అన్ని రంగాల్లో ప్రత్యర్థి కంటే మెరుగ్గా ఉంది. గత మ్యాచ్ తరహాలో ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబరిస్తే ఈ మ్యాచ్ కూడా టీమిండియా ఖాతాలోకి చేరడం ఖాయం. అయితే ఈ సారైనా కాస్త మెరుగైన ప్రదర్శన ఇస్తే సొంతగడ్డపై బంగ్లా పరువు దక్కించుకోగలదు.

అదే జట్టుతో...

రెగ్యులర్ కెప్టెన్ రోహిత్ శర్మ కోలుకొని ఈ మ్యాచ్‌కు సిద్ధమై ఉంటే తుది జట్టు ఎంపిక కష్టంగా మారేదేమో! కానీ రోహిత్ దూరం కావడంతో మరో మాటకు తావు లేకుండా తొలి టెస్టు ఆడిన టీమ్‌నే భారత్ కొనసాగించవచ్చు. ప్రాక్టీస్‌లో రాహుల్ గాయపడి కొంత చర్చ మొదలైనా... అది తీవ్రమైంది కాదని, రాహుల్ ఆడతాడని బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోడ్ చెప్పేయడంతో స్పష్టత వచ్చేసింది. నిజానికి ఇప్పుడు అందరికంటే ముందుగా ఆట అవసరం ఉన్నది రాహుల్‌కే. తొలి టెస్టు స్కోరు బోర్డు చూస్తే రాహుల్ వైఫల్యమే స్పష్టంగా కనిపిస్తోంది. రెండు ఇన్నింగ్స్‌లలోనూ విఫలమైన అతను ఈ సారైనా తన బ్యాటింగ్‌తో చెప్పుకోదగ్గ ప్రదర్శన చేయడం ఎంతో అవసరం. గిల్, పుజారా శతకాలతో సత్తా చాటగా శ్రేయస్, పంత్ రాణించారు. కోహ్లి కూడా తన స్థాయికి తగినట్లుగా ఆడితే భారత్ భారీ స్కోరు సాధించడం ఖాయం. బౌలింగ్‌లో అనూహ్యంగా అశ్విన్ నిరాశపర్చాడు. బ్యాటింగ్‌లో రాణించినా, తొలి ఇన్నింగ్స్‌లో ఒక్క వికెట్ కూడా తీయలేకపోయిన అశ్విన్ రెండో ఇన్నింగ్స్‌లో ఒక వికెట్‌తో సరిపెట్టాడు. స్పిన్‌కు అనుకూలించే పిచ్‌పై అతనితో పాటు అక్షర్, కుల్దీప్ చెలరేగితే బంగ్లాకు కష్టాలు తప్పవు. పేస్ విభాగంలో సిరాజ్, ఉమేశ్‌ల స్థానానికి ఢోకా లేదు. అయితే 12 ఏళ్ల తర్వాత టెస్టు జట్టులోకి ఎంపికైన జైదేవ్ ఉనాద్కట్ ఆనందం ఎంపికకే పరిమితమయ్యేలా కనిపిస్తోంది. పరిస్థితి చూస్తుంటే తుది జట్టులో అతనికి చోటు కష్టమే!

తస్కీన్‌కు చోటు...

ఇదే పట్టుదల కాస్త మొదటి ఇన్నింగ్స్‌లో కూడా చూపిస్తే ఎలా ఉండేదో... గత టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో తమ ఆట చూసిన తర్వాత బంగ్లాదేశ్ బహుశా ఇదే అనుకొని ఉంటుంది. 513 పరుగుల భారీ లక్ష్యం కనిపిస్తున్నా... ఆ జట్టు పూర్తిగా చేతులెత్తేయలేదు. 124 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యం సహా 324 పరుగుల వరకు పోరాడగలిగింది. ఇదే స్ఫూర్తితో బ్యాటింగ్ చేస్తే ఈ టెస్టులో కాస్త మెరుగైన ఫలితం రాబట్టవచ్చు. ఓపెనర్లు జాకీర్ హసన్, నజ్ముల్‌తో పాటు బ్యాటింగ్‌లో షకీబ్ అల్ హసన్ కూడా రాణించడం సానుకూలాంశం. అయితే ఇద్దరు ప్రధాన బ్యాటర్లు ముష్ఫికర్ రహీమ్, లిటన్ దాస్ తేలిపోయారు. వీరిద్దరు మిడిలార్డర్‌లో నిలబడితేనే జట్టు కుప్పకూలి పోకుండా ఉంటుంది. వన్డే సిరీస్ తరహాలో ఆల్‌రౌండర్ మెహదీ హసన్ మిరాజ్ నుంచి బ్యాటింగ్‌లో కూడా మంచి ప్రదర్శనను టీమ్ మేనేజ్‌మెంట్ ఆశిస్తోంది. బౌలింగ్‌లో బంగ్లా కూడా ముగ్గురు స్పిన్నర్లు, ఇద్దరు పేసర్లతోనే దిగనుంది. షకీబ్ పూర్తి ఫిట్‌గా మారాడని, బౌలింగ్ చేస్తాడని కోచ్ డొనాల్డ్ ప్రకటించడం సానుకూలాంశం. గాయంతో ఉన్న పేసర్ ఇబాదత్ స్థానంతో తస్కీన్ తుది జట్టులోకి వస్తాడు.



కోహ్లి, కేఎల్ రాహుల్

తుది జట్ల వివరాలు (అంచనా)

భారత్: రాహుల్ (కెప్టెన్), గిల్, పుజారా, కోహ్లి, పంత్, శ్రేయస్, అక్షర్, అశ్విన్, కుల్దీప్, ఉమేశ్, సిరాజ్. **బంగ్లాదేశ్:** షకీబ్ (కెప్టెన్), నజ్ముల్, జాకీర్, యాసిర్, లిటన్ దాస్, ముష్ఫికర్, నూరుల్, మెహదీ హసన్, తైజుల్, తస్కీన్, ఖాలెద్.

16 పుజారా మరో 16 పరుగులు చేస్తే టెస్టుల్లో 7 వేల పరుగులు పూర్తి చేసుకుంటాడు.

పిచ్, వాతావరణం

మ్యాచ్‌లో ఎక్కువ భాగం స్పిన్నర్లకే అనుకూలం. అయితే ఆరంభంలో బ్యాటింగ్‌కు బాగా అనుకూలిస్తూ స్వేచ్ఛగా పరుగులు చేసేందుకు అవకాశం ఉంది. టాస్ గెలిచిన జట్టు బ్యాటింగ్ ఎంచుకోవడం సరైన నిర్ణయం. వర్ష సూచన లేదు.

రహానే డబుల్ సెంచరీ

- ముంబై 651/6 డిక్లేర్డ్
- హైదరాబాద్ 173/6



ముంబై: కెప్టెన్ అజింక్య రహానే (204; 26 ఫోర్లు, 3 సిక్స్‌లు) డబుల్ సెంచరీ... సర్ఫరాజ్ ఖాన్ (126 నాటౌట్; 18 ఫోర్లు) అజేయ శతకం సాధించడంతో... హైదరాబాద్‌తో జరుగుతున్న రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో ముంబై తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు సాధించింది. ఓవర్‌నైట్ స్కోరు 457/3తో రెండో రోజు ఆట కొనసాగించిన ముంబై... మరో 194 పరుగులు జోడించి మూడు వికెట్లు కోల్పోయి 6 వికెట్లకు 651 పరుగుల వద్ద తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. రహానే, సర్ఫరాజ్ నాలుగో వికెట్‌కు 196 పరుగులు జతచేశారు. రహానే ఫస్ట్‌క్లాస్ కెరీర్‌లో ఇది నాలుగో డబుల్ సెంచరీ. హైదరాబాద్ బౌలర్లలో కార్తికేయ మూడు వికెట్లు తీశాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన హైదరాబాద్ ఆట ముగిసే సమయానికి 6 వికెట్లు కోల్పోయి 173 పరుగులు చేసి కష్టాల్లో పడింది. తన్మయ్ (40; 5 ఫోర్లు), రోహిత్ రాయుడు (72 బ్యాటింగ్; 9 ఫోర్లు) రాణించగా... అక్షత్ రెడ్డి (12), మికిల్ జైస్వాల్ (6), రవితేజ (6), రాహుల్ బుద్ధి (18), ప్రతీక్ రెడ్డి (7) తక్కువ స్కోరుకే వెనుదిరిగారు. ముంబై బౌలర్ షమ్స్ ములానీ 5 వికెట్లు తీసుకున్నాడు.

తమిళనాడు 273/4

కోయంబత్తూరు: ఓపెనర్ సాయి సుదర్శన్ (180 బంతుల్లో 113; 10 ఫోర్లు) సెంచరీ సాధించడంతో... ఆంధ్ర జట్టుతో జరుగుతున్న రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో తమిళనాడు ఆధిక్యం దిశగా సాగుతోంది. కెప్టెన్ బాబా అపరాజిత్ (88; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) కూడా రాణించడంతో రెండో రోజు ఆట ముగిసే సమయానికి తమిళనాడు తొలి ఇన్నింగ్స్‌లో 77 ఓవర్లలో 4 వికెట్లు నష్టపోయి 273 పరుగులు సాధించింది. ఆంధ్ర తొలి ఇన్నింగ్స్ స్కోరుకు తమిళనాడు మరో 24 పరుగుల దూరంలో ఉంది. క్రీజులో వాషింగ్టన్ సుందర్ (7 బ్యాటింగ్), విజయ్ శంకర్ (0 బ్యాటింగ్) ఉన్నారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 277/5తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్ర జట్టు మరో 20 పరుగులు జోడించి మిగతా ఐదు వికెట్లు కోల్పోయింది.

వైదొలగే యోచనలో 'బైజూస్'

మార్చి 2023 వరకు కొనసాగాలని కోరిన బీసీసీఐ



ముంబై: భారత క్రికెట్ జట్టు ప్రధాన స్పాన్సర్‌గా ఉన్న ఎడ్యుటెక్ సంస్థ 'బైజూస్' ఈ ఒప్పందాన్ని ముందే రద్దు చేసుకునే యోచనలో ఉంది. దీనికి సంబంధించి గత నెలలోనే బోర్డుకు ఆ సంస్థ లేఖ రాసింది. నవంబర్ 2023 వరకు అమల్లో ఉండేలా సుమారు రూ. 290 కోట్లతో గత జూన్‌లోనే బీసీసీఐతో బైజూస్ ఒప్పందం కుదుర్చుకుంది. అయితే ఆ సంస్థ ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలు, ఇతర కారణాలతో స్పాన్సర్‌షిప్‌ను కొనసాగించరాదని భావిస్తోంది. ఈ అంశంపై బుధవారం జరిగిన బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో చర్చ జరిగింది. చివరకు 2023 మార్చి వరకు స్పాన్సర్‌షిప్ కొనసాగించాలని బైజూస్‌కు బీసీసీఐ విజ్ఞప్తి చేసింది. మరో వైపు కిట్ స్పాన్సర్‌గా ఉన్న ఎంపీఎల్ స్పోర్ట్స్ కూడా తమ కిట్ ఒప్పంద హక్కులను మరో సంస్థకు వెంటనే బదలాయించేందుకు అనుమతించమని బోర్డును కోరింది. అదే మొత్తానికి కేవల్ కిరణ్ క్లాతింగ్ లిమిటెడ్ (కేకేసీఎల్)కు కిట్ స్పాన్సర్‌షిప్ హక్కులు ఇవ్వమని కోరింది. దీనిపై కూడా చర్చించిన బోర్డు... ఉన్నపళంగా కిట్ స్పాన్సర్ పేరు మార్పుల వల్ల సమస్యలు వస్తాయి కాబట్టి ఎంపీఎల్‌కు కూడా మార్చి 31, 2023 వరకు కొనసాగాలని విజ్ఞప్తి చేసింది.


సినిమా



చిరంజీవి, కృష్ణవంశీ

అందరికీ ఆప్తుణ్ణి...

'నేనొక నటుణ్ణి.. చమ్కీల బట్టలేసుకుని.. అట్ట కిరీటం పెట్టుకుని...' అంటూ 'రంగ మార్తాండ' చిత్రం కోసం షాయరీ చెప్పారు చిరంజీవి. కృష్ణవంశీ దర్శకత్వంలో ప్రకాశ్‌రాజ్, బ్రహ్మానందం, రమ్యకృష్ణ ప్రధాన పాత్రల్లో రూపొందిన చిత్రం 'రంగ మార్తాండ'. అనసూయ, రాహుల్ సిప్లిగంజ్, శివానీ రాజశేఖర్, ఆదర్శ్ బాలకృష్ణ, అలీ రెజా కీలక పాత్రలు పోషించారు. రంగస్థల కళాకారుల జీవితాల నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రంలోని షాయరీని బుధవారం విడుదల చేశారు. చిరంజీవి చెప్పిన ఈ షాయరీని రచయిత లక్ష్మీభూపాల్ రాశారు. 'నేనొక నటుణ్ణి..' అంటూ మొదలయ్యే ఈ షాయరీ 'నేనొక నటుణ్ణి.. అప్సరసల ఇంద్రుడ్ని, అందుబాటు చంద్రుడ్ని, అభిమానుల దాసుణ్ణి.. అందరికీ ఆప్తుణ్ణి..' అంటూ సాగుతుంది. వచ్చే ఏడాది రిలీజ్ కానున్న ఈ చిత్రానికి సంగీతం: ఇళయరాజా.



రజనీకాంత్

ఫిబ్రవరిలో లాల్ సలామ్‌లోకి...

'లాల్ సలామ్' గ్రౌండ్‌లోకి రజనీకాంత్ ఎంట్రీ ఫిబ్రవరిలో అని సమాచారం. విష్ణు విశాల్, విక్రాంత్ హీరోలుగా రజనీకాంత్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'లాల్‌సలామ్'. క్రికెట్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమాకు రజనీకాంత్ కుమార్తె ఐశ్వర్యా రజనీకాంత్ దర్శకత్వం వహిస్తున్నారు. ఆ మధ్య ఓ పది రోజులు షూటింగ్ చేశారు. అయితే రజనీ లేని సీన్స్‌ని చిత్రీకరించారు. ఫిబ్రవరి మొదటి వారంలో ఈ సినిమా సెట్స్‌లోకి రజనీ అడుగుపెడతారట. ఇక '3' (2012) చిత్రం ద్వారా దర్శకురాలిగా పరిచయమైన ఐశ్వర్య ఆ తర్వాత 'వై రాజా వై' (2015), 'రాజా రాణి' (2017) చిత్రాలకు దర్శకత్వం వహించారు. ఐదేళ్ల గ్యాప్ తర్వాత ఆమె తెరకెక్కిస్తున్న చిత్రం 'లాల్ సలామ్'.

మా బావ మనోభావాల్...



బాలకృష్ణ

బాలకృష్ణ, శ్రుతీహాసన్ జంటగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'వీరసింహారెడ్డి'. ఒక పాట మినహా ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ సినిమా జనవరి 12న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమాలోని స్పెషల్ సాంగ్ 'మా బావ మనోభావాల్..' లిరికల్ వీడియోను ఈ నెల 24న రిలీజ్ చేయనున్నట్లు బుధవారం ప్రకటించి, ఈ పాటలోని పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ స్పెషల్ సాంగ్‌లో బాలకృష్ణ, చంద్రికా రవి స్టెప్పులు వేశారు. ఈ చిత్రానికి సంగీతం: తమన్, కెమెరా: రిషి పంజాబీ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: చందు రావిపాటి.

యూనిట్‌కి రాజయోగం తీసుకురావాలి

- మారుతి



మారుతి, రామ్ గణపతి

''రాజయోగం' ట్రైలర్ బాగుంది.. ఇందులో రొమాన్స్, యాక్షన్, కామెడీ.. అన్ని కమర్షియల్ అంశాలున్నాయి. నా ఫ్రెండ్ గణపతి ఈసారి పూర్తి కమర్షియల్ సినిమా చేశాడు. ఈ సినిమా హిట్ అయి యూనిట్‌కి రాజయోగం తీసుకురావాలి'' అని డైరెక్టర్ మారుతి అన్నారు. సాయి రోనక్ హీరోగా అంకిత సాహా, బిస్మి నాస్ హీరోయిన్లుగా రామ్ గణపతి దర్శకత్వం వహించిన చిత్రం 'రాజయోగం'. మణి లక్ష్మణ్ రావు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 30న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా 'రాజయోగం' ట్రైలర్‌ను మారుతి రిలీజ్ చేశారు. ఈ చిత్రానికి సంగీతం: అరుణ్ మురళీధరన్, కెమెరా: విజయ్ సి. కుమార్, సహనిర్మాతలు: డా. శ్యామ్ లోహియా, నందకిషోర్ దారక్.

పది నిమిషాలు వినగానే ఓకే చెప్పా!

- శ్రీలీల



''వ్యక్తిగతంగా నాకు వినోదంతో కూడిన సినిమాలంటే ఇష్టం. 'ధమాకా' చిత్రం మంచి ఎంటర్‌టైనర్.. అందుకే పది నిమిషాలు కథ వినగానే సినిమా చేసేందుకు ఓకే చెప్పా'' అని హీరోయిన్ శ్రీలీల అన్నారు. రవితేజ హీరోగా త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ధమాకా'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ పతాకాలపై టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ సినిమా రేపు (శుక్రవారం) విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రకథానాయిక శ్రీలీల చెప్పిన విశేషాలు.

- త్రినాథరావుగారు 'హలో గురు ప్రేమ కోసమే' చిత్రంలో ఓ పాత్ర కోసం నన్ను సంప్రదించారు కానీ కుదరలేదు. ఆ తర్వాత నేను నటించిన 'పెళ్లి సందడి' విడుదల కాక ముందే 'ధమాకా' అవకాశం వచ్చింది. త్రినాథరావుగారితో సినిమా చేయడం హ్యాపీ.
- రాఘవేంద్ర రావుగారి 'పెళ్లి సందడి'తో తెలుగుకి పరిచయం కావడం నా అదృష్టం. నా రెండో సినిమానే (ధమాకా) రవితేజగారితో చేయడం లక్కీగా భావిస్తున్నాను. అందుకే రోజూ దేవుడికి థ్యాంక్స్ చెబుతున్నాను. రవితేజగారికి నేను పెద్ద ఫ్యాన్‌ని. ఆయన నటించిన 'కిక్, విక్రమార్కుడు' సినిమాలను ఎన్నిసార్లు చూశానో లెక్కే లేదు.
- 'ధమాకా'లో ప్రణవి పాత్ర చేశాను. సినిమాలో ప్రణవికి ఇద్దరు హీరోలంటే ఇష్టం.. అయితే ముగింపు ఎలా ఉంటుందనేది ఆసక్తిగా ఉంటుంది. 'భీమ్స్' అద్భుతమైన సంగీతం ఇచ్చారు. చిన్నప్పటి నుంచి భరతనాట్యం, డ్యాన్స్ నేర్చుకోవడం వల్ల డ్యాన్స్ చేయడాన్ని ఎంజాయ్ చేస్తాను.
- ఒకవైపు సినిమాలు చేస్తూనే ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతున్నాను. ఎంబీబీఎస్ పూర్తవగానే పీజీ చేయాలనుకుంటున్నాను. ప్రస్తుతం బాలకృష్ణగారు, వైష్ణవ్ తేజ్, రామ్, నితిన్ సినిమాలతో పాటు వారాహి ప్రొడక్షన్స్‌లో ఓ సినిమా చేస్తున్నాను.

యుగాంతం నేపథ్యంలో...



కార్తికేయ

గుమ్మకొండ కార్తికేయ, నేహా శెట్టి జంటగా క్లాక్స్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'బెదురులంక 2012'. సి. యువరాజ్ సమర్పణలో ముప్పానేని రవీంద్ర బెనర్జీ నిర్మించిన ఈ చిత్రం షూటింగ్ పూర్తయింది. బుధవారం 'ద వరల్డ్ ఆఫ్ బెదురులంక 2012' పేరుతో ఓ వీడియోను రిలీజ్ చేశారు. దర్శకుడు క్లాక్స్ మాట్లాడుతూ– ''ఓ పల్లెటూరిలో 2012 యుగాంతం నేపథ్యంలో జరిగే కథతో ఈ సినిమాను రూపొందించాం. కార్తికేయ, నేహా శెట్టిల మధ్య సీన్స్ అద్భుతంగా ఉంటాయి'' అన్నారు. ''డ్రామెడీ (డ్రామా ప్లస్ కామెడీ) జానర్ ఫిల్మ్ ఇది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి'' అన్నారు రవీంద్ర. ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ, కెమెరా: సాయిప్రకాశ్ ఉమ్మడిసింగు, సన్నీ కూరపాటి, సహనిర్మాతలు: అవనీంద్ర ఉపద్రష్ట, వికాస్ గున్నల, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: దుర్గారావు గుండా.

అమ్మవారి సాక్షిగా....



వెంకట్, శ్రీజిత

వెంకట్ కిరణ్, శ్రీజిత ఘోష్ జంటగా సంజీవ్ మేగోటి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'ఎర్రగుడి'. 'అమ్మవారి సాక్షిగా అల్లుకున్న ప్రేమకథ' అన్నది ఉపశీర్షిక. ఘంటా శ్రీనివాసరావు నిర్మిస్తున్న ఈ సినిమా హైదరాబాద్‌లో ప్రారంభమైంది. తొలి సీన్‌కి నిర్మాత జేవీఆర్ కెమెరా స్విచ్చాన్ చేయగా, జర్నలిస్ట్ ప్రభు క్లాప్ ఇచ్చారు. దర్శక–నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ దర్శకత్వం వహించారు. ''1975 ప్రాంతంలో మొదలయ్యే ఈ సినిమా 1992తో ముగుస్తుంది. గ్రామీణ నేపథ్యంలో అమ్మవారి చుట్టూ అల్లుకున్న ప్రేమకథ ఇది'' అన్నారు సంజీవ్ మేగోటి. ''పర్‌ఫెక్ట్ ప్లానింగ్‌తో ఈ సినిమా నిర్మిస్తున్నాం'' అన్నారు శ్రీనివాసరావు.

ఆయన అలా అనడం నాకు ఆశీర్వాదం

- అనుపమా పరమేశ్వరన్



''ప్రేమ లేకుండా ఈ ప్రపంచమే లేదు. భావోద్వేగాలు లేని జీవితమూ ఉండదు. '18 పేజెస్' వంద శాతం స్వచ్ఛమైన ప్రేమకథ. అన్ని వర్గాల వారికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది'' అని హీరోయిన్ అనుపమా పరమేశ్వరన్ అన్నారు. నిఖిల్ సిద్ధార్థ హీరోగా సూర్యప్రతాప్ పల్నాటి దర్శకత్వంలో రూపొందిన చిత్రం '18 పేజెస్'. డైరెక్టర్ సుకుమార్ కథ అందించారు. అల్లు అరవింద్ సమర్పణలో జీఏ 2 పిక్చర్స్– సుకుమార్ రైటింగ్స్‌పై బన్నీ వాసు నిర్మించిన ఈ సినిమా రేపు (శుక్రవారం) రిలీజవుతోంది. ఈ సందర్భంగా చిత్రకథానాయిక అనుపమా పరమేశ్వరన్ చెప్పిన విశేషాలు.

- సూర్యప్రతాప్‌గారు చెప్పిన '18 పేజెస్' కథ ఎగ్జయిటింగ్‌గా అనిపించడంతో వెంటనే ఓకే చెప్పాను. 'కార్తికేయ 2'కి ముందే '18 పేజెస్'కి సైన్ చేశాను. 'కార్తికేయ 2' అడ్వెంచరస్ మూవీ అయితే '18 పేజెస్' ఫీల్ గుడ్ లవ్‌స్టోరీ. 'కార్తికేయ 2' ఇక్కడ సూపర్ హిట్ కావడంతో పాటు హిందీలోనూ ఘనవిజయం సాధించింది. 'కార్తికేయ 2' బ్లాక్ బస్టర్ కావడంతో మా జంట (నిఖిల్, అనుపమ)కి మంచి పేరొచ్చింది. '18 పేజెస్' చాలా మంచి సినిమా.. 'కార్తికేయ 2'లాగే ఈ మూవీ సూపర్ హిట్టవుతుందనే నమ్మకంతో ఉన్నాం.
- సుకుమార్‌గారి 'రంగస్థలం' చాన్స్ మిస్సయినప్పుడు చాలా బాధపడ్డాను. అయితే ఏ సినిమా కథ అయినా మనం ఎంచుకోం.. ఆ కథే మనల్ని ఎంచుకుంటుంది. 'రంగస్థలం' మిస్ అయినా ఇప్పుడు సుకుమార్‌గారు రాసిన పాత్రలో నటించడం సంతోషంగా ఉంది. ఈ సినిమాలో నేను చేసిన నందిని పాత్ర గుర్తుండిపోతుంది. సుకుమార్‌గారి కథకి సూర్యప్రతాప్‌గారు వందశాతం న్యాయం చేశారు కాబట్టే సినిమా బాగా వచ్చింది.
- '18 పేజెస్'లోని లవ్ స్టోరీ నా ఫేవరెట్. వాట్సప్, ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా ట్రెండ్ నడుస్తున్న ఈ టైమ్‌లో మొబైల్ లేకుండా ఒక్క రోజు కూడా చాలామంది ఉండలేరు. అలాంటిది మొబైల్, సోషల్ మీడియా లేకుండా ఉండే ఒక అమాయకమైన నందిని పాత్ర నా మనసుకు బాగా దగ్గరగా అనిపించింది.
- 'నాకు అనుపమలాంటి కూతురు ఉంటే బాగుండు' అని అల్లు అరవింద్‌గారు అనడం పెద్ద ఆశీర్వాదంగా భావిస్తున్నాను. ఆయన నన్ను కూతురిలా బాగా చూసుకుంటారు. అందుకే మా కజిన్స్ చాలామంది ఆయన్ని మావయ్యా అని పిలుస్తుంటారు (నవ్వుతూ). బన్నీ వాసుగారు మంచి అభిరుచి ఉన్న నిర్మాత.
- నేను ఒప్పుకున్న సినిమాలన్నీ అయిపోయాక.. నటనకు కొద్ది రోజులు గ్యాప్ తీసుకుని, దర్శకుల వద్ద సాంకేతిక అంశాలపై అవగాహన పెంచుకుని, ఆ తర్వాత డైరెక్షన్ చేస్తాను. వీలు కుదిరినప్పుడల్లా కథ రాస్తున్నాను.. అయితే నా డైరెక్షన్‌లో నేను నటించను.

ట్రైన్‌లో ఏం జరిగింది?



ప్రతాప్‌రెడ్డి, అంజి, సన్నీ, సాయికుమార్, దేవ, భరత్

తారకరత్న, ప్రిన్స్, సునీల్, అలీ, సాయికుమార్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఎస్ 5 నో ఎగ్జిట్'. భరత్ కోమలపాటి (సన్నీ కోమలపాటి) దర్శకత్వం వహించారు. ఆదూరి ప్రతాప్ రెడ్డి, దేవ శామ్యూల్, షైక్ రెహీమ్, మెల్కి రెడ్డి గాదె, గౌతమ్ కొండెపూడి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 30న రిలీజవుతోంది. ఈ చిత్రం ట్రైలర్‌ని విడుదల చేశారు. ''ట్రైన్‌లో జరిగే కథే ఈ చిత్రం'' అన్నారు భరత్ కోమలపాటి. ''హారర్ థ్రిల్లర్‌గా రూపొందిన సినిమా ఇది'' అన్నారు నిర్మాతలు. ''ఎంతో మంది దిగ్గజ నటులతో చేశాను. కొత్తవాళ్లతో చేసిన ఈ సినిమా కూడా అంతే సంతృప్తిగా ఉంది'' అన్నారు సాయికుమార్. ''ఈ సినిమా సెట్‌కు వెళ్లినప్పుడు నాకు బ్రేక్ ఇచ్చిన 'ప్రేమ ఖైదీ' చిత్రం గుర్తొచ్చింది. పెద్ద పెద్ద దర్శకులు చేయాల్సిన చిత్రమిది.. కథ అంత బాగుంది'' అన్నారు అలీ. ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽ 635	నిఫ్టీ ▽ 186
61,067	18,199

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)

నాస్‌డాక్	10,713	△	166
డోజోన్స్	33,333	△	483
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,497	△	127
డాక్స్	14,098	△	213
షాంఘై	3,068	▽	5
నికాయ్	26,389	▽	180

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	54,248
బంగారం (99.5 స్వచ్ఛత)	54,031
వెండి (కిలో)	66,898

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.02	83.69
£	యూరో	ఒకటి	86.44	89.49
€	బ్రిటన్ పౌండ్	ఒకటి	99.15	102.46
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	61.76	63.78
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	54.09	56.42
S$	సింగపూర్ డాలర్	ఒకటి	60.30	62.24
SAR	సౌదీ రియాల్	[illegible]	21.09	22.76
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	21.65	23.44
¥	చైనా యువాన్	[illegible]	10.75	12.77

అలాంటి వారెవరైనా దొరికితే తప్పుకుంటా...

ట్విట్టర్ సీఈవో పదవికి రాజీనామాపై మస్క్



న్యూయార్క్: ట్విట్టర్ సీఈవో పదవి నుంచి తప్పుకునే అంశంపై ఎలాన్ మస్క్ ఎట్టకేలకు స్పందించారు. 'ఆ పదవిని చేపట్టేంత మూర్ఖత్వం ఉన్నవారెవరైనా దొరికిన వెంటనే నేను తప్పుకుంటా. కేవలం సాఫ్ట్‌వేర్, సర్వర్ టీమ్‌లను చూసుకుంటా' అంటూ మస్క్ ట్వీట్ చేశారు. తాను ట్విట్టర్ హెడ్‌గా కొనసాగాలా వద్దా చెప్పండంటూ మస్క్ ట్విటర్‌లో రెండు రోజుల క్రితం పోలింగ్ నిర్వహించిన సంగతి తెలిసిందే. ఇందులో 57.5% మంది ఆయన తప్పుకోవాలంటూ ఓటు వేశారు. అయితే ఓటింగ్ ఫలితాలపై తక్షణం మాట్లాడనని మస్క్ 2 రోజుల తర్వాత స్పందించారు. అక్టోబర్‌లో ట్విట్టర్‌ను 44 బిలియన్ డాలర్లకు టేకోవర్ చేసినప్పట్నుంచి కంపెనీ చీఫ్ బాధ్యతల్లో ఆయనే కొనసాగుతున్నారు. టేకోవర్ తర్వాత సీఈవో పరాగ్ అగర్వాల్‌తో పాటు సగం పైగా సిబ్బందిని తొలగించడంతో పాటు మస్క్ కంపెనీలో పలు మార్పులు, చేర్పులు చేస్తున్నారు.

భీమా జ్యువెలర్స్ అమ్మకాల పండుగ

హైదరాబాద్: బంగారు, వజ్రాభరణాల రిటైల్ వ్యాపార సంస్థ భీమా జ్యువెలర్స్ 'డైమండ్స్ ఫ్రమ్ భీమా' అమ్మకాల పండుగ నిర్వహిస్తోంది. డిసెంబర్ 17న ప్రారంభమైన ఈ అద్భుతమైన కార్యక్రమం వచ్చే ఏడాది (2023) జనవరి 8 వరకు జరగనుంది. ప్రారంభ ధర రూ.5,999తో మొదలయ్యే బంగారు, డైమండ్ ఆభరణాల కొనుగోలుపై రూ.15 వేల వరకు (ధరను బట్టి) ప్రయోజనాలను పొందవచ్చు. ప్రస్తుత ట్రెండ్‌కు అనుగుణంగా సంప్రదాయ రీతిలో తీర్చిదిద్దిన వజ్రాభరణాలను కస్టమర్లంతా కొనుగోలు చేయాలని కంపెనీ ఎండీ అభిషేర్ బిందు కోరారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

22-12-2022	
విశాఖ	547-00
చిత్తూరు	543-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	536-00
విజయవాడ	536-00
రిటైల్ ధర (డజను)	78.00
21-12-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	527-00
వరంగల్	529-00
రిటైల్ ధర	5.80

క్రిప్టో కరెన్సీలు పెరిగిపోతే.. ఆర్థిక సంక్షోభమే!

- ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ హెచ్చరిక
- ధరల కట్టడికి చర్యలు తీసుకుంటున్నట్లు భరోసా
- కేంద్రం కూడా ఈ సమస్యపై దృష్టి పెట్టినట్లు వివరణ

ముంబై: ప్రైవేట్ క్రిప్టోకరెన్సీలు పెరగడానికి అనుమతించడం తదుపరి ఆర్థిక సంక్షోభానికి దారితీస్తుందని రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ బుధవారం హెచ్చరించారు. ద్రవ్యోల్బణంపై పోరాడేందుకు కేంద్ర ప్రభుత్వం–సెంట్రల్ బ్యాంక్ మధ్య ''పటిష్ట సమన్వయ విధానం'' ఉందని రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ వివరించారు. ఆయా అంశాలపై బిజినెస్ స్టాండర్డ్ నిర్వహించిన బీఎఫ్‌ఎస్‌ఐ ఇన్‌సైట్ సమ్మిట్ 2022లో కార్యక్రమంలో శక్తికాంతదాస్ మాట్లాడుతూ, బిట్‌కాయిన్ వంటి ప్రైవేట్ క్రిప్టోకరెన్సీలపై పూర్తి నిషేధం కోసం ఆర్‌బీఐ చేస్తున్న డిమాండ్‌ను పునరుద్ఘాటించారు. అటువంటి సాధనాలకు అంతర్లీన విలువ లేదని, అలాగే అవి స్వభావరీత్యా ఊహాజనితమైనవని చెప్పారు. ''క్రిప్టో కరెన్సీ సాధనలు 100 శాతం ఊహాజనిత కార్యకలాపాలకు సంబంధించినవి. వీటిని నిషేధించాలన్న అభిప్రాయాన్ని నేను ఇప్పటికీ కలిగి ఉన్నాను. మీరు దీన్ని నియంత్రించి (చట్టబద్ధత ద్వారా) దానిని పెంచడానికి అనుమతిస్తే, తదుపరి ఆర్థిక సంక్షోభం ప్రైవేట్ క్రిప్టోకరెన్సీల నుండి వస్తుంది. దయచేసి నా మాటలను గుర్తించండి'' అని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. క్రిప్టోకరెన్సీల వల్ల స్థూల ఆర్థిక వ్యవస్థ, స్థిరత్వాలకు తీవ్ర నష్టం ఉంటుందని తాను భావిస్తున్నట్లు వివరించారు. అమెరికా చరిత్రలో అతిపెద్ద ఆర్థిక మోసాలలో ఒకటిగా పేర్కొనబడిన క్రిప్టోకరెన్సీ ఎక్స్ఛేంజ్ ఎఫ్‌టీఎక్స్ క్రాష్‌తో సహా గత ఒక సంవత్సరం పరిణామాలు.. అటువంటి సాధనాల వల్ల కలిగే ముప్పును వివరిస్తున్నాయని ఆర్‌బీఐ గరవ్నర్ తెలిపారు. ప్రైవేట్ క్రిప్టోకరెన్సీల విలువ 190 బిలియన్ డాలర్ల నుండి 140 బిలియన్ డాలర్లకు తగ్గిపోయిన విషయాన్ని గవర్నర్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఈ మార్కెట్‌కు అంతర్లీన విలువ లేదని స్పష్టం చేశారు.

డిజిటల్ మనీపై ఏమన్నారంటే...

సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ (సీబీడీసీ)పై గవర్నర్ మాట్లాడుతూ, అటువంటి డిజిటల్ మనీదే భవిష్యత్తు అన్నారు. ప్రైవేట్ క్రిప్టోకరెన్సీల ద్వారా ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కొనడానికే సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ వైపు దృష్టి పెట్టిందన్న విమర్శల్లో అర్థం లేదన్నారు. అలాంటి భయాలు సెంట్రల్ బ్యాంక్ ప్రయత్నాలు, నిర్ణయాలను ప్రేరేపించబోవని ఉద్ఘాటించారు. సీబీడీసీ, యూపీఐ వాలెట్‌లు వేర్వేరని పేర్కొంటూ, 24 గంటల్లో డబ్బును తిరిగి ఇచ్చే సామర్థ్యం వంటి కొన్ని ప్రత్యేక లక్షణాలు డిజిటల్ కరెన్సీ విధానంలో ఉన్నట్లు గవర్నర్ తెలిపారు.



ధరలపై ఇలా...

ద్రవ్యోల్బణంపై పోరాడేందుకు కేంద్ర ప్రభుత్వం–సెంట్రల్ బ్యాంక్ మధ్య ''పటిష్ట సమన్వయ విధానం'' ఉందని రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ అన్నారు. ధరల స్పీడ్ కట్టడిపై ఆర్‌బీఐ ఎంత తీవ్రంగా ప్రయత్నిస్తోందో, కేంద్రం కూడా ఆదే స్థాయిలో ఈ అంశంపై దృష్టి సారించిందని అన్నారు. వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం 6 శాతం దాటకుండా చూడాలని ఆర్‌బీఐకి కేంద్రం సూచిస్తోంది. అయితే నవంబర్‌కు ముందు గడచిన 9 నెలల కాలంలో ఈ స్థాయిపై రిటైల్ ద్రవ్యోల్బణం కొనసాగింది. దీనికి కారణాల ఏమిటన్న అంశంపై కొద్ది వారాల క్రితమే కేంద్రానికి ఆర్‌బీఐ ఒక నివేదిక సమర్పించింది. ద్రవ్యోల్బణం కట్టడికి కేంద్రం–ఆర్‌బీఐ సమన్వయ చర్యలను వివరిస్తూ, ''ఆర్‌బీఐ రేట్ల పెంపు, ద్రవ్య విధానాలు, ద్రవ్య లభ్యత (లిక్విడిటీ) విధానాల ద్వారా ద్రవ్యోల్బణం కట్టడికి చర్యలు తీసుకుంటోంది. అదే సమయంలో కేంద్రం పెట్రోల్ లేదా డీజిల్‌పై పన్నులను తగ్గిస్తోంది. దిగుమతి చేసుకున్న ఆహార పదార్థాలపై సుంకాలు తగ్గించడం వంటి పలు సరఫరా వైపు సమస్యల పరిష్కారంపైనా దృష్టి పెట్టింది. ద్రవ్యోల్బణం కట్టడికి తగిన విధాన రూపకల్పనకు ప్రస్తుత ప్రభుత్వ చివరి పూర్తి బడ్జెట్ (2023–24) దృష్టి పెడుతుంది'' అని గవర్నర్ వివరించారు. అంతర్జాతీయ అంశాలు కొంత అనిశ్చితికి గురిచేస్తున్నా, దేశంలో ఆర్థిక వ్యవస్థ క్రియాశీలత పటిష్టంగా కొనసాగుతోందని స్పష్టం చేశారు. రుణ వృద్ధి మరింత పెరగాల్సిన అవసరం ఉందన్నారు.

గవర్నర్ నోట 'మెస్సీ' మాట!

ఈ సదస్సులో ఫుట్‌బాల్ మాంత్రికుడు మెస్సీని ఉదహరిస్తూ, తనపై వస్తున్న విమర్శలకు గవర్నర్ దాస్ చమత్కారపూర్వక సమాధానం చెప్పడం గమనార్హం. హిస్టరీలో పోస్ట్ గ్రాడ్యుయేట్ చేసిన దాస్, ఎకానమీకి సంబంధించి పలు కీలక శాఖలు నిర్వహించడంపై పలువురు విమర్శలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా మెస్సీ పేరును గవర్నర్ ఉదహరిస్తూ, చరిత్రలో మెస్సీ పోస్ట్‌గ్రాడ్యుయేట్ కాకున్నా, చరిత్ర సృష్టించాడని సూచించారు. ఫైర్‌సైడ్ చాట్ సమయంలో దాస్ న్యూఢిల్లీలో తన విద్యార్థి జీవితాన్ని గుర్తుచేసుకున్నారు. వ్యవస్థలో రుణ రేటు పెరుగుదలపై సంక్లిష్ట సంఖ్యలను గుర్తుంచుకోవడానికి డీటీసీ (ఢిల్లీ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్) బస్సు రూట్ నంబర్ ఎలా సహాయపడుతుందో ప్రస్తావిస్తూ, ''బ్యాంకింగ్ వ్యవస్థలో 117 బేసిస్ పాయింట్ల (బీపీసీ) లెండింగ్ రేట్ పెంపు వంటి సంఖ్యలను గుర్తుంచుకోవడం చాలా కష్టం'' అని దాస్ పేర్కొన్నారు. ''రుణ రేట్లు దాదాపు 117 బేసిస్ పాయింట్లు పెరిగాయి. ఈ విషయాన్ని నేను ఎలా గుర్తుంచుకున్నానంటే, నా విద్యార్థి రోజుల్లో, 117 నంబర్ ఉన్న డీటీసీ బస్సు ఉంది'' అని దాస్ చమత్కరించారు.

మార్కెట్‌కు మళ్లీ 'కరోనా' ఫీవర్!

- దలాల్ స్ట్రీట్‌ను కలవరపెట్టిన వైరస్ భయాలు
- ఆర్బీఐ మినిట్స్, యూఎస్ జీడీపీ డేటావెల్లడి నేపథ్యంలో అప్రమత్తత
- నెల కనిష్టానికి సూచీలు
- సెన్సెక్స్ 635 పాయింట్ల పతనం
- నిఫ్టీకి 186 పాయింట్ల నష్టం



ముంబై: దలాల్ స్ట్రీట్‌ను మళ్లీ కరోనా భయాలు చుట్టుముట్టాయి. ఇటీవల చైనాను వణికిస్తున్న కొత్త వేరియంట్ ఒమిక్రాన్ బీఎఫ్.7 వైరస్ తాజాగా భారత్‌తో సహా పలు దేశాల్లోకి ప్రవేశించిందనే వార్తలు మార్కెట్ వర్గాలను కలవరపెట్టాయి. ఆర్‌బీఐ పాలసీ మినిట్స్, అమెరికా జీడీపీ గణాంకాల వెల్లడికి ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించారు. క్రిస్మస్ సెలవుల సందర్భంగా విదేశీ ఇన్వెస్టర్లు ఆయా రంగాల షేర్లలో లాభాల స్వీకరణకు మొగ్గుచూపడం కూడా ప్రతికూలాంశంగా మారింది. ఈక్విటీల్లో అనూహ్య అమ్మకాలు నెలకొనడంతో మార్కెట్లో ఒడిదుడుకులను సూచించే వీఐఎక్స్ ఇండెక్స్ ఒక్కసారి 12%కి దూసుకెళ్లడం ఇన్వెస్టర్లను మరింత కలవరపెట్టింది. ఫలితంగా బుధవారం సెన్సెక్స్ 635 పాయింట్లు క్షీణించి 61,067 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 186 పాయింట్లు పతనమైన 18,199 వద్ద నిలిచింది. ఈ ముగింపు సూచీలకు నెల కనిష్ట స్థాయిలు. కోవిడ్ వ్యాప్తితో అత్యంత ప్రభావితమయ్యే పర్యాటకం, హోటల్స్, విమానయాన, వినోదం, రిటైల్ రంగాలకు చెందిన షేర్లలో ఎత్తున పతనమయ్యాయి. దీంతో బీఎస్‌ఈ స్మాల్‌క్యాప్ ఇండెక్స్ రెండు శాతం, మిడ్‌క్యాప్ ఒకటిన్నర శాతం క్షీణించాయి. అయితే ఫార్మా షేర్లకు డిమాండ్ లభించింది. ఐటీ షేర్లలో షార్ట్ కవరింగ్ కొనుగోళ్లు జరిగాయి. ఆసియాలో చైనా, కొరియా, జపాన్ మార్కెట్లు అర శాతం నష్టపోయాయి. యూరప్ మార్కెట్లు ఒకటిశాతం లాభపడ్డాయి. రూపాయి విలువకూ కరోనా సెగ తగిలింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 14 పైసలు బలహీనపడి 82.84 స్థాయి వద్ద స్థిరపడింది.

మార్కెట్లో మరిన్ని సంగతులు...

- ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న కోవిడ్ కేసుల కారణంగా ఫార్మా, ల్యాబరేటరీస్ షేర్లకు గిరాకీ నెలకొంది. థైరోకేర్ టెక్నాలజీ 15%, ఐఓఎల్ కెమికల్స్ 14%, విజయా డయోగ్నస్టిక్ సెంటర్ 11%, పనాసియా బయోటెక్ 10% దూసుకెళ్లాయి. గ్లెన్ మార్క్, మెట్రోపాలీస్ హెల్త్‌కేర్, మోరోపెన్, డాక్టర్ లాల్‌పాథ్‌ల్యాబ్స్, దీవీస్ షేర్లు 8–5% లాభపడ్డాయి. హెల్త్‌కేర్ ఇండెక్స్ 2.25% ర్యాలీ చేసింది.
- కెఫిన్ టెక్నాలజీ పబ్లిక్ ఇష్యూకు 2.59 రెట్లు స్పందన లభించింది. క్యూఐబీ కోటాలో 4.17 రెట్లు, నాన్ ఇన్‌స్టిట్యూషన్ విభాగంలో 23%, రిటైల్ కోటాలో 1.36 రెట్ల సబ్‌స్క్రిప్షన్ లభించింది.

ద్రవ్యోల్బణాన్ని గమనిస్తూనే ఉన్నాం

- మాంద్యంలోకి వెళ్లకుండా లక్షిత విధానాలు కాపాడాయ్
- రాజ్యసభలో ఆర్థిక మంత్రి సీతారామన్



న్యూఢిల్లీ: అధిక స్థాయిలో ఉన్న ద్రవ్యోల్బణాన్ని ప్రభుత్వం గమనిస్తూనే ఉందని, ధరల భారం పెరగకుండా చూస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ భరోసా ఇచ్చారు. కరోనా మహమ్మారి రాకతో ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి జారిపోకుండా, పైకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం అనుసరించిన లక్ష్యిత విధానాలు తోడ్పడినట్టు చెప్పారు. రాజ్యసభలో మధ్యంతర నిధుల బిల్లుపై చర్చ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. టోకు ద్రవ్యోల్బణం 21 నెలల కనిష్ట స్థాయికి తగ్గినట్టు చెప్పారు. ఈ బిల్లు ఆమోదంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం అదనంగా రూ.3.25 లక్షల కోట్లను వ్యయం చేసేందుకు అవకాశం ఉంటుంది. బిల్లును లోక్‌సభ సైతం ఆమోదించడం గమనార్హం. పన్నుల వసూళ్లు బలంగా ఉన్నాయని వివరిస్తూ.. ప్రభుత్వం ఖర్చు చేసే రూ.3.25 లక్షల కోట్ల అదనపు వ్యయాలకు తగిన వనరులున్నాయని, ద్రవ్యలోటు లక్ష్యాన్ని మించదని ఆర్థిక మంత్రి పేర్కొన్నారు. 2022–23 సంవత్సరానికి జీడీపీలో ద్రవ్యలోటు లక్ష్యాన్ని కేంద్రం 6.4 శాతంగా పేర్కొనడం గమనార్హం. ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకాలు, ఇతర అనుకూల విధానాలతో ప్రైవేటు మూలధన నిధుల వ్యయాలు పుంజుకుంటున్నాయని మంత్రి సీతారామన్ చెప్పారు. బ్యాంకుల స్థూల ఎన్‌పీఏలు 2022 మార్చి నాటికి, ఆరేళ్ల కనిష్ట స్థాయి అయిన 5.9 శాతానికి తగ్గినట్టు సభకు తెలిపారు. మధ్యంతర నిధుల డిమాండ్లు అన్నవి ఆహార భద్రత, ఎరువుల సబ్సిడీల కోసం, దేశ ఆర్థిక వ్యవస్థకు మద్దతు నిచ్చేందుకేనని వివరించారు.

విద్య, ఉద్యోగ సమాచారం

సుప్రీంకోర్టు, న్యూఢిల్లీలో 11 కోర్టు అసిస్టెంట్ పోస్టులు

న్యూఢిల్లీలోని భారత సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఆఫ్ ఇండియా.. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన రిజిస్ట్రీ విభాగంలో.. గ్రూప్ బి నాన్ గెజిటెడ్ పోస్టులు అయిన కోర్టు అసిస్టెంట్(టెక్నికల్ అసిస్టెంట్-కమ్-ప్రోగ్రామర్) ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 11
- **అర్హత:** బీసీఏ, బీఎస్సీ, బీఈ/బీటెక్, ఎంఎస్సీ(కంప్యూటర్ సైన్స్/ఐటీ) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 18 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
- **వేతనం:** నెలకు రూ.80,803 చెల్లిస్తారు.
- **పరీక్ష విధానం:** రాత పరీక్ష(ఆబ్జెక్టివ్ టైప్), టెక్నికల్ ఆప్టిట్యూడ్ టెస్ట్, ప్రాక్టికల్ ఆప్టిట్యూడ్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును రిజిస్ట్రార్(రిక్రూట్‌మెంట్), సుప్రీంకోర్ట్ ఆఫ్ ఇండియా, తిలక్ మార్గ్, న్యూఢిల్లీ చిరునామకు పంపించాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 31.12.2022
- **వెబ్‌సైట్:** www.sci.gov.in

టిస్ నెట్-2023 పీజీలో ప్రవేశాలు

టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్(టిస్).. పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశానికి జాతీయ అర్హత పరీక్ష(నెట్)-2023 నిర్వహించనుంది. అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- **అర్హత:** గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి కనీసం మూడేళ్లు లేదా నాలుగేళ్ల బ్యాచిలర్ డిగ్రీ లేదా పీజీ పూర్తిచేసిన వారు అర్హులు. అభ్యర్థులు భారతీయులై ఉండాలి.
- **పరీక్షా విధానం:** ఆన్‌లైన్‌లో పరీక్ష జరుగుతుంది. 100 మార్కులకు మల్టిపుల్ ఛాయిస్ పద్ధతిలో 100 ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష వ్యవధి 1 గంట 40 నిమిషాలు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**15.01.2023.
- **ప్రవేశ పరీక్ష తేది:** దేశవ్యాప్తంగా ఉన్న పరీక్షా కేంద్రాల్లో జనవరి 28, 2023 నుంచి ఫిబ్రవరి 28, 2023 వరకు ప్రవేశ పరీక్ష జరగనుంది.
- **వెబ్‌సైట్:** admissions.tiss.edu.

డా.వై.ఎస్.ఆర్.హార్టికల్చరల్ యూనివర్శిటీలో ఎంఎస్సీ, పీహెచ్‌డీల్లో ప్రవేశాలు

పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని డా.వై.ఎస్.ఆర్.హార్టికల్చరల్ యూనివర్శిటీ.. 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి హార్టికల్చర్ విభాగాల్లో ఎంఎస్సీ, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

కోర్సుల వివరాలు

- **ఎంఎస్సీ(హార్టికల్చర్):** రెండేళ్ల కాల వ్యవధి. **సీట్ల సంఖ్య:** 57; **విభాగాలు:** ఫ్రూట్ సైన్స్, వెజిటబుల్ సైన్స్, ఫ్లోరికల్చర్ అండ్ ల్యాండ్ స్కేపింగ్, ప్లాంటేషన్, స్పైసెస్, మెడిసినల్-ఏరోమాటిక్ క్రాప్స్, పోస్ట్ హార్వెస్ట్ మేనేజ్‌మెంట్, ప్లాంట్ పాథాలజీ, ఎంటమాలజీ. **అర్హత:** బీఎస్సీ(హార్టికల్చర్)/బీఎస్సీ(ఆనర్స్) హార్టికల్చర్.
- **పీహెచ్‌డీ(హార్టికల్చర్):** మూడేళ్ల కాల వ్యవధి. **సీట్ల సంఖ్య:** 24; **విభాగాలు:** ఫ్రూట్ సైన్స్, వెజిటబుల్ సైన్స్, ఫ్లోరికల్చర్ అండ్ ల్యాండ్‌స్కేపింగ్, ప్లాంటేషన్, స్పైసెస్, మెడిసినల్-ఆరోమాటిక్ క్రాప్స్, పోస్ట్ హార్వెస్ట్ మేనేజ్‌మెంట్, ప్లాంట్ పాథాలజీ, ఎంటమాలజీ.
- **అర్హత:** సంబంధిత విభాగంలో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. **వయసు:** 40 ఏళ్లు మించకూడదు.
- **కోర్సు అందించే కళాశాలలు:** కాలేజ్ ఆఫ్ హార్టికల్చర్(వెంకటరామన్నగూడెం), కాలేజ్ ఆఫ్ హార్టికల్చర్(అనంతరాజుపేట).
- **ఎంపిక విధానం:** ఐసీఏఆర్ ఏఐఈఈఏ(పీజీ)-2022, ఐసీఏఆర్ ఏఐసీఈ జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్(పీహెచ్‌డీ)-2022 సాధించిన ర్యాంకు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా సీటు కేటాయిస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును రిజిస్ట్రార్ డా.వై.ఎస్.ఆర్. హార్టికల్చరల్ యూనివర్శిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, వెంకటరామన్నగూడెం, తాడేపల్లిగూడెం, పశ్చిమగోదావరి జిల్లా చిరునామకు పంపించాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 31.12.2022
- **కౌన్సిలింగ్ తేది:** ఎంఎస్సీ-09.01.2023, పీహెచ్‌డీ-10.01.2023.
- **వేదిక:** కాలేజ్ ఆఫ్ హార్టికల్చర్, వెంకటరామన్నగూడెం, పశ్చిమగోదావరి జిల్లా.
- **వెబ్‌సైట్:** drysrhu.ap.gov.in

ఈసీఐఎల్, హైదరాబాద్‌లో 212 అప్రెంటిస్‌లు

హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఈసీఐఎల్).. 2022-23 సంవత్సరానికి సంబంధించి అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం ఖాళీల సంఖ్య:** 212
- **ఖాళీల వివరాలు:** ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌షిప్-150, డిప్లొమా అప్రెంటిస్‌షిప్ 62.
- **అప్రెంటిస్‌షిప్ వ్యవధి:** ఒక ఏడాది.
- **విభాగాలు:** ఈసీఈ, సీఎస్ఈ, ఈఈఈ, ఈఐఈ, మెకానికల్, సివిల్.
- **అర్హత:** అప్రెంటిస్‌షిప్‌ను అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లో బీఈ/బీటెక్/డిప్లొమా ఉత్తీర్ణులవ్వాలి. **వయసు:** 25 ఏళ్లు మించకూడదు.
- **స్టైపెండ్:** నెలకు రూ.9000, టీఏ రూ.8000 చెల్లిస్తారు.
- **ఎంపిక విధానం:** క్వాలిఫైయింగ్ పరీక్షలో మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**26.12.2022.
- **అప్రెంటిస్‌షిప్ శిక్షణ ప్రారంభతేది:**02.01.2023
- **వెబ్‌సైట్:** www.ecil.co.in

ఐఐఎస్సీ, బెంగళూరులో 76 అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్ పోస్టులు

బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్(ఐఐఎస్సీ).. అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 76
- **అర్హత:** కనీసం 50 శాతం మార్కులతో బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
- **వయసు:** 26 ఏళ్లు మించకూడదు.
- **వేతనం:** నెలకు రూ.21,700 నుంచి రూ.69,100 చెల్లిస్తారు.
- **ఎంపిక విధానం:** జాబ్ ఓరియెంటెడ్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**06.01.2023.
- **వెబ్‌సైట్:** iisc.ac.in

ముంబై పోర్ట్ ట్రస్ట్‌లో 11 అప్రెంటిస్‌లు

ముంబై పోర్ట్ అథారిటీ 2022-23 సంవత్సరానికి సంబంధించి టెక్నీషియన్ /గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ శిక్షణలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం ఖాళీల సంఖ్య:** 11
- **ఖాళీల వివరాలు:** గ్రాడ్యుయేట్ అప్రెంటిస్(మెకానికల్ ఇంజనీరింగ్)-02 సీట్లు; గ్రాడ్యుయేట్ అప్రెంటిస్(ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్)-03 సీట్లు; టెక్నీషియన్ అప్రెంటిస్(మెకానికల్ ఇంజనీరింగ్)-03 సీట్లు; టెక్నీషియన్ అప్రెంటిస్(ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్)-03 సీట్లు.
- **స్టైపెండ్:**నెలకు గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు రూ.9000, టెక్నీషియన్ అప్రెంటిస్‌కు రూ.8000.
- **అర్హత:** సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో డిప్లొమా/డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** కనిష్టంగా 14 ఏళ్లు, గరిష్ట వయోపరిమితి లేదు.
- **ఎంపిక విధానం:** డిప్లొమా/డిగ్రీ పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తులకు చివరితేది:** 09.01.2023.
- **వెబ్‌సైట్:** www.mumbaiport.gov.in

ఎయిర్ పోర్ట్స్ అథారిటీలో 596 జేఈ కొలువులు

జాబ్స్ ఇన్ఫో

కేంద్ర ప్రభుత్వ కొలువు కోరుకునే వారి కోసం ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) ఉద్యోగ ప్రకటన విడుదల చేసింది. ఇందులో భాగంగా వివిధ విభాగాలకు సంబంధించి దేశ వ్యాప్తంగా ఉన్న సంస్థ కార్యాలయాల్లో 596 జూనియర్ ఎగ్జిక్యూటివ్(జేఈ) పోస్టులను భర్తీ చేయనుంది. బీఈ/బీటెక్ విద్యార్హతతో ఈ ఉద్యోగాలను సొంతం చేసుకోవచ్చు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 596
- **విభాగాల వారీగా:** జూనియర్ ఎగ్జిక్యూటివ్(ఇంజనీరింగ్-సివిల్)-62, జూనియర్ ఎగ్జిక్యూటివ్ (ఇంజనీరింగ్-ఎలక్ట్రికల్)-84, జూనియర్ ఎగ్జిక్యూటివ్(ఎలక్ట్రానిక్స్)-440, జూనియర్ ఎగ్జిక్యూటివ్(ఆర్కిటెక్చర్)-10.
- **అర్హతలు:** ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు కనీసం 60శాతం మార్కులతో బీఈ/బీటెక్(సివిల్/ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రికల్/టెలి కమ్యూనికేషన్స్/ఆర్కిటెక్చర్) ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** 21.01.2023 నాటికి 27 సంవత్సరాలు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.
- **వేతనాలు:** ఈ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.40,000–రూ.1,40,000 వరకు వేతనంగా లభిస్తుంది. వీటితో పాటు డియర్‌నెస్ అలవెన్స్, ఏడాదికి బేసిక్‌పేలో 3శాతం ఇంక్రిమెంట్, హెచ్ఆర్ఏ, ఇతర ప్రయోజనాలు పొందవచ్చు.
- **ఎంపిక విధానం:** ఈ పోస్టులకు సంబంధించి గేట్ 2020/2021/2022 స్కోరు, డాక్యుమెంట్ వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా అభ్యర్థులను తుది ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులు రూ.300, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళా అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు లభిస్తుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు ప్రారంభతేదీ:** 22.12.2022
- **దరఖాస్తులకు చివరితేదీ:** 21.01.2023
- **వెబ్‌సైట్:** www.aai.aero

ఎన్‌సీఎల్‌లో 405 ఉద్యోగాలు

దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలు చాలానే ఉన్నాయి. అందులో దేనికదే ప్రత్యేకం. అలాంటి వాటిల్లో ఒకటి.. నార్తర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్(ఎన్‌సీఎల్). ప్రస్తుతం ఈ సంస్థ 405 మైనింగ్ సర్దార్, సర్వేయర్ ఖాళీల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

మొత్తం పోస్టులు-405

- మైనింగ్ సర్దార్ ఇన్ టెక్నికల్ అండ్ సూపర్‌వైజరీ గ్రేడ్(సి)-374
- సర్వేయర్ ఇన్ టెక్నికల్ అండ్ సూపర్‌వైజరీ గ్రేడ్ (బి)-31

వేతనాలు

ఈ పోస్టులకు ఎంపికైన మైనింగ్ సర్దార్‌లకు ప్రతి నెల రూ.31,852, సర్వేయర్ నెలకు రూ.34,391 వేతనంగా లభిస్తుంది.

అర్హతలు

మైనింగ్ సర్దార్ పోస్టుకు మెట్రిక్యులేషన్/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. డీజీఎంఎస్ జారీ చేసిన మైనింగ్ సర్దార్ సర్టిఫికేట్, గ్యాస్ టెస్టింగ్ సర్టిఫికేట్, ఫస్ట్ ఎయిడ్ సర్టిఫికేట్ ఉండాలి. లేదా మైనింగ్ ఇంజనీరింగ్ డిగ్రీ/డిప్లొమా, ఓవర్ మ్యాన్స్ సర్టిఫికేట్ ఆఫ్ కాంపిటెన్సీ, గ్యాస్ టెస్టింగ్ సర్టిఫికేట్, ఫస్ట్ ఎయిర్ సర్టిఫికేట్ కలిగి ఉండాలి.

ఎంపిక ఇలా

రాత పరీక్షలో ప్రతిభ ఆధారంగా ఉద్యోగాలకు ఎంపిక చేస్తారు. కంప్యూటర్ బేస్ట్ టెస్ట్(సీబీటీ) విధానంలో పరీక్షను నిర్వహిస్తారు. రెండు పోస్టులకు వేర్వేరుగా పరీక్షలు ఉంటాయి. వీటిలో సాధించిన స్కోరు ఆధారంగా ఆయా పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

రాత పరీక్ష

ఈ పరీక్షను 100 మార్కులకు 90 నిమిషాల వ్యవధిలో నిర్వహిస్తారు. ఇందులో రెండు సెక్షన్లు ఉంటాయి. సెక్షన్-ఎలో టెక్నికల్ నాలెడ్జ్‌కు సంబంధించి 70 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు(ఎంసీక్యూ) ఇస్తారు. సెక్షన్-బిలో జనరల్ నాలెడ్జ్, జనరల్ అవేర్‌నెస్, రీజనింగ్, వెర్బల్ అండ్ నాన్ వెర్బల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌కు సంబంధించిన 30 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు అడుగుతారు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు కేటాయిస్తారు. రుణాత్మక మార్కులు లేవు.

సిలబస్- మైనింగ్ సర్దార్‌కు

- **సెక్షన్-ఎ:** ఈ విభాగానికి సంబంధించి ఓపెన్‌కాస్ట్ కోల్ మైన్ వర్కింగ్, షాట్ ఫైరింగ్ అండ్ ట్రాన్స్‌పోర్ట్, సేఫ్టీ ఇష్యూస్, ప్రిలిమినరీ ఐడియా అబౌట్ రిక్లమేషన్ ఆపరేషన్ ఇన్ ఓపెన్‌కాస్ట్ మైనింగ్, ప్రిలిమినరీ అండర్ స్టాండింగ్ అబౌట్ సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్, ప్రొవిజన్స్ ఆఫ్ కోల్ మైన్స్ రెగ్యులేషన్స్, రైటింగ్ ఆఫ్ రిపోర్ట్స్ తదితర అంశాలు సిలబస్‌లో ఉన్నాయి.



పీఎస్‌యూ జాబ్స్

- **సెక్షన్-బి:** జనరల్ నాలెడ్జ్: ఈ విభాగంలో జాతీయ, అంతర్జాతీయ వ్యవహారాలు, ఇతర దేశాలతో భారతదేశానికి ఉన్న సంబంధాలు, జనరల్ సైన్స్ తదితర అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- **జనరల్ అవేర్‌నెస్:** స్పోర్ట్స్, డిఫెన్స్, బుక్స్, అవార్డ్స్, భారతదేశం, ప్రజాస్వామ్యం తదితర అంశాలపై ప్రశ్నలుంటాయి.
- రీజనింగ్, వెర్బల్ అండ్ మెంటల్ ఎబిలిటీ, సినానిమ్స్ అండ్ యాంటనిమ్స్ (హిందీ/ఇంగ్లిష్), గ్రామర్ రిలేషన్‌షిప్ మొదలైన అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి.
- **క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్:** వర్క్ రిలేషన్‌షిప్, ప్రాఫిట్ అండ్ లాస్, స్పీడ్ తదితరాల నుంచి ప్రశ్నలుంటాయి.

కటాఫ్ మార్కులు

- మైనింగ్ సర్దార్ పోస్టుకు అన్ రిజర్వ్‌డ్, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు అర్హత పొందాలంటే.. కనీసం 50 మార్కులు; ఎస్సీ/ఎస్టీ, ఈఎస్ఎం, ఓబీసీ-ఎన్‌సీఎల్ అభ్యర్థులైతే 40 మార్కులు సాధించాలి. సర్వేయర్ పోస్టుకు కూడా కటాఫ్ మార్కులు ఇదే విధంగా ఉంటాయి.
- సీబీటీ ఫలితాలను ఎన్‌సీఎల్ వెబ్‌సైట్‌లో ప్రకటిస్తారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన వారిని సర్టిఫికెట్ల పరిశీలనకు పిలుస్తారు. ఆయా తేదీ, సమయాలను వెబ్‌సైట్ ద్వారా తెలియజేస్తారు.

ముఖ్యమైన సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **దరఖాస్తులకు చివరి తేదీ:** 22.12.2022
- **వెబ్‌సైట్:** www.nclcil.in

టీటీడీ ఈవో ధర్మారెడ్డికి పుత్రశోకం

- ఆస్పత్రిలో చికిత్సపొందుతూ చంద్రమౌళి కన్నుమూత
- నేడు నంద్యాల జిల్లా పారుమంచాలలో అంత్యక్రియలు



సాక్షి, చెన్నై/జూపాడుబంగ్లా/సాక్షి, అమరావతి: తిరుమల తిరుపతి దేవస్థానాల (టీటీడీ) ఈవో ఎ.వి.ధర్మారెడ్డికి పుత్రశోకం కలిగింది. ఆయన కుమారుడు చంద్రమౌళిరెడ్డి అలియాస్ శివ (28) చెన్నై కావేరి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం 8.20 గంటలకు కన్నుమూశారు. ధర్మారెడ్డి కుటుంబంలో తీవ్రవిషాదం నెలకొంది. చెన్నైలో బీటెక్ పూర్తిచేసి ముంబైలో ఫైనాన్స్ కన్సల్టెంటుగా ఉద్యోగం చేస్తున్న చంద్రమౌళి ఈనెల 18వ తేదీన చెన్నైలో తన స్నేహితుడితో కలిసి కారులో వెళ్తున్న సమయంలో గుండెపోటుకు గురయ్యారు. దీంతో ఆయన్ని ఆళ్వార్‌పేటలోని కావేరి ఆస్పత్రికి తరలించారు. కార్డియాక్ అరెస్ట్‌తో ఆస్పత్రిలో చేరిన చంద్రమౌళికి ఎక్మో చికిత్స అందిస్తున్నామని, నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని ఆస్పత్రి వర్గాలు సోమవారం బులెటిన్ ద్వారా తెలిపాయి. ఈ సమాచారంతో పెద్దసంఖ్యలో ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రముఖులు, చెన్నైలోని తెలుగు ప్రముఖులు, అధికారులు, సన్నిహితులు కావేరి ఆస్పత్రికి చేరుకుని ధర్మారెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. మూడురోజుల పాటు చంద్రమౌళికి వైద్యులు అత్యవసర వైద్యచికిత్స చేశారు. ఆయన ఆరోగ్య పరిస్థితి మరింత విషమించి బుధవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. ఇందుకు సంబంధించిన బులెటిన్‌ను ఆస్పత్రివర్గాలు 11 గంటల సమయంలో విడుదల చేశాయి. అన్నాడీఎంకే తాత్కాలిక ప్రధాన కార్యదర్శి పళనిస్వామి, మాజీ మంత్రులు, పలువురు ప్రముఖులు ధర్మారెడ్డిని ఓదార్చారు. చంద్రమౌళి కళ్లను కుటుంబసభ్యులు దానం చేశారు. చంద్రమౌళి భౌతికకాయాన్ని ధర్మారెడ్డి స్వగ్రామం నంద్యాల జిల్లా జూపాడుబంగ్లా మండలం పారుమంచాలకు ప్రత్యేక అంబులెన్స్‌లో మధ్యాహ్నం 12 గంటల సమయంలో చెన్నై నుంచి తరలించారు. చంద్రమౌళి మృతితో పారుమంచాల గ్రామంలో విషాదం అలుముకుంది. గురువారం గ్రామంలోని వారి పొలంలో అంత్యక్రియలు నిర్వహించేందుకు బంధువులు ఏర్పాట్లు చేస్తున్నారు.

గవర్నర్, సీఎం సంతాపం: టీటీడీ ఈవో ధర్మారెడ్డి కుమారుడు చంద్రమౌళి ఆకస్మిక మృతి పట్ల గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వేర్వేరుగా సంతాపం తెలిపారు. ధర్మారెడ్డి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.



'మనోబంధు'కు గవర్నర్ అభినందన



గవర్నర్‌కు పుస్తకం అందజేస్తున్న రామకృష్ణరాజు, రామసుబ్బారెడ్డి

సాక్షి, అమరావతి: మతిస్థిమితం లేని పరిస్థితుల్లో దేశంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చి వీధుల్లో అనాథలుగా తిరుగుతోన్న మానసిక రోగులను చేరదీసి వారికి వైద్య చికిత్స అందించి స్వస్థత చేకూరుస్తున్న మనోబంధు సంస్థను గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ అభినందించారు. విజయవాడలోని రాజ్‌భవన్‌లో మనోబంధు ట్రస్టీలు రామకృష్ణరాజు, డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డిలు బుధవారం గవర్నర్‌ను కలిశారు. ఈ సందర్భంగా మానసిక రోగులకు మనోబంధు సంస్థ చేస్తున్నది అత్యున్నత సేవగా గవర్నర్ కొనియాడారు. గడిచిన ఏడాది కాలం నుంచి 150 మంది మానసిక రోగులను మనోబంధు సంస్థ చేరదీసి, వారిని విశాఖ ప్రభుత్వ మెంటల్ ఆస్పత్రిలో చేర్పించి, తగిన చికిత్స అందేలా చూసిందని రామసుబ్బారెడ్డి గవర్నర్‌కు వివరించారు. వీరిలో 55 మందిని తిరిగి స్వస్థలాలకు చేర్చామన్నారు. ఇందులో ఒకరు 15 ఏళ్ల తర్వాత సొంత ఇంటికి చేరుకున్నారన్నారు. రెడ్‌క్రాస్ సంస్థ తరఫున తగిన సహాయ, సహకారాలు అందజేయాలని గవర్నర్‌ను కోరారు.

బలపడిన తీవ్ర అల్పపీడనం

- నేడు వాయుగుండంగా మారే అవకాశం

సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం: తూర్పు భూమధ్య రేఖా ప్రాంతం, హిందూ మహాసముద్రానికి ఆనుకుని నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతోన్న అల్పపీడనం బుధవారం తీవ్ర అల్పపీడనంగా మారింది. ఇది వాయవ్య దిశగా పయనిస్తూ గురువారం నాటికి నైరుతి బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడనుంది. అనంతరం ఆ వాయుగుండం పశ్చిమ నైరుతి దిశగా కదులుతూ శ్రీలంక మీదుగా కొమరిన్ ప్రాంతం వైపు వెళ్లే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) బుధవారం తెలిపింది. దీని ప్రభావం ఏపీపై నామమాత్రంగానే ఉండనుంది. మరోవైపు రాష్ట్రంపైకి ఈశాన్య, ఆగ్నేయ గాలులు వీస్తున్నాయి. వీటి ఫలితంగా రాష్ట్రంలో పొగమంచు కొనసాగనుంది. కనిష్ట ఉష్ణోగ్రతలు కూడా క్షీణిస్తుండడంతో చలి ప్రభావం అధికంగా ఉంటోంది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు రాష్ట్రంలో అత్యల్పంగా అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలో 6 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత రికార్డైంది. గురు, శుక్రవారాల్లో రాష్ట్రంలో పొడి వాతావరణ నెలకొంటుందని ఐఎండీ పేర్కొంది. ఈ నెల 24 నుంచి దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఉత్తర కోస్తాంధ్రలో పొడి వాతావరణం ఉంటుందని తెలిపింది.

భజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సీఎం జన్మదిన వేడుకలు

- ప్రజలకు కంటి పరీక్షలు చేయించిన అంబటి మురళీకృష్ణ



కంటి పరీక్షలు చేయించుకుంటున్న ప్రజలు

కొరిటెపాడు (గుంటూరు వెస్ట్): సీఎం వైఎస్ జగన్ జన్మదినాన్ని పురస్కరించుకుని భజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా పొన్నూరు మండలం మామిళ్లపల్లిలో ఘనంగా వేడుకలను నిర్వహించారు. భజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ గ్రామంలోని దేవాలయంలో పూజలు నిర్వహించి ఈ వేడుకలు ప్రారంభించారు. మహాత్మగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని ఆంధ్రప్రదేశ్‌లో సాకారం చేసిన ప్రజా నాయకుడు, దార్శనికుడు సీఎం వైఎస్ జగన్ అని కొనియాడారు. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని సంవత్సర కాలంపాటు భజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరంగా పాటిస్తున్నామని వెల్లడించారు. గతేడాది సీఎం జగన్ పుట్టిన రోజు సందర్భంగా దక్షిణ భారతదేశంలోనే ప్రప్రథమంగా ఒకేరోజు అత్యధికంగా 1,469 మంది రక్తదాతల నుంచి రక్తం సేకరించి తలసేమియా చిన్నారులకు అందించామని గుర్తు చేశారు. జగన్నామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా వచ్చే ఏడాది కాలంలో 51 గ్రామాల్లో సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. దీనిలో భాగంగా మొదటి కార్యక్రమాన్ని మామిళ్లపల్లిలో నేత్రజ్యోతి పేరుతో నిర్వహించామని తెలిపారు. ఇందులో భాగంగా 1,026 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని.. అవసరమైనవారికి కళ్లజోళ్లు అందిస్తామని వెల్లడించారు. అలాగే విద్యా జ్యోతి పేరుతో 236 మంది విద్యార్థులకు పరీక్షల ప్యాడ్స్ అందించామన్నారు.

అర్చకుల సంక్షేమానికి ఆన్‌లైన్ పోర్టల్ ప్రారంభం

సాక్షి, అమరావతి: పలు ఆలయాల్లో పనిచేసే అర్చకుల సంక్షేమానికి దేవదాయ శాఖ అమలు చేస్తోన్న సంక్షేమ కార్యక్రమాల కోసం ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్‌ను ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ బుధవారం ప్రారంభించారు. రాష్ట్ర సచివాలయంలోని తన చాంబర్‌లో ఆన్‌లైన్ పోర్టల్ ప్రారంభం అనంతరం ఆయన మాట్లాడుతూ..అర్చక సంఘాల అభ్యర్థన మేరకు www.aparchakawelfare.org వెబ్‌సైట్‌ను ప్రారంభించినట్లు చెప్పారు. అర్చకుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలకు ఈ వెబ్‌సైట్‌లో నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అర్చకుల సంక్షేమానికై ''అర్చక మరియు ఇతర ఉద్యోగుల సంక్షేమ నిధి''ద్వారా ఎప్పటికప్పుడు నూతన పథకాలను రూపకల్పన చేసి అమలు చేస్తామన్నారు. ఉపనయనం, విద్యా గ్రాంట్‌తో పాటు అర్చక, ఉద్యోగుల పిల్లల వివాహం, గృహ నిర్మాణం, గృహ మరమ్మతులు, వైద్య ఖర్చులు, ప్రమాదవశాత్తు అంగవైకల్యం పొందిన వారికి ఆర్థిక సహాయాన్ని కూడా అందజేస్తామన్నారు. ఇకనుంచి ఎటువంటి జాప్యానికి తావులేకుండా అర్హులందరికీ వెంటనే పథకాలను మంజూరు చేసే పరిస్థితులు ఈ వెబ్‌సైట్ ద్వారా ఏర్పడతాయని చెప్పారు.





చవ్వా గోపాల్ రెడ్డి ఇంట్లో సీబీఐ సోదాలు



తాడిపత్రిలోని చవ్వా గోపాల్‌రెడ్డి ఇంటి ముందు సీబీఐ అధికారులు

తాడిపత్రి అర్బన్: జేసీ సోదరుల ప్రధాన అనుచరుడు, బీఎస్–3 వాహనాలను స్క్రాప్ కింద కొనుగోలు చేసి వాటిని బీఎస్–4గా చూపుతూ అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన కేసుల్లో ప్రధాన నిందితుడు, జటాధర ఇండస్ట్రీస్ యజమాని చవ్వా గోపాల్‌రెడ్డి ఇంట్లో సీబీఐ అధికారులు బుధవారం సోదాలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటల ప్రాంతంలో తాడిపత్రి సంజీవనగర్ 2వరోడ్డులోని చవ్వా గోపాల్‌రెడ్డికి వచ్చిన సీబీఐ అధికారులు ఇంట్లోని విలువైన పత్రాలను పరిశీలించినట్లు తెలిసింది.

బ్యాంకుకే కన్నం వేసిన ఘనుడు!

తాడిపత్రికి చెందిన జేసీ సోదరుల ప్రధాన అనుచరుడిగా ఉన్న చవ్వా గోపాల్‌రెడ్డి క్లాస్ వన్ కాంట్రాక్టర్‌గా వివిధ రాష్ట్రాల్లో పనులు చేస్తున్నాడు. ఈ క్రమంలోనే ఓ పని నిమిత్తం నాగాలాండ్ రాష్ట్రం కోహిమాలోని కెనరా బ్యాంకులో రూ.160 కోట్లు రుణం తీసుకున్నారు. ఇందుకు బ్యాంకు గ్యారెంటీగా నాగాలాండ్‌లోని పంజాబ్ నేషనల్ బ్యాంకు ఇచ్చినట్లు పత్రాలు సృష్టించి కెనరా బ్యాంకు అధికారులకు సమర్పించాడు. రుణం మంజూరు చేసిన అధికారులు ఆ తర్వాత బ్యాంకు గ్యారెంటీ పత్రాలను పరిశీలంచగా అవి నకిలీవని తేలింది. దీంతో కెనరా బ్యాంకు అధికారులు ఫిర్యాదు చేయగా, ఈ కేసును ప్రభుత్వం సీబీఐకి అప్పగించింది. ఈ క్రమంలోనే బుధవారం తాడిపత్రికి వచ్చిన సీబీఐ అధికారులు చవ్వా గోపాల్‌రెడ్డి ఇంట్లో సోదాలు చేపట్టారు. పలు కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. కాగా, ఇటీవలే ఈడీ అధికారులు కూడా చవ్వా గోపాల్‌రెడ్డి ఇంటిపై దాడులు చేసి కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే.



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798.